ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక


సంపుటి: 4 సంచిక: 12

జనవరి, 2013



ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**హెచ్. కూర్మారావు**

**డా॥ సి. నాగరాజు**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**

**డా॥ వి. శివ శంకర ప్రసాద్**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

AMR-APARD Estd. 1954



ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ..... 2
రాజీవ్ యువ కిరణాలతో యువత భవిత పదిలం ..... 3
భూటాన్ పార్లమెంట్ సభ్యులకు అపార్డ్‌లో శిక్షణ ..... 4
అపార్డ్‌లో భూటాన్ జాతీయ దినోత్సవ వేడుకలు ..... 5
అపార్డ్‌ను సందర్శించిన యెమెన్ బృందం ..... 6
పంచాయితీ రాజ్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేస్తాం – రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖామాత్యులు శ్రీ కె. జానారెడ్డి ..... 8
ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలకు చట్టబద్ధత ..... 9
జాతీయ తేనెటీగల బోర్డ్ ఆధ్వర్యంలో తేనేటీగల పెంపకంలో మెళుకువలపై అపార్డ్‌లో శిక్షణ ..... 14
పాత చెక్కులకు చెల్లు చీటీ ..... 15
పథకానికి పది ప్రశ్నలు – వై.యస్.ఆర్ అభయ హస్తం పథకం ..... 17
విజేతలు కావాలనుకుంటున్నారా? ..... 18
భారతీయ సంస్కృతిలో భాగమైన మానవ హక్కులు ..... 19
జాతీయ పతాక నియమావళి ..... 21
గ్రామ పంచాయతీలలో టెలీకమ్యూనికేషన్ టవర్ల స్థాపన నియమావళి – 2012 ..... 23
మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ..... 25
బి.ఎన్.వి.ల చొరవతో వలసలు లేని గ్రామంగా మారిన కనపర్తి ..... 26
బి.ఎన్.విల కృషితో పొగాకురహిత గ్రామంగా మారిన పొంగలిపాక ..... 27
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో సోలార్ గ్రామంగా రూపొందిన కన్నపుకుంట ..... 28
జాతీయ పంచాయితీ పోర్టల్‌కు వెబ్‌రత్న గోల్డెన్ ఐకాన్ అవార్డు ..... 29
అపార్డులో క్రిస్మస్ సంబరాలు ..... 30
యువ చైతన్య సదస్సుల ద్వారా భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అవగాహనా సదస్సులు – కర్నూలు జిల్లా అధికారుల చొరవ ..... 31
భారత్ నిర్మాన్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 32
మన జాతీయ పండగ ..... 34
వికలాంగుల శ్రమ శక్తి సంఘాల సభ్యులకు సత్కారం ..... 36
ఉపాధి హామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ..... 37
సంక్రాంతి సంబరంలో అంబరాన్నంటే ఆనందం ..... 38
ప్రభుత్వ సబ్సిడీ పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పు నగదు బదిలీ పథకం ..... 40
చిరుధాన్యాల్లో పోషక విలువలు ..... 41
కార్మికబంధు వరాహగిరి వెంకటగిరి ..... 43
బి.ఎన్.వి. లకు అపార్డ్ ద్వారా ఉపాధి నైపుణ్య శిక్షణ ..... 45
సేవ ఒక యోగసాధన ..... 46
ఉన్నత విద్యయే స్త్రీ సమానత్వానికి సాధికారతకు మూలం ..... 47
ప్రకాశం జిల్లా భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలు – నమ్మలేని నిజాలు ..... 49
షెడ్యూల్డు తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం–2006 ..... 51
గిరిజన జీవనంలో "సంత" ఎంతో ప్రధానం ..... 53
ఉపాధి హామీ పథకంతో వెలుగుబాట ..... 55
ఇందిరప్రభ వెలుగులు ..... 56
ఆధునిక పరికరాలతో వ్యవసాయ సాగు ..... 57
గిరిజన మహిళా శక్తి ..... 60
పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చటానికికే భారత నిర్మాణ్ వాలంటీర్లు ..... 64

# నూతన సంవత్సరానికి వినూత్న కార్యక్రమాల తోరణం

నూతన సంవత్సరం - 2013 వచ్చింది. 2012 కాలగర్భంలో కలిసిపోయింది. ఎన్నో మెరుపులను, కొన్ని మరకలను వెంటబెట్టుకుని. అపార్డ్‌కు మాత్రం ఇదెంతో ప్రత్యేకమైన సంవత్సరం. పలు వినూత్న కార్యక్రమాలతో, విదేశీ ప్రముఖుల సందర్శనలతో, ప్రతిష్ఠాత్మకమైన అవార్డులతో, పలువురి ప్రశంసలతో, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల వంటి స్ఫూర్తి దాయకమైన శిక్షణా కార్యక్రమాలతో అపార్డ్ ఈ నూతన సంవత్సరానికి స్వాగతతోరణం కడుతోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డు అపార్డ్ నిర్మించిన 'మీరూ ఆలోచించండి' అనే డాక్యుమెంటరీ చిత్రానికి దక్కింది. అంతేకాక, ఇ- ఇండియా - 2011 అవార్డు, బిఎస్‌విల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అవార్డు - 2010-11, ఉత్తమ వెబ్‌సైట్ అవార్డు, లాడ్లీ మీడియా అవార్డు వంటి ఎన్నో అవార్డులు అపార్డ్ కీర్తి కిరీటంలో చేరాయి. వీటిలో లాడ్లీ మీడియా అవార్డు మరింత ప్రత్యేకం. యునైటెడ్ నేషన్సు పాపులేషన్ ఫండ్ సంస్థ ఇచ్చే ఈ అవార్డ్‌ను ఒక ప్రభుత్వ సంస్థ దక్కించుకోవటం ఇదే ప్రథమం. యువతను ప్రోత్సహించి గ్రామ నిర్మాణం వైపు దిశానిర్దేశం చేయటం. అభినందనీయం అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ డి. మాణిక్యవరప్రసాద్ అపార్డుకి కితాబిచ్చారు. కీ కాప్ కార్యక్రమం గ్రామీణాభివృద్ధిలో ఒక నిశ్శబ్ద విప్లవమని మంత్రి కొనియాడారు.

ఇక అనేక దేశాల నుంచి వచ్చిన ప్రతినిధి బృందాలు అపార్డ్ కు వచ్చి, ఇక్కడ అమలు జరుగుతున్న కార్యక్రమాలు పరిశీలించి, అపార్డ్‌ను ప్రశంసలతో ముంచెత్తటం యావత్ అపార్డ్ కుటుంబానికి సంతోషదాయకం. నార్వే, అమెరికా, భూటాన్, యెమెన్ తదితర దేశాల ప్రతినిధి బృందాలు గత సంవత్సరం అపార్డ్‌ను సందర్శించాయి. అపార్డ్ అమలు చేస్తున్న 'సమభాగం' కార్యక్రమాన్ని పరిశీలించిన న్యూయార్క్‌లోని యుఎన్ ఉమెన్ బృందం ఎంతో సంతృప్తి చెందింది. భూటాన్, యెమెన్ దేశాల బృందాలకు అపార్డ్ సంస్థ శిక్షణా వేదికగా నిలవటం సంస్థకు గర్వకారణం.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కూడా అపార్డ్‌ని ఉత్తమ ఎస్ఐఆర్‌డి (రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ)గా గుర్తించింది. అపార్డ్ అమలు చేస్తున్న కీ - క్యాప్ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి ప్రశంసలు లభించాయి. అపార్డ్‌ని సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ జైరామ్ రమేష్ ఇక్కడి వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం అద్భుతమని మెచ్చుకున్నారు. అపార్డ్‌లో శిక్షణకోసం పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ క్యాంపస్‌లో గత సంవత్సరంలో 300 మందికి అదనంగా హాస్టలు సదుపాయం అందుబాటులోకి తీసుకొని రావటం జరిగింది. అదేవిధంగా విస్తరణ శిక్షణా కేంద్రాలలో కూడా కనీసం 100 మంది సరిపడా హాస్టలు సదుపాయం రానున్న రెండు లేక మూడు నెలల కాలంలో అందుబాటులోకి రానుంది.

గ్రామ రెవెన్యూ అధికారులకు అపార్డ్ శిక్షణ ప్రారంభించడంతో, 1172 మంది విఆర్‌వోలు ఇక్కడ శిక్షణ పొందారు. రెవెన్యూ శాఖ చరిత్రలో 1172 మంది విఆర్‌వోలు సంస్థాగత శిక్షణ పొందటం రాష్ట్ర స్థాయిలోనే ప్రప్రథమని రాష్ట్ర రెవెన్యూ శాఖామాత్యులు శ్రీ రఘువీరారెడ్డి కితాబిచ్చారు. రాష్ట్ర గవర్నర్ శ్రీ నరసింహన్ కూడా అపార్డ్‌ను సందర్శించి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ - అపార్డ్‌ల సమిష్టి కార్యక్రమాలు రాష్ట్ర విద్యా రంగంలో ఆహ్వానించదగ్గ పరిణామని అభినందించారు. ఈ ఏడాది కాలంలో ఇలాంటి మెరుపులు ఎన్నో... ఎన్నెన్నో...!

అన్నింటిలో తలమానికం అనదగిన కార్యనిర్వహణ ఏమిటంటే - అక్టోబర్ 20,2011 నుంచి అక్టోబర్ 23, 2012 వరకు గల ఏడాది కాలంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా 3 రోజులు సెలవు మినహా, 365 రోజుల పాటు నిర్విరామంగా, నిరంత రాయంగా, అలుపెరగకుండా 'అపార్డ్' పనిచేసింది. విధి నిర్వహణ పట్ల అపార్డ్ కనబరుస్తున్న అంకిత భావానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి అవసరమని నేననుకోను.

ముందు ముందు కూడా ఇలాంటి అంకిత భావాన్ని, చిత్త శుద్ధిని అపార్డ్ కనబరుస్తుందని హామీ ఇస్తూ... నూతన సంవత్సరానికి శుభాకాంక్షలస్వాగతం!

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...

(కె. చంద్రమౌళి)

# రాజీవ్ యువ కిరణాలతో యువత భవిత పదిలం

**- ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి**




**రాజీవ్ యువకిరణాల్లో శిక్షణ పొంది పలు రంగాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్న అభ్యర్థులతో డిసెంబర్ 5, 2012న అపార్డ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, ఎటువంటి సమస్యలకైనా మార్గాన్ని చూపుతుందని తెలిపారు. అందువల్లే, ఎటువంటి సమస్యలు ఎదురైనా విద్యను కొనసాగించాలని ఆయన కోరారు. కుటుంబ సమస్యలతో, ఇతర సమస్యలతో ఇప్పటికే చదువును మధ్యలో ఆపినవారు చదువును మరలా కొనసాగించాలని, అటువంటి వారికి ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ యువకిరణాల్లో గత ఏడాది 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఈ ఏడాది 3 లక్షల 60 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అందుకై రూ. 777 కోట్లు ఖర్చు చేశామని ఆయన అన్నారు. అదే విధంగా, వచ్చే ఏడాది 6 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రాజీవ్ యువకిరణాల్లో శిక్షణ పొంది ఉద్యోగం నిర్వహిస్తున్నవారు ఎక్కువగా 25 సంవత్సరాల లోపు వారేనని, కాబట్టి వీరు ఎంచుకున్న రంగాలలో కొద్దికాలం తరువాత మంచి ప్రావీణ్యం పొందుతారని ముఖ్యమంత్రి తెలిపారు.

ఉద్యోగ జాతర పేరుతో ప్రభుత్వ ఉద్యోగాలు సైతం లక్షా 25 వేల మందికి కల్పించేందుకు నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అందులో ఇప్పటికే 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ యువకిరణాలు, ఉద్యోగ జాతర ఈ రెండు పథకాలపై నిరుద్యోగులకు పలు అనుమానాలు ఉన్నాయని, రాజీవ్ యువకిరణాలు ద్వారా ఒక వ్యక్తికి ఏ విధమైన పరీక్ష లేకుండా, శిక్షణ ఇచ్చి ఆ తరువాత అతనికి ప్రైవేటు సంస్థలలో ఉద్యోగం చూపబడుతుందని, కాబట్టి అది ఖచ్చితంగా ప్రైవేటు ఉద్యోగమని తెలిపారు. అదే ఉద్యోగ జాతరలో ప్రతి ఉద్యోగానికి నోటిఫికేషన్ వెలువడుతుందని, ఆ తరువాత ఆ ఉద్యోగానికి సంబంధించి పరీక్ష ఉంటుందనీ, ఆ తరువాత ఇంటర్వ్యూ ద్వారా ఆ వ్యక్తిని ఎంపిక చేస్తారని, కాబట్టి ఇది పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగమని, ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉందని ముఖ్యమంత్రి వివరించారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీ డి. శ్రీధర్‌బాబు, జిల్లా మంత్రి శ్రీ ప్రసాద్ కుమార్, హోంమంత్రి శ్రీమతి సబితా ఇంద్రా రెడ్డి, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీమతి వాణీ ప్రసాద్, శాసన సభ్యులు శ్రీ సుధీర్ రెడ్డి, ఆకుల రాజేంద్ర, శ్రీ భిక్షపతి యాదవ్, శ్రీ ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎం.ఎల్.ఏ శ్రీ రత్నం, పలువురు ఐ.ఏ.ఎస్. అధికారులు పాల్గొన్నారు. ◆



Sthanika_Color_jan13.indd 23 29/12/12 5:48 PM



# భూటాన్ పార్లమెంట్ సభ్యులకు అపార్డ్‌లో శిక్షణ

**మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ రాజకీయాల్లో మహిళా భాగస్వామ్యాన్ని పెంపొందించటం ద్వారా పౌర సేవలలో గుణాత్మక మార్పును తీసుకువచ్చే ఉద్దేశ్యంతో భూటాన్‌కు చెందిన 5 గురు పార్లమెంటు సభ్యులు, 17 మంది భూటాన్ సెక్రటేరియేట్ అధికారులకు 'జండర్ సెన్సిటివ్ గవర్నెన్స్,' తదితర పరిపాలన అంశాలపై డిసెంబర్ 10 నుండి డిసెంబర్ 21, 2012 వరకు 12 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ గారు డిసెంబర్ 10వ తేదీన ప్రారంభించారు.**

ఈ సందర్భంగా భూటాన్ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, భూటాన్ ప్రజాప్రతినిధులు, సెక్రటరియేట్ అధికారులు అపార్డుకు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. భూటాన్ రాజరిక పాలన నుండి ప్రజాస్వామ్యం వైపు మారడం భూటాన్ దేశ అభివృద్ధికి శుభసూచకమన్నారు. ఆహారపు అలవాట్లు, సంస్కృతులలో భారతదేశం, భూటాన్ దేశాలు ఒకేలా ఉంటాయన్నారు.

భారతదేశం అతి పెద్ద ప్రజాసామ్యం అయితే భూటాన్ ఇప్పుడే చిగురిస్తున్న ప్రజాస్వామ్యం అని మంత్రి అన్నారు. దేశంలోనే అత్యుత్తమ శిక్షణ ఇచ్చే సంస్థగా ఇటీవల కాలంలో అపార్డ్ ఎదిగిందని, ఈ శిక్షణ ద్వారా మంచి అనుభవంగల ఐ.ఎ.ఎస్ అధికారులు, రాజనీతిజ్ఞులు, యూనివర్శిటీ ఉపన్యాసకులతో మంచి శిక్షణ అందజేయటం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో భూటాన్ పార్లమెంట్ సభ్యులు శ్రీ దుర్గాప్రసాద్ ఛేత్రి, కర్మావాంగ్ ఛుక్, లీలా ప్రధాన్, ఉగ్సేన్ వాంగ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఫున్‌ట్సో మరియు 17 మంది పార్లమెంటు సెక్రటేరియేట్ అధికారులు పాల్గొన్నారు.

ఈ 12 రోజుల శిక్షణా కార్యక్రమంలో నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహించటమేకాక, రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాలకు ఈ బృందాన్ని తీసుకొని వెళ్ళి రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అంతేకాక క్షేత్ర పర్యటనల ద్వారా వివిధ ప్రజాస్వామిక సంస్థల పనితీరుని ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశాన్ని ఈ శిక్షణను అందచేసిన వారిలో కల్పించడం జరిగింది.

వాటిలో ముఖ్యంగా "ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర - శ్రీ కె. శ్రీరామచంద్రమూర్తి సి.ఇ.ఓ.హెచ్.ఎమ్.టి.వి.; మహిళా సాధికారతా దృక్కోణంలో చట్టాలు మరియు విధాన నిర్ణయాలు- శ్రీమతి ఛాయారతన్ ఐ.ఎ.ఎస్., పార్లమెంటు పాత్ర - ప్రజాసామ్యంలో సవాళ్ళు - ప్రొ॥ కె. నాగేశ్వర్ ఎమ్.ఎల్.సి.; భారతదేశంలో స్థానిక స్వపరిపాలన విధానం - శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్. కమీషనర్, అపార్డు; వికేంద్రీకరణ మరియు లింగ బాధ్యతాయుతంగా పాలన - శ్రీమతి నిర్మాలా బుచ్; పార్లమెంట్ బాధ్యత - జవాబుదారీతనం - ప్రొ॥ హరిగోపాల్, పార్లమెంటులో బిల్లులు అమలు అయ్యే విధానం - శ్రీ కుప్పుస్వామి, అడిషినల్ సెక్రటరీ, లా డిపార్టమెంట్, పార్లమెంట్ మరియు పౌరసమాజం - ప్రొ॥ జి. కృష్ణా రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షపాత్ర - శ్రీ డి.కె. సమరసింహారెడ్డి, మాజీ మంత్రివర్యులు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ పాత్ర - డా॥ జి. వివేకానంద, పార్లమెంట్ సభ్యులు, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ సంస్థల పాత్ర - ప్రొ॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్, మాజీ ఉపకులపతి, టెక్నాలజీ-మహిళల పాత్ర - టెక్నాలజీని మహిళలు అందిపుచ్చుకుంటున్నారా - శ్రీ సురేష్ చందా ఐ.ఎ.ఎస్. కమీషనర్, వాణిజ్యశాఖ, లింగప్రణాళికలో ప్రాముఖ్యత - ప్రొ॥ సూర్యనారాయణరెడ్డి, అపార్డు, ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ సంస్థలు మరియు పార్లమెంటరీ స్థాయి సంఘాల పాత్ర - ప్రొ॥ కల్పనా కన్నబిరన్, డైరెక్టర్, సెంటర్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్.

మొదలగు అంశాలపై నిష్ణాతులైన అధ్యాపకులచే తరగతులు నిర్వహించటమే కరీంనగర్ జిల్లా ములకనూరు సహకార బ్యాంకు, నల్గొండ జిల్లా నాగార్జున కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ మొదలగు ప్రదేశాలకు ఎక్స్‌పోజర్ విజిట్స్‌కు తీసుకువెళ్ళడం జరిగింది. ◆



Sthanika_Color_jan13.indd 22 29/12/12 5:48 PM



# అపార్డ్‌లో భూటాన్ జాతీయ దినోత్సవ వేడుకలు



**అపార్డ్‌లో డిసెంబర్ 17, 2012న 105 వ భూటాన్ జాతీయం దినోత్సవాలను ఆదేశానికి చెందిన పార్లమెంటు సభ్యులు, సచివాలయ అధికారులు ఘనంగా నిర్వహించుకున్నారు. జెండర్ సెన్సిటివ్ గవర్నెన్స్, పరిపాలనా అంశాలపై అపార్డ్‌లో శిక్షణ పొందుతున్న భూటాన్ పార్లమెంటు సభ్యులు, సచివాలయ అధికారులు అపార్డ్ ఉద్యోగులతో కలసి ఈ సంబరాలను జరుపుకున్నారు భూటాన్ జాతీయ పతాకాన్ని, స్థానిక పార్లమెంటు సభ్యులు శ్రీ ఉగ్సేన్ వాంగ్డి ఎగురవేశారు. అనంతరం భూటాన్ జాతీయగీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ దేశ జాతీయ వేడుకల్ని అపార్డ్‌లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని కలుగచేసిందుకు అపార్డ్ కమీషనర్ శ్రీ చంద్రమౌళికి వారు కృతజ్ఞతలు తెలిపారు.**

1907 సంవత్సరం నుండి భూటాన్‌లో ఈ వేడుకల్ని అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, విద్యాలయాలు జరుపుకుంటాయన్నారు. భూటాన్ ప్రజల్లో స్థూల ఆనందసూచిక (గ్రాస్ హ్యాపినెస్ ఇండెక్స్) తీసుకురావడమే తమ దేశ గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ, భూటాన్ చిన్న దేశమైనా ప్రగతిబాటలో పయనిస్తున్న దేశమని, భూటాన్ దేశ అభివృద్ధికి భారతదేశం ఎప్పుడూ తోడ్పాటు ఇస్తుందని తెలిపారు. భూటాన్ దేశం రాజరిక పాలన నుండి ప్రజాసామ్య ప్రభుత్వానికి మారటం భూటాన్ దేశ అభివృద్ధికి శుభసూచికమన్నారు. అపార్డ్, భూటాన్ పార్లమెంటు అనుబంధం కలకాలం నిలవాలని ఆకాంక్షించారు.



Sthanika_Color_jan13.indd 25 29/12/12 5:49 PM



# అపార్డ్‌ను సందర్శించిన యెమెన్ బృందం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గూర్చి తెలుసుకోవటానికి 21 సభ్యులుగల యెమెన్ దేశ బృందం డిసెంబర్ 3, 2012న అపార్డ్‌ను సందర్శించింది. బృందానికి ఆహ్వానం పలికిన అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గూర్చి తెలుసుకోవటానికి విదేశీ బృందాలు అపార్డుకి రావటం ఆనందదాయకమన్నారు. ఈ 21 మంది బృందంలో యెమెన్ గ్రామీణాభివృద్ధి శాఖ, మానవ వనరుల శాఖ, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, ఇతర అధికారులు ఉన్నారు.

ఈ బృందం ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ 3 నుండి 7 వరకు పర్యటించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుని అధ్యయనం చేసింది.

ఈ పర్యటనలో భాగంగా అపార్డుని సందర్శించిన యెమెన్ బృందానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రమణ్యం, ఐ.ఎ.ఎస్ ఉపాధి హామీ పథకం ఉద్దేశ్యాలు, అమలులో అనుసరిస్తున్న వ్యూహాల గూర్చి వివరించారు.

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు శ్రీ శశిభూషణ్, ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ, 100 రోజుల పనిని హక్కుగా కల్పిసున్న ఏకైక పథకం





Sthanika_Color_jan13.indd 13 29/12/12 5:48 PM



ఉపాధి హామీ పథకమని, ఇది మరే దేశంలో చట్టబద్ధం కాలేదని, భారతదేశంలోనే అమలు జరుగుతోందని, అందులోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని అన్నారు.

ఈ సందర్భంగా యెమెన్ బృందానికి ప్రాతినిధ్యం వహించిన మిస్. మీరా మాట్లాడుతూ, యెమెన్‌లో కూడా ఉపాధి హామీ వంటి పథకాలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లోని అధ్యయనం ఆ పథకాన్ని మరింత అభివృద్ధి పర్చటానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అపార్డ్‌లో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను యెమెన్ ప్రతినిధులు సందర్శించారు.

ఈ బృందం 4 న మెదక్ జిల్లా, 5 న వరంగల్ జిల్లా, 6 న విశాఖపట్నం సందర్శించి, ఉపాధి హామీలో సహజ వనరుల సంరక్షణకు చేపడుతున్న బండ్ ప్లాంటేషన్, చెరువుల మరమ్మత్తు పనులు, జల సంరక్షణ పనులు సందర్శించారు. అక్కడ ఉన్న శ్రమశక్తి సంఘాలతో మాట్లాడారు.

అనంతరం మండల కంప్యూటర్ సెంటర్ పని తీరుని పరిశీలించారు. సామాజిక తనిఖీ ప్రక్రియను గూర్చి కూడా తెలుసుకున్నారు. వికలాంగుల కోసం ఉపాధి హామీలో కల్పించిన సౌకర్యాలను గూర్చి కూడా వికలాంగుల శ్రమశక్తి సంఘాలతో మాట్లాడి తెలుసుకున్నారు. పర్యటనను ముగించుకున్న యెమెన్ బృందం తిరిగి డిసెంబర్ 18న అపార్డ్‌కి వచ్చింది. తమ అనుభవాలను రాష్ట్ర ఉన్నతాధికారులతో పంచుకుంది.

## "ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం భేష్- యెమెన్‌లో కూడా అమలు చేయటానికి ప్రయత్నిస్తాం"


గ్రామీణాభివృద్ధి శాఖ అనుసరిస్తున్న వ్యూహాలను తమ దేశంలో కూడా ప్రవేశపెట్టటానికి నివేదికలు రూపొందిస్తామని ఈ బృందం ముగింపు సమావేశంలో తెలియజేసింది.

పథకం అమలులో వేగం పెంచటానికి వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత కోసం అమలు చేస్తున్న సామాజిక తనిఖీ, వివిధ స్థాయిల్లోని అధికారుల మధ్య పని విభజన వంటిని తమను ఆకట్టుకున్నాయని ఈ బృందం అభిప్రాయపడింది.

వికలాంగుల కోసం ప్రత్యేకంగా పనులు కేటాయించటం ముదావహమని బృందం సభ్యులు అన్నారు. ఉపాధి హామీ పథకంలో విశాఖ జిల్లాలో కాఫీ తోటల పెంపకం ప్రాజెక్టు విజయవంతంగా నిర్వహించటం బాగుందని కూడా వారు చెప్పారు.

యెమెన్‌కు కాఫీ తోటల పెంపకంలో వంద సంవత్సరాల పైబడిన అనుభవం ఉందని, అయితే ఈ రంగంలో కార్మికులకు ఉపాధి కల్పించటానికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ అనుభవం ఉపయోగపడుతుందని అన్నారు.

యెమెన్ దేశంలో సోషల్ ఫండ్ ఫర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం క్రింద శ్రామిక ఉపాధి కార్యక్రమం అమలు అవుతోందని, ఈ పథకాన్ని అమలు చేయటంలో ఆంధ్రప్రదేశ్ పర్యటన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఉపాధి హామీ పథకం డైరక్టర్ శ్రీమతి కరుణ, ఐ.ఎ.ఎస్, స్పెషల్ కమీషనరు శ్రీ విద్యాసాగర్, ఐ.ఎఫ్.ఎస్; అడిషనల్ కమీషనర్ శ్రీ రాజేశం; జాయింట్ కమీషనరు శ్రీ ఈశ్వరప్రసాద్; వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి శ్రీ సంజయ్ అగర్వాల్; సి.ఎస్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ హెచ్. కూర్మారావు; మీడియా పబ్లికేషన్స్ సెంటర్ హెడ్ డా.వి.ఎస్.ఎస్. ప్రసాద్; జాయింట్ డైరక్టర్ డా. నాగరాజు, ఫ్యాకల్టీ సభ్యులు శ్రీ జయపాల్‌రెడ్డి, మొగలయ్య, ఉషారాణి, రూన్సీరాణి, హరిప్రియ, హలీం తదితరులు పాల్గొన్నారు.



Sthanika_Color_jan13.indd 14 29/12/12 5:48 PM




# పంచాయతీ రాజ్‌శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తాం - రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖామాత్యులు శ్రీ కె. జానారెడ్డి

**ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు రూపొందించిన టేబుల్ కేలండర్ మరియు పంచాయితీ రాజ్ శాఖకు సంబంధించిన వివరాలు తెలిపే వెబ్‌సైట్ (apprewa.blog.com) ను డిసెంబర్ 5, 2012న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖా మంత్రి శ్రీ కె. జానారెడ్డి ఆవిష్కరించారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ శాఖకు సంబంధించి జి.ఓ.లు, చట్టాలు, రాష్ట్రం మొత్తం మీద ఉన్న పంచాయితీ రాజ్ ఉద్యోగుల వివరాలు, పంచాయితీ రాజ్ శాఖకు సంబంధించిన పలు అంశాలను వ్యక్తిగత శ్రద్ధతో ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం అభినందనీయమని అన్నారు. ఈ వెబ్‌సైట్ పంచాయితీ రాజ్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

అదే విధంగా 2013 సంవత్సరానికి సంబంధించిన కేలండర్‌ను మొదటగా విడుదల చేసిన ఘనత పంచాయితీ రాజ్ ఉద్యోగులదేనని వివరించారు. పంచాయితీ రాజ్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పంచాయితీ రాజ్ ఉద్యోగుల ప్రమోషన్లపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, పలు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.ఎం.బి. బుచ్చిరాజు, అసోసియేట్ అధ్యక్షులు శ్రీ ఎం. జయరామ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీ శరత్ చంద్ర, ట్రెజరర్ శ్రీ ఎ. రవికుమార్, పబ్లిసిటీ సెక్రటరీ శ్రీ కె. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీమతి వేదవతి, కె. విద్యారాణి, బి. మహాలక్ష్మి, జాయింట్ సెక్రటరీ జి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



Sthanika_Color_jan13.indd 29 29/12/12 5:49 PM

# ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలకు చట్టబద్ధత

## ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక ఘట్టం



**భారత స్వాతంత్ర్య సంగ్రామ పోరాట సమయంలో భారతదేశంలో నివసిస్తున్న కోట్లాది మంది నిమ్న జాతుల వారు అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం, నిరక్షరాస్యత, అస్పృశ్యతలను సామాజిక, ఆర్థిక, శాస్త్రీయ కోణాలలో, లండన్‌లో నవంబర్ 12, 1930 నాడు ప్రారంభమైన రౌండ్ టేబుల్ సమావేశాలలో ప్రపంచ సమాజం ముందు ఉంచడంలో భారత రత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ కృతకృత్యులు కాగలిగారు.**

దాని ఫలితంగా బ్రిటిషు ప్రభుత్వం భారత దేశంలోని నిమ్న జాతుల వారు ప్రత్యేక నియోజకవర్గాల నుండి ఎన్నిక కాబడేటట్లు ఆగష్టు 14,1932 నాడు **కమ్యూనల్ అవార్డును** ప్రకటించటం జరిగింది. ప్రత్యేక నియోజక వర్గాల నుండి నిమ్న జాతుల ఎంపిక విధానానికి నిరసనగా మహాత్మాగాంధీ గారు ఎరవాడ జైలులో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను విరమింపజేయడానికి డాక్టరు అంబేద్కర్, మరియు గాంధీజీల మధ్య 24 సెప్టెంబరు, 1932 నాడు కుదిరిన అంగీకారమే **"పూనా ఒడంబడిక"** కు దారితీసింది. పూనా ఒడంబడిక ప్రకారం, షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేక నియోజక వర్గాలనుండి ఎన్నిక కాబడే విధానానికి బదులుగా రాజకీయ రిజర్వేషన్లు, విద్యాసంస్థలు, ఉద్యోగా లలో రిజర్వేషన్‌లతో పాటుగా వారి అభివృద్ధికి నిధులను కేటాయించడానికి అంగీకారం కుదిరింది. పూనా ఒడంబడికలోని అంశాల ఆధారంగానే, 1935 భారత ప్రభుత్వ చట్టం, మరియు ఆ చట్టం ప్రాతిపదికగానే భారత రాజ్యాంగంలో షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేక రక్షణలు, రాయితీలు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

సభ్య సమాజానికి దూరంగా కొండ కోనల్లో ఉంటూ నిరక్షరాస్యత, దుర్భర దారిద్ర్యం, అనారోగ్యాల కారణంగా అత్యంత దుర్భర పరిస్థితు లను అనుభవిస్తూ ఉండటం వలన షెడ్యూల్డ్ కులాలతో పాటు షెడ్యూల్డ్ తెగల వారికి ప్రత్యేక రక్షణలు, రాయితీలు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

భారత రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షులుగా ఉన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి హక్కుల పరిరక్షణకు అస్పృశ్యతా నిషేధంతో పాటుగా, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల రూపంలోనే కాకుండా వారి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, విద్యాపరంగా అభివృద్ధి చెందటానికి రక్షణలు కల్పింపచేశారు.

స్వాతంత్ర్యం అనంతరం ప్రజల సంక్షేమానికి, ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల సర్వతోముఖాభివృద్ధికి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్, సమగ్ర గ్రామీణ అభివృద్ధి పథకాలు, పంచవర్ష ప్రణాళికలు, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టటం జరిగినప్పటికీ, ఆశించిన రీతిలో ఈ వర్గాల అభివృద్ధి జరగలేదు.

### 2. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలు

కేంద్రప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, తెగల సమగ్ర అభివృద్ధి కోసం 1974లో గిరిజన ఉపప్రణాళికను, 1979లో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను తీసుకువచ్చింది. వీటి ప్రకారం రాష్ట్రాలు తమ బడ్జెట్‌లలో జనాభా దామాషా ప్రకారం ఈ వర్గాలకు నిధులను కేటాయించటం, వనరుల సమీకరణ, సమీకృత ప్రణాళికలతో పథకాలు అమలు చేయవలసి ఉంటుంది.

### ఉప ప్రణాళిక ఉద్దేశ్యాలు, లక్ష్యాలు

లబ్ధిదారుల ఆదాయ వనరులను, ఆస్తులను పెంచి ఆర్థికాభివృద్ధి సాధించటం, షెడ్యూల్డ్ కులాల ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా త్రాగునీరు, లింకురోడ్ల నిర్మాణం, ఇళ్ళస్థలాలు కేటాయించి, ఇళ్ళ నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు కల్పించటం, పాఠశాలలు, వైద్య కేంద్రాలు, వృత్తి కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు, స్త్రీ సంరక్షణ కేంద్రాలు మొదలగు వసతులు కల్పించి విద్యా పరంగా, సామాజికంగా అభివృద్ధి సాధించటం.

షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక ఆవశ్యకతను, ప్రాధాన్యతను గుర్తించిన మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ అన్ని శాఖలకు మార్చి12, 1980నాడు లేఖవ్రాస్తూ, జనాభాలో ఎక్కువ భాగంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కృషి చేయాలని ఉద్బోధించారు. ఆయా శాఖలలో షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభా దామాషా శాతం కంటే తక్కువ కాకుండా నిధులను కేటాయించాలని, వారు అనుభవిస్తున్న దుర్భర స్థితుల దృష్ట్యా, వారి జనాభా శాతం కంటే ఎక్కువ నిధులను కేటాయించటం న్యాయ సమ్మతమని వారు తెలియచేయటం జరిగింది.

### 3. ఉప ప్రణాళిక తక్షణ ఆవశ్యకత

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి గత 60 సం॥లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుపరచినప్పటికీ, ఆశించిన స్థాయిలో షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు అభివృద్ధి సాధించలేదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతస్థాయి సర్వీసులలో ఇప్పటికీ ఆశించిన శాతంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ఉన్నత ఉద్యోగులు లేరు. ఇప్పటికీ షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన ఉద్యోగాలు నింపడానికి అర్హులైన అభ్యర్థులు లేక, ఆ పోస్టులు నింపబడక కొన్ని పోస్టులు బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలి ఉన్నాయి. ఈ అసమానతలను తగ్గించి, సమానత్వం సాధించి, సమ సమాజం స్థాపించటం తక్షణ కర్తవ్యం.

### 4. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికల బిల్లుల అమలుకు చట్టబద్ధత కల్పించటం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దామోదర రాజనరసింహ అధ్యక్షతన ఉప ప్రణాళికలపై సమర్పించిన కేబినెట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళిక చట్టబద్ధత ముసాయిదా బిల్లు ఆమోదానికి 30.11.2012 నుండి 02.12.2012 వరకు ప్రత్యేకంగా సమావేశమైన ఆంధ్రప్రదేశ్ విధానసభ 02.12.2012 తేదీనాడు, ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ 11.12.2012 నాడు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళిక (ప్లానింగ్, ఎల్లోకేషన్, యుటిలైజేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ రిసోర్సెస్) బిల్లు 2012న ఆమోదించటం జరిగింది.

### ముసాయిదా బిల్లులోని ముఖ్యాంశాలు

షెడ్యూల్డ్ కులాలు, తెగల నిరంతర ప్రగతితో ఆర్థిక, విద్యా, మానవ వనరుల అభివృద్ధితో పది సంవత్సరాలలో సమానత్వం సాధించి, వారికి భద్రతను, సాంఘిక ఔన్నత్యాన్ని సాధించటంతో పాటు షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉపకులాల మధ్య సమానత్వాన్ని, వారిలో సమతుల్యతను సాధించే లక్ష్యంగా రాష్ట్ర ప్రణాళికా నిధులలో షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభా దామాషా ప్రకారం నిధులను కేటాయించి, సమర్థవంతమైన యంత్రాంగం ద్వారా పథకాలను అమలుపరచి వారి సర్వతోముఖాభివృద్ధిని ఆశిస్తూ ఈ ముసాయిదా చట్టాన్ని చేయటం జరిగింది.

**1. చట్ట పరిధి అమలు కాలపరిమితి**

ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికంతా వర్తిస్తుంది. ఆంధ్ర ప్రదేశ్ గెజిట్‌లో ప్రకటించిన తేదీ నుండి అమలు జరుగుతుంది. ఈ చట్టం పది సంవత్సరాలపాటు అమలులో ఉంటుంది.

**2. ఉప ప్రణాళికలు**

ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి నియమించిన రాష్ట్ర కౌన్సిల్ ఆమోదం పొంది, సంబంధిత శాఖలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి సాధించటంలో ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి సాధారణ పథకాలలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి అమలు పరిచే ప్రత్యేక పథకాలకు నిధులను కేటాయించడాన్నే ఉప ప్రణాళికలుగా చెప్పవచ్చును.



**3. ఉప ప్రణాళికలకు నిధుల కేటాయింపు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం, ప్రణాళికా నిధుల మొత్తం నుండి షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల వారికి, వారి జనాభా దామాషా ప్రకారం కేటాయించే నిధులను షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల ఉప ప్రణాళికగా పరిగణించ బడుతుంది. ఈ ఉప ప్రణాళికల నిధులను ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ఆరు నెలలు ముందు కేటాయించి, రాష్ట్ర వార్షిక సాధారణ బడ్జెట్ ఆమోదానికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయబడతాయి.

**4. ప్రభుత్వ శాఖల ముసాయిదా ఉప ప్రణాళికలు**

ప్రతి ఆర్థిక సంవత్సరం, ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రభుత్వ శాఖ మిగతా ప్రభుత్వ శాఖల షెడ్యూల్డ్ కులాల మరియు తెగల ఉప ప్రణాళికల ప్రతిపాదనలను పరిశీలించడం కొరకు పంపించవలసినదిగా కోరటం జరుగుతుంది. ఆ ముసాయిదా ప్రతిపాదనల ప్రకారం, ఉప ప్రణాళికలు రూపొందించబడి, సెక్షను 3 ప్రకారం నిధులు కేటాయించబడతాయి.

**5. ఉప ప్రణాళికల పథకాలు**

వివిధ శాఖలు తయారుచేసే ఉప ప్రణాళికలు అభివృద్ధి లోపాలను సవరించేవిగా ఉంటూ, షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల వ్యక్తులకూ, కుటుంబాలకు, వారు నివసించే ప్రాంతాల అభివృద్ధికి ఉద్దేశించినవిగా ఉంటూ, అభివృద్ధి ఫలాలు లబ్ధిదారులకు చేరే విధంగా ఉండాలి. ఈ ఉప ప్రణాళికలు రాష్ట్ర వార్షిక బడ్జెట్, పంచవర్ష ప్రణాళికలు, రాష్ట్ర ప్రాధాన్యతలకు లోబడి ఉండాలి. ఈ ఉప ప్రణాళికలు రాష్ట్ర వార్షిక బడ్జెట్, పంచవర్ష ప్రణాళికలు, రాష్ట్ర ప్రాధాన్యాలకు వ్యతిరేకంగా ఉండరాదు.

**6. ఉప కులాలకు సమన్యాయం**

ప్రభుత్వ శాఖలు తయారు చేసే ఉప ప్రణాళికలు షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల ఉప కులాలకు చెందిన వారందరూ సమాన లబ్ధిపొందేలా, సమ న్యాయం జరిగేలా సమతుల్యంగా అభివృద్ధి చెందే విధంగా ఉండాలి.

**7. సాధారణ పథకాలలో షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల వారికి వాటా, భాగస్వామ్యం**

ప్రజలు అందరికీ సంబంధించిన సాధారణ పథకాలలో ఉప ప్రణాళికలతో సంబంధం లేకుండా అర్హులైన షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల వారు అందరికీ అన్ని పథకాలు, సదుపాయాలను అనుభవించే అవకాశం ఉంటుంది.

**8. షెడ్యూల్డ్ కులాల తెగల ఉప ప్రణాళికా పథకాల రూపకల్పన**

ప్రతి శాఖ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ఎదురవుతున్న ఆటంకాలను గుర్తించి, వారి అభివృద్ధికి కావలసిన అవసరాల ప్రాధాన్యతలను గుర్తించి, చర్చల ద్వారా అభివృద్ధి పథకాలను రూపొందించవలసి ఉంటుంది.

**9. ఉప ప్రణాళికలకు నోడల్ శాఖ ఆమోదం**

ప్రతి శాఖ, ప్రతి సంవత్సరం ఉప ప్రణాళికలను నిర్దేశించిన సమయంలోగా నిర్దేశించిన నమూనాలో నోడల్ శాఖకు పరిశీలనకు పంపి, దాని ఆమోదంతో సాధారణ వార్షిక బడ్జెట్‌లలో ఉప ప్రణాళికల నిధులను పొందుపరచవలసి ఉంటుంది.

**10. నోడల్ ఏజన్సీల పరిశీలన**

వివిధ శాఖలు పంపించిన ఉప ప్రణాళికల ముసాయిదాలను షెడ్యూల్డ్ కులాల నోడల్ ఏజన్సీ మరియు షెడ్యూల్డ్ తెగల నోడల్ ఏజన్సీలు పరిశీలించి చట్టంలో ఉన్న నియమ నిబంధనల ప్రకారం ఉన్నదీ, లేనిదీ పరిశీలించవలసి ఉంటుంది.

**11. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగల ఉప ప్రణాళికల నిధుల కేటాయింపు**

ఉప ప్రణాళికలకు నిధులను కేటాయించేటప్పుడు ఈ క్రింది నియమ నిబంధనలను నోడల్ ఏజన్సీలు పాటించవలసి ఉంటుంది.

- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగల వారికి ప్రత్యేకంగా ఉపకారిగా ఉండి, షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల వ్యక్తులు గాని, కుటుంబాలు గాని ప్రత్యేకంగా లబ్ధిపొందే పథకాలకు 100 శాతం నిధులను ఉప ప్రణాళిక నిధుల నుండి కేటాయించాలి.
- షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల నివాస ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే పథకాలకు 100 శాతం నిధులను ఉప ప్రణాళిక నిధుల నుండి కేటాయించాలి. మిగతా ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభా దామాషా ప్రకారం నిధులను కేటాయించవలసి ఉంటుంది.
- అందరికీ అందుబాటులో ఉన్న సాధారణ పథకాల విషయంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వ్యక్తులకు ఉపయోగ కారిగా ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులాలు, తెగల లబ్ధిదారుల దామాషా ప్రకారం ఉప ప్రణాళిక నిధులను కేటాయించవలసి ఉంటుంది.
- మౌలిక సదుపాయాల కల్పనలో షెడ్యూల్డ్ తెగలకు నిధులను కేటాయించడానికి వీలుపడనప్పుడు, ప్రత్యేకంగా నిర్ణయించిన మేరకు మాత్రమే నిధులను కేటాయించవలసి ఉంటుంది.

**12. నోడల్ ఏజన్సీ మరియు నోడల్ శాఖ సిఫారసులు**

ఈ చట్టం నిర్దేశించిన నిబంధనలకు అనుకూలంగా ఉన్న అర్థవంతమైన పథకాలను బడ్జెట్ ప్రతిపాదనలకు ముందు సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖల నోడల్ ఏజన్సీల అనుమతి పొందిన వాటిని ఉప ప్రణాళికల క్రింద పరిగణించబడటానికి షెడ్యూల్డ్ కులాల తెగల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన రాష్ట్ర కౌన్సిల్ ఆమోదం పొందవలసి ఉంటుంది.

**13. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు**

షెడ్యూల్డ్ కులాల తెగల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన స్టేట్

కౌన్సిల్ ఆమోదం పొందిన నిధులను మాత్రమే ఆయా శాఖల పద్దులలో సాధారణ వార్షిక బడ్జెట్‌లో ఉప ప్రణాళికల కింద కేటాయిస్తారు.

**14. ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగం**

ఆర్థిక శాఖలో ఉప ప్రణాళికల అమలుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయవలసి ఉంటుంది.

**15. బడ్జెట్ మంజూరు ఉత్తర్వులు**

రాష్ట్ర వార్షిక సాధారణబడ్జెట్‌లో ఉప ప్రణాళికల క్రింద కేటాయించిన నిధుల మేరకు బడ్జెట్ ఆమోదం తరువాత సంబంధిత శాఖలకు నిబంధనల ప్రకారం శాసన సభ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను జారీ చేస్తుంది.

**16. రాష్ట్ర కౌన్సిల్**

- ఈ చట్టం అమలు పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన ఏర్పడే షెడ్యూల్డు కులాలు, తెగల రాష్ట్రస్థాయి అభివృద్ధి సంఘంకు అప్పచెప్పడం జరిగింది. ఈ స్టేట్ కౌన్సిల్ కనీసం సంవత్సరానికి రెండుసార్లు సమావేశం కావలసి ఉంటుంది.

**17. స్టేట్ కౌన్సిల్ విధులు**

- స్టేట్ కౌన్సిల్, షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికలకు సంబంధించిన పథకాల విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలను ఇస్తుంది.
- పథకాల తయారు, అమలు విషయమై వివిధ శాఖలకు సూచనలను, సలహాలను ఇస్తుంది.
- వివిధ శాఖల వార్షిక ఉప ప్రణాళికలను ఆమోదిస్తుంది.

**18. నోడల్ ఏజన్సీ, నోడల్ శాఖలు**

- ఈ చట్టం అమలు అధికారాలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన ఏర్పడే నోడల్ ఏజన్సీకి షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక అమలు బాధ్యతను, గిరిజన సంక్షేమ శాఖా మాత్యుల అధ్యక్షతన ఏర్పడే నోడల్ ఏజన్సీకి గిరిజన ఉప ప్రణాళికల అమలు బాధ్యతను అప్పచెప్పటం జరిగింది.
- సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖలు ఈ ఉప ప్రణాళికల నోడల్ ఏజన్సీలకు సహాయ సహకారాలను అందచేస్తాయి.

**19. నోడల్ ఏజన్సీ నోడల్ శాఖల అధికారాలు**

నోడల్‌శాఖల సహాయంతో నోడల్ ఏజన్సీలు ఈ క్రింది అధికారాలను కలిగి ఉంటాయి.

- చట్టపరిధిలో ఉప ప్రణాళికలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించి, నిబంధనల ప్రకారం ఉన్న ఉప ప్రణాళికలను ఆమోదిస్తుంది.
- రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలను తయారుచేసి స్టేట్ కౌన్సిల్ పరిశీలనకు, ఆమోదానికి పంపిస్తుంది.
- ఒక శాఖ నుండి మరొక శాఖకు నిధులను కేటాయించడానికి, నిధులు పెంచడానికి, తగ్గించడానికి అధికారం ఉన్నది.



- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళిక క్రింద అమలు జరుగుతున్న పథకాల అమలును పర్యవేక్షిస్తూ, సమీక్షిస్తుంది.
- ఉప ప్రణాళికల పథకాల అమలులో ఉన్న అడ్డంకులను గుర్తించి, వాటిని అధిగమించడానికి సూచనలను చేస్తుంది.
- రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి ఉప ప్రణాళికల తయారీక్రమాలను సమన్వయపరుస్తుంది.
- పారదర్శకంగా ఉండటానికి గ్రామాలవారీ, జిల్లాలవారీ, లబ్ధిదారుల వారీ వివరాల ప్రగతి, ఖర్చు, ఫలితాలను వెబ్ పోర్టల్‌లో ఉంచుతుంది.
- అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా మానవ అభివృద్ధి జరిగిందీ, లేనిదీ సమీక్షించడానికి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కనీసం సంవత్సరానికి ఒకసారి సామాజిక తనిఖీలకు అవకాశం కల్పిస్తుంది.
- నోడల్ ఏజన్సీల సూచనలను ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా అమలు చేయవలసి ఉంటుంది.

**20. షెడ్యూల్డ్ కులాలు, తెగల నోడల్ శాఖలకు పరిపాలన మరియు సాంకేతిక సహాయం**

నోడల్ శాఖలయిన సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖలను బలోపేతం చేయడానికి, పరిపాలన మరియు సాంకేతిక సహాయ యూనిట్‌ని, ఉప ప్రణాళిక పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

**21. శాఖల స్థాయిలో ఉప ప్రణాళికల సహాయక కేంద్రాలు**

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికల అమలును సమన్వయ పరచడానికి అవసరమనుకున్న శాఖలలో ఉప ప్రణాళిక సహాయక యూనిట్‌ని రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేస్తుంది.

**22. జిల్లాలలో ఉపప్రణాళిక పథకాల అమలు**

జిల్లాస్థాయిలో ఉప ప్రణాళికల పథకాల అమలు బాధ్యతను జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఏర్పాటు చేయబడే జిల్లా మానిటరింగ్ కమిటీకి అప్పగించడం జరుగుతుంది. జిల్లా ప్రణాళికా కమిటీలకు, ఉప ప్రణాళికల అమలును నిరంతరం సమీక్షించే బాధ్యతలను అప్పచెప్పటం జరిగింది.

**23. సమర్థవంతంగా ఉప ప్రణాళికల అమలు**

సంస్థాగతంగా బలోపేతం చేస్తూ, సిబ్బందిని కేటాయిస్తూ, వారికి

దిశా నిర్ధేశాలను, ఆదేశాలను జారీచేస్తూ, శిక్షణ ఇవ్వటానికి రాష్ట్ర, జిల్లా, ఉప జిల్లా స్థాయిలలో విభాగాలను ఏర్పాటుచేయడానికి ఆయా ప్రభుత్వ శాఖలు తగు చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

**24. ఉప ప్రణాళికల అమలులో జవాబుదారీ, పారదర్శకత**

ఉపప్రణాళికల అమలు అన్ని స్థాయిలలోను జవాబుదారీగా ఉంటూ, పారదర్శకంగా ఉండాలి. ఉప ప్రణాళికలకు సంబంధించిన పథకాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

**25. ప్రోత్సాహకాలు, శిక్షలు**

ఈ చట్టం అమలులో సమర్ధవంతంగా పనిచేస్తూ, ఉన్నత ప్రమాణాలతో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ప్రోత్సాహకాలను, బాధ్యతారాహిత్యంగాను, నిర్లక్ష్యంగాను పనిచేసే వారిపై సంబంధిత సర్వీసు నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం విధివిధానాలను తయారుచేయవలసి ఉంటుంది.

**26. వార్షిక నివేదికలు**

షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికల అమలులో శాఖాపరంగా సాధించిన ప్రగతిని, మురిగిపోయిన నిధుల వివరాలను తెలియచేస్తూ నివేదికలను ప్రతి ఆర్థిక సంవత్సరం నోడల్ ఏజన్సీలు శాసన సభకు సమర్పించవలసి ఉంటుంది.

**27. నియమ నిబంధనల రూపకల్పనలో ప్రభుత్వ అధికారాలు**

1) ఈ చట్టం పరిధిలోని ఇతర నిబంధనలకు లోబడి నోటిఫికేషను ద్వారా ఈ చట్టం అమలుకు సంబంధించి నియమ నిబంధనలను తయారు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

2) ముఖ్యంగా ఈ క్రింది విషయాల్లో ఇతర అంశాలకు విఘాతం కలగకుండా ప్రభుత్వం నియమ నిబంధనలను తయారు చేస్తుంది.

- సెక్షను 2 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల మధ్య అంతరాయాన్ని, అగాధాన్ని పూడ్చడానికి సంబంధించి,
- సెక్షను 3 ప్రకారం ప్రణాళికా నిధుల నుండి షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికలకు నిధులను కేటాయింపునకు సంబంధించి,
- సెక్షను 8 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉపప్రణాళికల క్రింద పథకాలను గుర్తించి వాటి ఆధారంగా శాఖలపరంగా ఉపప్రణాళికల తయారు విషయానికి సంబంధించి,
- సెక్షను 9 ప్రకారం నోడల్ శాఖల అవసరాల మేరకు షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికలు తయారుచేయటానికి సంబంధించి,
- సెక్షను 12 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉపప్రణాళిక నిధులను వినియోగించడానికి ఆర్థిక శాఖను బలోపేతం చేసి, ఆ నిధుల వినియోగం, నియంత్రణకు సంబంధించి,
- సెక్షను 16 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి స్టేట్ కౌన్సిల్ పరిపాలన, మెంబర్ల అర్హతలు, అనర్హతలు, అనధికార సభ్యులకు జీతభత్యాల విషయానికి సంబంధించి,
- సెక్షను 18 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికల అమలుకు నోడల్ ఏజన్సీలను ఏర్పాటు చేసే విషయాలకు సంబంధించి,
- సెక్షను 19 ప్రకారం నోడల్ ఏజన్సీల వెబ్ పోర్టల్‌ని నిర్వహించడానికి సంబంధించి,
- సెక్షను 20 ప్రకారం ఉప ప్రణాళికల అమలు కోసం సంబంధిత నోడల్ శాఖలకు పరిపాలన, సాంకేతిక సపోర్టు విభాగాన్ని ఏర్పాటు చేసే విషయానికి సంబంధించి,
- సెక్షను 21 ప్రకారం ప్రతి శాఖకు ఉప ప్రణాళిక సహాయ విభాగం ఏర్పాటుకు సంబంధించి,
- సెక్షను 22 ప్రకారం జిల్లాల పర్యవేక్షక కమిటీల నియామకం విషయానికి సంబంధించి,
- సెక్షను 23 ప్రకారం ఉప ప్రణాళికల అమలుకు రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, జిల్లాల క్రిందస్థాయి వ్యవస్థలను బలోపేతం చేస్తూ, ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చి, ప్రజల సహకారంతో సమర్ధవంతంగా పథకాల అమలు, పర్యవేక్షణకు, సామాజిక తనిఖీలకు సంబంధించి,
- సెక్షను 24 ప్రకారం ఉపప్రణాళికల అమలు విషయమై జవాబుదారీతనం, పారదర్శకతలకు సంబంధించి,

3) ఈ చట్టం పరిధిలో చేసిన అన్ని నియమ నిబంధనలకు, సవరణలు, మార్పులు, చేర్పులను 14 రోజులలోగా శాసనసభ ముందు ఉంచి, శాసనసభ ఆమోదం పొందిన తరువాత గెజిట్‌లో నోటిఫై చేసిన తేదీ నుండి ఆ సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించిన నియమ నిబంధనలు అమలులోకి వస్తాయి.

**28. చట్టం అమలో అవరోధాలను తొలగించటం**

1) ఈ చట్టం అమలుకు ఏవైనా అవరోధాలను గుర్తించినా, అవరోధాలు వచ్చినా ఆ అవరోధాల నిరోధానికి, ఆ అడ్డంకులను తొలగించడానికి ఈ చట్టం అమలుకు ఆటంకం కలగని విధంగా ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేస్తుంది. ఈ అధికారం చట్టం అమలులోకి వచ్చిన రెండు సంవత్సరాలలోపు మాత్రమే ఉంటుంది.

2) ఈ సెక్షను ప్రకారం చేసిన ప్రతి ఉత్తర్వు సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర రెండు శాసన సభల ముందు ఆమోదం కొరకు ఉంచవలసి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విధాన సభ, విధాన పరిషత్‌లలో ప్రవేశపెట్టిన, ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక ముసాయిదా బిల్లు - 2012 ఆధారంగా ఈ వ్యాసాన్ని తయారుచేయటం జరిగింది. ఈ ముసాయిదా బిల్లు రాష్ట్ర గవర్నర్, కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొంది, ముసాయిదా బిల్లులో చేసిన మార్పులు, చేర్పులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రకటించిన తేదీనుండి ఈ చట్టం అమలులోనికి వస్తుంది.

**- మట్టా మదన మోహన రావు,**
**సెంటర్ హెడ్, సోషల్ జస్టిస్ మరియు వాలంటరీ యాక్షన్ ఎ.ఎమ్.ఆర్.అపార్డ్**




**కేంద్రప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ ఆధ్వర్యంలోజాతీయ తేనెటీగల అభివృద్ధి బోర్డు, క్వాలిటీ సర్వీస్ ఇంటర్నేషనల్ వారు సంయుక్తగా అపార్డ్‌లో డిసెంబర్ 18వ తేదీ నుండి 24 తేదీ వరకూ "భారతదేశంలోని**



# జాతీయ తేనెటీగల బోర్డ్ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంలో మెళుకువలపై అపార్డ్‌లో శిక్షణ

**తేనె పరిశ్రమలో సుస్థిరమైన అభివృద్ధి మరియు నాణ్యమైన ప్రణాళికలతో కూడిన ఉత్పత్తి" అనే అంశముపై ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, గోవా, పాండిచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్, తమిళనాడు మొత్తం 8 రాష్ట్రాల నుండి వచ్చిన 45 మంది తేనెటీగల పెంపకం దార్లకు మరియు అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.**


ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి గారు హాజరయ్యారు. జాతీయ తేనె బోర్డు కార్యనిర్వాహక సంచాలకులు శ్రీ బి.ఎల్. సరస్వత్ గారు మరియు జర్మనీకి చెందిన తేనెటీగల శాస్త్రవేత్త డా॥ గ్విడోఐచ్ పాల్గొనటం జరిగింది.

ఈ శిక్షణా కార్యక్రమంలో భారతదేశంలో తేనె పరిశ్రమ యొక్క ప్రాధాన్యత, దీని వల్ల వచ్చే లాభాలు, తేనెటీగల యాజమాన్యంలో చీడ పీడలు, వాటి జాగ్రత్తలు, నివారణ, వైరస్ వ్యాధుల నివారణ మొదలగు అంశాలను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్మన్ శాస్త్రవేత్త డా॥ గ్విడోఐచ్ గారు అభ్యుదయ రైతులకు మరియు అధికారులకు వివరంగా చెప్పటం జరిగింది.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి గారు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయలో మరియు ఆయుర్వేద చికిత్సా విధానంలో, పంటల పరపరాగ సంపర్కములో తేనెటీగల యొక్క ప్రాధాన్యతను గుర్తు చేసారు. తల్లి, తండ్రి, గురువు, తరువాత తేనె యొక్క ప్రాధాన్యతను గూర్చి వివరించారు. అంతే కాకుండా పోషకాహారంలో తేనె పాత్రను వివరిస్తూ తేనెటీగల పెంపకం వాణిజ్య స్థాయిలో చేపడితే లాభసాటిగా ఉంటుందని తేనెటీగల పెంపకందార్లకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాన్ని కేంద్ర తేనెటీగల బోర్డు సభ్యులు శ్రీ సుబ్బారావు, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలోని రూరల్ టెక్నాలజీ పార్క్‌లో సాంకేతిక బదిలీ అంశాలపై పనిచేయుచున్న శ్రీ పైడి రవికుమార్, అపార్డ్‌లోని సహజవనరుల యాజమాన్యకేంద్రం సెంటర్‌హెడ్ హెచ్. కూర్మారావు, శ్రీ టి.యం.కె.గాంధీ, శ్రీ మొగలయ్య సమన్వయ పరిచారు.

**- టి.ఎం.కె. గాంధీ, రిసోర్స్ పర్సన్, అపార్డ్**




# పాత చెక్కులకు చెల్లు చీటీ

## సిటిఎస్ -2012 స్టాండర్డ్స్‌తో కొత్త చెక్కులు

**బ్యాంక్ అకౌంట్లు, చెక్కులు, ఏటిఎంలు అనే మాటలు గత దశాబ్దం వరకూ పట్టణవాసులు ఉద్యోగులు, ధనవంతులకు మాత్రమే తెలిసిన మాటలు. ఇప్పుడు గ్రామాలలో దినకూలీల మొదలు మహిళలూ, రైతులందరికీ తెలిసిన మాటలే కాదు, వారు కనీసం వారానికి ఒకటి రెండుసార్లు బ్యాంక్ గడప తొక్కందే పూట గడవదంటే అతిశయోక్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఇప్పుడు బ్యాంకులు గ్రామీణ ప్రజానీకానికి సైతం వారి దైనందిన కార్యకలాపాలలో ఒక భాగమయ్యాయి.**

**గత దశాబ్దంగా బ్యాంకింగ్ వ్యవస్థ మారుమూల గ్రామాల్లోకి కూడా బాగా విస్తరించి పోయింది. ఈ బ్యాంకులన్నింటి మీద భారత్ రిజర్వు బ్యాంక్ అజమాయిషీ చేస్తుంది. రిజర్వు బ్యాంకు ఇచ్చిన ఆదేశాలను దేశంలోని బ్యాంకులన్నీ విధిగా పాటించి తీరాల్సిన అవసరం ఉందని చట్టాలు చెబుతున్నాయి.**

మనదేశంలో వేలాది బ్యాంకింగ్ శాఖలు, లక్షలాది మంది ఖాతాదారులు ఉంటారు. లావాదేవీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించడం సిబ్బందికి సాధ్యం కాదు కూడా. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న ఈ చిన్న బలహీనతను ఆసరా చేసుకొని కొందరు స్వార్థపరులు మోసాలకు పాల్పడుతున్నారు. వారి ఆటలు కట్టించి, ఖాతాదారులు, మదుపుదార్లకు మరింత భద్రతను చేకూర్చేందుకు భారత రిజర్వు బ్యాంకు ఎప్పటికప్పుడు చర్యలను తీసుకుంటూనే ఉంటుంది. అటువంటి చర్యల్లో భాగంగా ఇటీవల ఒక ఆదేశాన్ని రిజర్వు బ్యాంక్ విడుదల చేసింది.

డబ్బును బదిలీ లేదా మారకం చేసుకునేందుకు ఖాతాదారులు వాడే చెక్కుల జారీలో కొన్ని మార్పులు చేస్తూ ఈ ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం, ఖాతాదారులు తమ వద్ద ఉన్న చెక్కు బుక్కులన్నింటినీ డిసెంబర్ 31లోగా వారి వారి బ్యాంకు శాఖల్లో జమ చేయాలి. చెక్కుల రూపంలో మీకు ఎవరైనా డబ్బు ఇచ్చి ఉంటే, వాటిని నగదుగా మార్చుకోవడమో, మీ బ్యాంకు ఖాతాలో జమచేయడమో చేయాలి. లేకపోతే ఆ డబ్బు బూడిదలో పోసినట్లేనన్న విషయం ఖాతాదారులు మరిచిపోకూడదు. అయితే, ఈ పద్ధతి జనవరి 2013 నుంచి ప్రారంభమవుతున్నప్పటికీ, పూర్తిస్థాయిలో అమలుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది ఆర్.బి.ఐ.

పాత చెక్కుల స్థానంలో బ్యాంకులు మరో చెక్కుబుక్కు ఇస్తాయి. కొత్త చెక్కులు చూడటానికి పాతవాటి కంటే కొంత భిన్నంగా ఉంటాయి. వాటిమీద 'సిటిఎస్ - 2010' అని ఇంగ్లీష్‌లో రాసి ఉంటుంది. కంప్యూటర్లు మాత్రమే చదవగలిగే విధంగా కొన్ని కోడ్స్ కూడా కొత్త చెక్కుల మీద ఉంటాయి.

కొత్త సంవత్సరం నుంచి (మార్చి 31 తరువాత) పాత చెక్కులు చెల్లవు. పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా చెల్లవు కాబట్టి, వాటిని మార్పించుకునే బాధ్యత ఖాతాదారులదేనని రిజర్వు బ్యాంకు ఇదివరలోనే స్పష్టంగా చెప్పింది. ఎవరి దగ్గరైనా కొన్ని చెక్కులు (లీవ్స్) మిగిలి పోతే వాటిని



Sthanika_BW_Janf13.indd 23 29/12/12 2:52 PM

సంబంధిత శాఖల్లో ఇచ్చి కొత్త బుక్స్‌ను తీసుకోవాల్సి ఉంటుందని కూడా రిజర్వు బ్యాంక్ గతంలోనే సూచించింది.

అసలు ఈ సిటిఎస్-2010 స్టాండర్డ్ చెక్కులంటే ఏమిటి? వాటిని ఎందుకు ప్రవేశపెట్టారు? వాటివల్ల ఖాతాదారులకు గానీ బ్యాంకులకుగానీ ఏమైనా లాభం ఉంటుందా? అన్న విషయాన్ని క్లుప్తంగా పరిశీలిద్దాం. ఈ విషయాల్లోకి వెళ్లాలంటే ముందుగా చెక్కుల చరిత్ర గురించి కొంత తెలుసుకోవాలి.


కొన్ని దశాబ్దాలుగా బ్యాంకింగ్ రంగంలో చెక్కులను వాడుతున్నారు. ఉదాహరణకు స్టేట్ బ్యాంక్ ఖాతాదారుడొకరు ఆంధ్రా బ్యాంక్ ఖాతాదారుడికి ఒక చెక్కుని ఇచ్చాడనుకొందాం. అతను చెక్కును సహజంగానే ఆంధ్రా బ్యాంక్ ఖాతాలో జమ చేసుకుంటాడు. ఆ చెక్కును ఆంధ్రాబ్యాంక్ సిబ్బంది స్టేట్ బ్యాంక్‌కి పంపిస్తారు. 'యస్' ఆ చెక్కు మా బ్యాంకుదే అని స్టేట్ బ్యాంక్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు ఆ ఖాతాదారుడి అకౌంట్లోకి డబ్బు జమ కాదు. ఇలా చెక్కుల వల్ల డబ్బు చేతులు మారడానికి కొన్ని రోజులు లేదా వారాలు పట్టేది. సమయాన్ని బాగా తగ్గించడానికి ఆ తరువాత కాలంలో పట్టణాలు, నగరాలలో క్లియరింగ్ హౌస్‌లను ప్రవేశపెట్టారు.

## సిటిఎస్-2010 అంటే ఏమిటి?

దీన్ని ఇంగ్లీష్ లో 'చెక్ ట్రంకేషన్ సిస్టం' అంటారు. ఇతర బ్యాంకులకు చెందిన చెక్కులు ఒక బ్యాంక్‌లో జమ అయితే వెంటనే ఆ చెక్కు ఫొటో ఇమేజ్‌ను సంబంధిత బ్యాంక్‌కు పంపవచ్చు. ఫలితంగా అతితక్కువ సమయంలో ఆ చెక్కు తమ బ్యాంక్‌దేనని నిర్ధారించే మెసేజ్‌ను పంపుతుంది. ఈ కొత్త విధానం వల్ల కాలంతో పాటు ఖర్చు కూడా గణనీయంగా తగ్గిపోతుంది. అంటే ఇక మీదట చెక్కులను భౌతికంగా ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు పంపాల్సిన అవసరం ఉండదు.

ఈ కొత్త పద్ధతిని ఢిల్లీలో 2008లోనే ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. 2011లో చెన్నైలో కూడా ప్రవేశపెట్టి పరిశీలించారు. దీనివల్ల అటు బ్యాంకులకూ, ఇటు ఖాతాదారులకూ ఈ పద్ధతి లాభసాటిగా ఉందని రిజర్వు బ్యాంక్ నిర్ధారించింది. వీటి నిర్వహణకు దేశంలో నాలుగు గ్రిడ్‌లను ఏర్పాటు చేశారు.

దేశంలో ప్రస్తుతమున్న క్లియరింగ్ హౌస్‌లను క్రమంగా ఈ గ్రిడ్‌లకు అనుసంధానం చేస్తారు.


दिनांक Date 26/02/10
A/c PAYEE ONLY
Pay Bal Ram Singh Dahiya या धारक को or Bearer
रुपये Rupees Six thousand only
Rs. 6000=00
अदा करें
खाता सं. A/c No. 601620100010010
PRESS TRUST OF INDIA
बैंक ऑफ इंडिया · BANK OF INDIA
पार्लियामेंट स्ट्रीट शाखा
पी.टी.आई. बिल्डिंग,
4, पार्लियामेंट स्ट्रीट,
नई दिल्ली – 110001
PARLIAMENT STREET Branch
P.T.I. BUILDING,
4, PARLIAMENT STREET,
NEW DELHI - 110 001.
IFSC : BKID0006016
V-S-Chandrasekar
⑈000890⑈ 110013024⑆ 005683⑈ 11

### *సిటీఎస్ వల్ల ఖాతాదారులకు కలిగే లాభాలు.....*

★ క్లియరింగ్ త్వరగా జరిగి, ముందెన్నడూ లేనంత వేగంగా చెక్కులు నగదు రూపంలో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి.

★ ఒక బ్యాంక్ నుంచి ఇంకో బ్యాంక్‌కు చెక్కు వెళ్లేటప్పుడు మార్గమధ్యలో తప్పిపోయే ప్రమాదం ఏమాత్రమూ ఉండదు.

★ ప్రస్తుతం అమల్లో ఉన్న పద్ధతి ప్రకారం, క్లియరింగ్ హౌస్‌లు కొన్ని నగరాలు / పట్టణాలకు లేదా ఒక భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే చెక్కులకు జాప్యం తప్పడం లేదు. క్లియరింగ్ హౌస్‌లు సిటిఎస్ గ్రిడ్లకు అనుసంధానమయ్యాక దేశంలోని ఏ మారుమూల ప్రాంతంలో ఉన్న బ్యాంక్ చెక్కులనైనా 24 గంటల వ్యవధిలో నగదు రూపంలో మార్చడం వీలవుతుంది.

★ చెక్కులను భౌతికంగా ఒక చోట నండి మరో చోటకు మార్చేటప్పుడే సంఘ వ్యతిరేకశక్తుల చేతిలో పడుతుంటాయి. వారివల్ల ఖాతాదారులు తమ విలువైన డబ్బును నష్టపోతున్నారు. సిటిఎస్ పద్ధతి ద్వారా ఈ ప్రమాదం నుంచి ఖాతాదారులకు రక్షణ కల్పించవచ్చు.

★ చెక్కుల మీద బార్ కోడ్స్, ఎన్ క్రిప్టెడ్ కోడ్స్, లోగోస్, వాటర్ మార్క్స్, హోలోగ్రామ్స్ వంటి క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటం వల్ల ఫోర్జరీ చేయడం దాదాపు అసాధ్యమని బ్యాంకులు భావిస్తున్నాయి.

★ సిటిఎస్ వల్ల బ్యాంకుల నిర్వహణా సామర్థ్యం బాగా పెరుగుతుందని బ్యాంకింగ్ ఉన్నతాధికారులు ఆశాభావంతో ఉన్నారు.

అన్ని బ్యాంకుల ప్రతినిధులు రోజు కొకసారో, లేదా రెండు రోజులకొకసారో ఈ హౌస్‌లలో కలుసుకుని, వారి వారి బ్యాంక్‌లలో జమ అయిన చెక్కులను సంబంధిత బ్యాంకుల ప్రతినిధులతో నిర్ధారించుకుని వచ్చేవారు. బ్యాంకుల ఖాతాదారులు పెరిగిపోవడంతో చెక్కుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి క్లియరింగ్ హౌస్‌లలో కూడా రద్దీ పెరిగి, చెక్కుల మారకం త్వరగా సాగడంలేదని రిజర్వుబ్యాంక్ భావించింది. చెక్కులను కంప్యూటర్ల ద్వారా పరిశీలించే సాంకేతిక పరిజ్ఞానాన్ని రంగంలోకి దించింది. దాన్నే ఎమ్ఐసిఆర్ (Magnetic Ink Character Recognition) అనే వారు.

దీంట్లో చెక్కులమీద ఉండే ఒక ప్రత్యేకమైన ఇంక్‌తో ముద్రించిన అక్షరాలను కంప్యూటర్ గుర్తించేది. ఆ ప్రకారం, కంప్యూటరే చెక్కులను సార్ట్ చేయగలిగేది. దీని ద్వారా పనిలో కొంత వేగం పుంజుకున్నా, చెక్కులను భౌతికంగా ఆయా బ్యాంకులకు చేరవేయడంలో జాప్యం జరుగుతూనే ఉండేది. ఆ జాప్యాన్ని కూడా అరికట్టేందుకే కొత్తగా సిటిఎస్-2010 ను రిజర్వు బ్యాంక్ ప్రవేశపెట్టింది.

*– బి. లలిత*



Sthanika_BW_Janf13.indd 24 29/12/12 2:52 PM

# పథకానికి పది ప్రశ్నలు

(పథకాలపై అవగాహన పెంచటానికో చిరుప్రయత్నం)

# వై.యస్.ఆర్ అభయ హస్తం పథకం

**ఏ మనిషికైనా వయస్సు పై బడ్డాక కలిగే సమస్య అభద్రతాభావం శక్తి ఉడికిపోయాక సంపాదించలేకపోతే నేను ఎలా జీవించగలను అన్న బెంగ వెంటాడడం సహజం. వై.యస్.ఆర్. అభయహస్తం పథకం మహిళల్లో ఈ అభద్రతా భావాన్ని తొలగించింది మన రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలలో ఎక్కడా అమలుకాని ఈ పథకం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా అమలు కావడం 60 సం॥ లు దాటిన మహిళలు చేసుకున్న పుణ్యం అని చెప్పవచ్చు.**



**1. అభయహస్తం పథకం ఎప్పుడు ప్రారంభమయింది?**

ఫిబ్రవరి 6,2009 అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.యస్. రాజశేఖర్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.అయితే రాజశేఖర్ రెడ్డి అకాల మరణం కారణంగా ఈ పథకాన్ని తదుపరి ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య వై.యస్.ఆర్. అభయహస్తం పేరుతో నవంబర్ 1, 2009 లో రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో లాంఛనంగా ప్రారంభించారు.

**2. అభయహస్తం ముఖ్య ఉద్దేశ్యం అంటే ఏమిటి ?**

60 సం॥ నిండిన మహిళలకు ప్రభుత్వ ఉద్యోగులలానే పింఛను, జీవిత బీమా సౌకర్యం కల్పించడం ద్వారా మహిళలు సమాజంలో పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదుగుదల సాధించి జీవించాలని, వృద్ధాప్యంలో ఎవరి ముందు చేయి చాపకుండా సొంతంగా జీవించే అర్హత కల్పించడం కోసమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

**3. ఈ పథకంలో చేరాలంటే అర్హతలు ఏముండాలి ? ఎవరిని కలవాలి?**

గుర్తించబడిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలలో చేరి, కనీసం ఒక సంవత్సరం పాటు సంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని తెల్ల రేషన్‌కార్డు కలిగిన 18 సం॥లు నిండిన మహిళలు అందరూ ఈ పథకం పొందుటకు అర్హులే. అర్హత కలిగిన మహిళలు మండలం లో ఉన్న మండల సమాఖ్య అధికారులను కలిసి వివరాలు చెప్పి పేరు నమోదు చేసుకోవచ్చు.

**4. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ఏం చేయ్యాలి?**

అభయహస్తం పథకం ద్వారా పింఛను పొందాలంటే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు రోజుకి ఒక రూపాయి చొప్పున నెలకు రూ. 30 లు ఏడాదికి రూ. 365/- లు పింఛను నిధికి చెల్లించాలి. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా వారి పేరు మీద జమ చేస్తుంది ఈ రెండూ కలిపి ఖాతాదారుని పింఛను నిధిలో జమ అవుతుంది. తద్వారా 60 సం॥ దాటిన తరువాత పింఛను పొందుటకు అర్హులవుతారు.

**5. ఈ పథకంలో చేరితే ఎంత పింఛను వస్తుంది?**

మహిళల వయస్సును బట్టి ప్రభుత్వం పింఛనుని నిర్ణయిస్తుంది. 18 సం॥ నిండిన వారు 60 సం॥ వచ్చే వరకూ ఎక్కువ మొత్తంలో జమ చేస్తారు. కాబట్టి వారికి 60 సం॥ నిండిన తరువాత నెలకు రు॥ 2118/-, 25 సం॥ నిండినవారికి రూ॥ 1,143/-, 30 సం॥ నిండిన వారికి రూ॥ 724/-, 35 సం॥ వారికి రు॥ 625/-, 40 సం॥ వారికి రూ॥ 600/-, 45 సం॥ వారికి రూ॥ 575/-, 50 సం॥ వారికి రూ॥ 550/-, 55 సం॥ వారికి రూ॥ 525/-, 60 సం॥ వారికి 500/- వస్తుంది.

**6. 60 సం॥ దాటిన మహిళలు ఈ పథకానికి అర్హులు కారా ?**

60 సం॥ వయస్సు దాటిన మహిళలు 10 సం॥ లకు చెల్లించాల్సిన వాటా మొత్తం రు॥ 3650/- ఒకేసారి చెల్లిస్తే అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా చెల్లిస్తుంది. తద్వారా వెంటనే నెలకు రు॥ 500/- పింఛను తీసుకోనుటకు అర్హత పొందుతారు.

**7. ఈ పథకంలో చేరిన వ్యక్తి అకస్మాత్తుగా మరణించినట్లయితే అప్పటి వరకూ ఆ వ్యక్తి పేరున జమ అయిన మొత్తం ఎవరికి చెందుతుంది.**

ఈ పథకంలో సభ్యురాలు అకస్మాత్తుగా మరణించినట్లయితే వారు చెల్లించిన వాటా మొత్తం, ప్రభుత్వ వాటా మొత్తం వడ్డీతో పాటు జీవిత బీమా ప్రయోజనాలు క్రింద సహజ మరణం అయితే రూ॥ 30000/- లు ప్రమాదవశాత్తు అయితే రూ॥ 75000/- లు వారి యొక్క నామినీకి బదలాయించబడతాయి. లబ్దిదారునికి పాక్షిక అంగవైకల్యం సంభవిస్తే రూ॥ 37500/- లు చెల్లించడం జరుగుతుంది.

**8. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారు?**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల్లోని 72 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. సభ్యులుగా నమోదైన వారిలో నాలుగున్నర లక్షలమందికి 60 ఏళ్ళు వయస్సుదాటింది. వారు 10 సం॥ లకు చెల్లించాల్సిన వాటా రూ॥ 3650/- లు ఒకేసారి చెల్లించడంతో ప్రస్తుతం 4.5 లక్షల మంది రాష్ట్ర వ్యాప్తంగా పింఛను పొందడం జరుగుతుంది.

**9. ఈ పథకం ద్వారా ఇతర ఉపయోగాలు ఏమైనా ఉన్నాయా ?**

ఈ పథకంలో సభ్యుల యొక్క 9వ, 10వ, ఇంటర్, మరియు ఐ.టి.ఐ. చదివే ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికీ సంవత్సరానికి రూ॥ 1200/- చొప్పున ఉపకార వేతనాలు అందించడతాయి.

**10. ఈ పథకం ద్వారా మహిళలు పొందే లాభాలు ఏమిటి ?**

60 సం॥ దాటిన మహిళా ఇతరులపై ఆధారపడకుండా జీవిస్తుంది. వారు ఆర్థికంగా, సామాజికంగా స్వతంత్రంగా జీవించగలుగుతారు.

వృద్ధాప్యంలో ఒకరిపై ఆధారపడిన వృద్ధుల జీవితం సుఖ సంతోషాలతో ఉండేందుకు, వారి కళ్ళలో కాంతులు నింపేందుకు అభయహస్తం పథకం వారి పాలిట ఆపన్నహస్తంగా మారిందని చెప్పవచ్చు. ■

# విజేతలు కావాలనుకుంటున్నారా ?

**కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ దృక్పథం వున్న వ్యక్తులు అనుసరించే కొన్ని విషయాలు ఇక్కడ పేర్కొంటున్నాము. మనమూ ప్రయత్నిద్దాం - మారుదాం పాజిటివ్‌గా.**

★ మనస్ఫూర్తిగా నిజాయితీగా పొగడండి.

★ ఎదుటి వారిలో నిజమైన ఆసక్తిని కనబరచండి.

★ ఎదుటి వారి మీద తరుచూ ఫిర్యాదు చేయకండి.

★ ఎప్పుడూ చిరునవ్వుతో ఎదుటి వారిని పల్కరించండి.

★ విమర్శించకండి సమయం దొరికినప్పుడల్లా, అదే అదనని.

★ ఎదుటి వారిలో నిజమైన కోరికను కల్గజేయండి.

★ పేరుతోనే పిలవడానికి ప్రయత్నించండి. ఎవరి పేరు వారికి అత్యంత ఇష్టం - పేరులోని ఉచ్చారణే మధురం.

★ మాట్లాడడం కంటే, ఎదుటి వారు చెప్పింది శ్రద్ధగా వినండి. వినడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి.

★ ఇతరుల అభిరుచులు గమనించి, వాటి గురించి మాట్లాడండి. మీ అభిరుచులు చెప్పండి.

★ ఎదుటి వారిని తమ గురించి చెప్పమని ప్రోత్సహించండి.


★ అవతల వ్యక్తి తాను ముఖ్యమైన వ్యక్తినని అనుకునే విధంగా మాట్లాడండి. అయితే మనస్ఫూర్తిగా వ్యవహరించండి.

★ చర్చించండి. కాని-వాదించకండి.

★ ఎదుటి వారు మీతో ఏకీభవించేలా చేయండి.

★ ఎదుటి వారి అభిప్రాయాలను గౌరవించండి - వారి అభిప్రాయం తప్పు అని నేరుగా చెప్పకండి.

★ ఎదుటి వారి తప్పుల గూర్చి పరోక్షంగా మాట్లాడండి.




★ సూటిగా ఆజ్ఞలు జారీ చేయకండి.

★ ఎదుటి వారి తప్పుల గూర్చి మాట్లాడే ముందు మీ తప్పుల గూర్చి మాట్లాడండి. ఎదుటి వ్యక్తి కన్విన్స్ కావడానికి ఎక్కువ అవకాశముంది- మీ పట్ల ఎదుటి వ్యక్తికి నమ్మకం ఏర్పడుతుంది.

★ తప్పు మీదైనప్పుడు వీలైనంత త్వరగా ఒప్పుకోవడం వల్ల ఎదుటి వ్యక్తికి మీ నిజాయితీ పట్ల విశ్వాసం ఏర్పడుతుంది.

★ ఒక విషయం చెప్పాలనుకున్నప్పుడు స్నేహభావంతో మొదలు పెట్టండి.

★ మన గౌరవ మర్యాదలు కాపాడుకుంటూ, ఎదుటి వ్యక్తి గౌరవ మర్యాదలు కాపాడేలా వ్యవహరించండి.

★ ఎదుటి వ్యక్తిలో వచ్చిన మంచి మార్పును మెచ్చుకోండి - మెరుగైన ప్రతి పనిని ప్రశంసించండి.

★ తప్పులను తప్పులుగా ఎత్తి చూపి హేళన చేయక, తప్పును సరి దిద్దుకోవడం చాలా సులభం అనేలా ప్రోత్సహించండి.

★ ఎదుటి వారు మీరు చెప్పిన పనిని సంతోషంగా చేసేలా ప్రవర్తించండి.

★ చేసే ప్రతి చిన్న పనిలో ఏకాగ్రత, కృషి ఉండేలా చేసుకోండి.

★ ముందు మీరేమిటో - మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి.

★ మీరు పనిచేసే చోట సుహృద్భావ వాతావరణం కల్పించుకోండి.

★ ఆశావాదిగా వుండండి. ఎదుటి వ్యక్తితో అలాంటి భావనలు పెంపొందించండి.

★ కుటుంబంలో, బయట, ఆఫీసులో పొరపాటు మీదైతే 'సారీ' అనండి. 'సారీ' అనే రెండు అక్షరాల పదం అద్భుతంగా పని చేస్తుంది. రాజీకి మారుమాట 'సారీ'.

★ అందరిపై శ్రద్ధ, ఇష్టం చూపాలి, 'హలో అనడం', 'షేక్ హ్యాండ్ ఇవ్వడం', 'నమస్తే చెప్పడం', 'ఓ చిరునవ్వు నవ్వడం'.

★ కొన్ని సార్లు లాజికల్‌గా చెప్పడం వల్ల ఎదుటి వారు బాగా అర్థం చేసుకుంటారు.

మనిషి అనుకుంటే సాధించలేనిది ఏది లేదు. ప్రతి ఒక్కరూ పై విషయాలలో కొన్ని అయినా అనుసరిస్తే వ్యక్తికి, వ్యక్తికి మధ్య వచ్చే ఘర్షణ-సంఘర్షణలు 90% తగ్గిపోతాయి. మన చుట్టూ వున్న వాతావరణం స్నేహశీలంగా మారి, అందరూ ప్రశాంతంగా ఉంటారు. చుట్టూ వున్న సంఘాన్ని కూడా ప్రశాంతంగా మార్చగలరు. ఆ శక్తి సామర్థ్యాలు ప్రతి మనిషికి వున్నాయి. ప్రయత్నిద్దామా - మనం కూడా విజేతల వరుసలో స్థానం ఏర్పరుచుకుందాం.

*- ఎన్. రాజేశ్వరమ్మ, ఫ్యాకల్టీ,*
*ఈ.టి.సి., శ్రీకాళహస్తి*



Sthanika_BW_Janf13.indd 22 29/12/12 2:52 PM


**వి**శ్వవ్యాప్తంగా ఈనాడు మానవ హక్కులు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. మానవ హక్కులకు సంబంధించిన చర్చ ఈనాడు అనూహ్యమైన ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నా, ఇందుకు అంకురార్పణ ఎప్పుడో జరిగింది. మానవ హక్కులకు చారిత్రాత్మక ప్రాముఖ్యం వుంది. బ్రిటన్‌లో మాగ్నకార్టా (magna crta 1215) రూపంలో, అమెరికాలో బిల్ ఆఫ్ రైట్స్ (Bill of Rights 1688) రూపంలో వీటిని గుర్తించడం జరిగింది. అమెరికా విప్లవం, ఫ్రెంచి విప్లవం, భారత స్వాతంత్ర్య సంగ్రామం కూడా మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిపిన పోరాటాలే.

# భారతీయ సంస్కృతిలో భాగమైన మానవ హక్కులు

1946 ఫిబ్రవరి 16వ తేదీన ఐక్యరాజ్య సమితి ప్రముఖ అంగమైన భద్రతా మండలి మానవ హక్కుల ప్రకటనను రూపొందించడం కోసం ఒక కమీషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమీషన్ సూచనల మేరకు ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948 డిసెంబర్ 10వ తేదీన మానవ హక్కుల ప్రకటనను అమోదించింది. ఈ ప్రకటనను ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ తప్పకుండా అమలు పర్చాలని కోరడం జరిగింది.

### ముఖ్యమైన మానవ హక్కులు

మానవ హక్కులను సివిల్ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులుగా విభజించడం జరిగింది. ఈ హక్కులు మానవుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయి. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటన ప్రకారం పుట్టిన ప్రతి వ్యక్తికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది. ప్రభుత్వాలు ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగే రీతిలో ప్రవర్తించరాదు. దేశంలోని ప్రజల ప్రాణాలను కాపాడవలసిన గురుతర బాధ్యత ఆయా దేశాల ప్రభుత్వాల పైన ఉంది. ఎందుచేతనంటే





మానవ హక్కులలో జీవించే హక్కు అతి ముఖ్యమైనది. ప్రతి వ్యక్తికి భావ ప్రకటన హక్కును కల్పించినందువలన వ్యక్తులకు ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఉంది. ప్రభుత్వాన్ని విమర్శించే వారందరినీ నేరస్తులుగా పరిగణించరాదు. ప్రతి పౌరుడికి సమావేశాలు జరుపుకోవడానికి, రాజకీయాల్లో పాల్గొనడానికి, తనకు నచ్చిన మతాన్ని స్వీకరించి ప్రచారం చేసుకోవడానికి, గౌరవ ప్రదమైన జీవనం సాగించేందుకు, నచ్చిన వృత్తిని చేపట్టడానికి హక్కు ఉంది. మానవ హక్కులలో ప్రధానమైన అంశం సమ న్యాయ పాలన. సమ న్యాయాన్ని పాటించడం అంటే కుల, మత, జాతి, లింగభేదం లేకుండా దేశ ప్రజలందరినీ సమానంగా చూడడం.

మానవ హక్కులు భారతీయ సంస్కృతిలో ఒక భాగం. ఇందుకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడికలను, చట్టాలను మన ప్రభుత్వం ఎప్పుడూ గౌరవిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోంది. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన మానవ హక్కులను భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల రూపంలో చేర్చడం జరిగింది. మానవ హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించాయి. భారతీయ శిక్షాస్మృతి, భారతీయ నేరస్మృతి, భారత సాక్ష్యాల చట్టం లాంటి అనేక చట్టాలను ఈ నిబంధనల మేరకు రూపొందించడం జరిగింది.

మన సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజల పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించడం జరిగింది. పౌరహక్కుల

చట్టం-1976, వరకట్న నిషేధ సవరణ చట్టం-1986, నేరస్థుల ప్రొబేషన్ చట్టం, బాల నేరస్తుల చట్టం, బాల కార్మికుల చట్టం లాంటివి సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజల మానవ హక్కుల పరిరక్షణ కోసం రూపొందించడం జరిగింది. ప్రత్యేకంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారిపై జరిగే అత్యాచారాలను నివారించడానికి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచార నిరోధక చట్టం) 1989లో అమలులోనికి వచ్చింది.




భారతీయ సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో కొన్ని సంస్థలను నెలకొల్పింది. ఇందులో ప్రముఖంగా పేర్కొనదగినవి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమీషన్, అల్ప సంఖ్యాక వర్గాల కమీషన్, జాతీయ మహిళా కమీషన్. ఈ కమీషన్లు ఆయా వర్గాల ఆర్థిక, సాంఘిక పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తూ, వారి కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన అభివృద్ధి కార్యక్రమాల సక్రమ అమలుకు కృషి చేస్తాయి. ఈ వర్గాలకు చెందిన వారు వారి మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు సంబంధిత కమీషన్లకు ఫిర్యాదు చేసి తగు రక్షణను పొందవచ్చు.

## సుప్రీం కోర్టు మార్గదర్శక సూత్రాలు

మానవ హక్కుల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. ఈ మార్గదర్శక సూత్రాలననుసరించి (1) పోలీసు అధికారులు ఒక వ్యక్తిని నిర్బంధంలోనికి తీసుకున్నప్పుడు, విధిగా ఆ వ్యక్తిని 24 గంటలలోపు సమీప మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచాలి. (2) నిర్బంధించిన వ్యక్తిని ఎందుకు నిర్బంధించినదీ ఆ వ్యక్తి సమీప బంధువులకు గాని, మిత్రులకు గాని తెలియజేయాలి. (3) నిర్బంధించిన వ్యక్తికి తన న్యాయవాదిని కలుసుకోవడానికి అవకాశం ఇవ్వాలి. (4) నిర్బంధించబడిన వ్యక్తికి భోజనాన్ని సమకూర్చడమే కాక, అవసరమయితే తగు వైద్య సదుపాయం కల్పించాలి. (5) మహిళలని రాత్రి వేళల్లో పోలీసులు లాకప్‌లో ఉంచరాదు. మహిళను లాకర్‌లో ఉంచటం అనివార్యమయితే వారి సోదా, నిఘా కోసం మహిళా పోలీసులను వినియోగించాలి. (6) పోలీసులు నేర విచారణలో అనాగరికతకు చిహ్నాలైన థర్డ్ డిగ్రీ పద్ధతులను ఉపయోగించరాదు. లాకప్‌లలో హింస జరగకుండా చూసి, బోగస్ ఎన్‌కౌంటర్లపై వస్తున్న విమర్శలు తగ్గేటట్లు చర్యలు తీసుకోవాలి.

మన దేశంలో న్యాయ వ్యవస్థ మానవ హక్కుల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డ అధికారులను తీవ్రంగా మందలించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని హెబియస్ కార్పస్ రిట్ ద్వారా హైకోర్టులు, సుప్రీంకోర్టు పరిరక్షిస్తాయి. ఈ రిట్ విచారణకు వచ్చినప్పుడు నిర్బంధించిన వ్యక్తిని విచారణ నిమిత్తం భౌతికంగా న్యాయస్థానం ముందు హాజరు పరచాలి. ఒక వ్యక్తిని చట్టవిరుద్ధంగా నిర్బంధించినప్పుడు ఆ వ్యక్తి బంధువులుగాని, మిత్రులుగాని హెబియస్ కార్పస్ రిట్‌ను సర్వసాధారణంగా హైకోర్టులో దాఖలు చేయడం జరుగుతుంది. నిర్బంధించబడిన వ్యక్తిని ప్రత్యక్షంగా విచారించి, ఒకవేళ ఆ వ్యక్తిని చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తే అతనిని వెంటనే విడుదల చేయడం జరుగుతుంది.

మానవ హక్కుల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం, 23 సెప్టెంబర్ 1993 వ సంవత్సరంలో జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సంఘం మానవ హక్కుల ఉల్లంఘనకు గురైన వారి తరపున వారి బంధువులు, మిత్రులు చేసిన ఫిర్యాదుల మేరకు కేసులను విచారణకు స్వీకరిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఉండడానికి అవసరమైన చర్యలను జాతీయ మానవ హక్కుల సంఘం సిఫారసు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి మానవ హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేసింది.

## పరిమితులు

ఉగ్రవాదం, తీవ్రవాదం, హింసావాదం పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. ఈ చర్యలను నిరోధించడం కోసం ప్రభుత్వం విధించిన ఆంక్షలు దేశ సమగ్రత, భద్రత దృష్ట్యా అవసరమయినవి. వీటిని మానవ హక్కుల ఉల్లంఘన చర్యలుగా భావించరాదు. మన దేశ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించే వారిని, రక్షణ వ్యవస్థకు కీడు తలపెట్టేవారిని మానవ హక్కుల పరిరక్షణ పేరిట క్షమించరాదు.

**- డా॥ పి. మోహన్ రావు**

**పరిపాలనా విభాగ అధ్యక్షులు, రైల్వే డిగ్రీ కళాశాల, సికింద్రాబాద్**

# జాతీయ పతాక నియమావళి

**జాతీయపతాక నియమావళి అనేది భారత జాతీయపతాక వాడకాన్ని నిర్దేశించే చట్టాల సమాహారం. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాతీయపతాకం ఉత్పత్తి తగు నిర్దేశకాల ప్రకారమే జరిగేటట్లు పర్యవేక్షిస్తుంది. నియమావళిని ఉల్లంఘిస్తే కఠినమైన శిక్ష తప్పదు. ఈ నిమమావళిని Emblems and Names (Prevention of Improper use) Act, 1950 (No.12 of 1950) and the Prevention of Insults to National Honour Act, 1971 (No.69 of 1971) అనే రెండు చట్టాల్లోని అంశాలను కలిపి 2002లో రూపొందించారు.**

ఈ నియమావళి చాలా కఠినంగా ఉందని, సాధారణ పౌరులు తమ ఇండ్లమీద, ఇతర భవంతులమీద జెండా ఎగరేసే అవకాశం లేకుండా చేసిందని విమర్శలుండేవి. చాలా సంవత్సరాలు కేవలం ప్రభుత్వ భవంతుల మీదనూ, ప్రభుత్వాధికారులకూ మాత్రమే జెండా ఎగరేసే అధికారముండేది. 2001 లో నవీన్ జిందాల్ సుప్రీమ్ కోర్టులో ఒక కేసు గెలవడంతో ఆ పరిస్థితి మారిపోయి దేశపౌరులందరికీ జెండా ఎగరేసే అవకాశం కలిగింది. జెండాను నడుం కిందిభాగంలో గాని, లోదుస్తుల మీద గాని ధరించరాదని నియమావళిని 2005లో సవరించారు.

### ప్రొటోకాల్

2002కు ముందు జాతీయ సెలవుదినాల్లో తప్ప మిగతా సమయాల్లో జాతీయపతాకాన్ని ప్రజలు ఎగర వేయడానికి అనుమతించేవారు కాదు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మాత్రమే ఆ అధికారం ఉండేది. ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం వేశాడు. జిందాల్ తన కార్యాలయ భవంతి మీద జాతీయ పతాకాన్ని ఎగురవేయగా అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని, ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. జిందాల్ నిబంధనలకు అనుగుణంగా జాతీయపతాకాన్ని ఎగరేయడం పౌరుడిగా తన హక్కని, దేశం పట్ల తన ప్రేమను ప్రకటించుకునే మార్గమని వాదించాడు. మూస:note ఆ కేసు మూస:note సుప్రీమ్‌కోర్టుకు వెళ్ళింది. సుప్రీమ్ కోర్టు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని వేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

కేంద్ర మంత్రిమండలి పతాకం గౌరవానికి భంగం కలగని రీతిలో ఎవరైనా జాతీయపతాకాన్ని ఎగరేయవచ్చని అనుమతిస్తూ జాతీయపతాక నియమావళిని సవరించింది. ఈ సవరణ 26-01-2002 నుంచి అమల్లోకి వచ్చింది. జాతీయపతాక నియమావళి అనేది చట్టం కానప్పటికీ, ఆ నియమావళిలోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీమ్‌కోర్టు యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో పేర్కొంది. జాతీయపతాకాన్ని ఎగరేసే హక్కు సంపూర్ణహక్కు కాదు. పరిమితులతో కూడిన హక్కు. దీన్ని భారత రాజ్యాంగంలోని 51A ఆర్టికల్‌లోని ప్రాథమిక విధులతో కలిపి అన్వయించవలసి ఉంటుంది.

### పతాకాన్ని గౌరవించడం

భారతీయ చట్టం జెండాను ఎల్లవేళలా 'గౌరవంతో, విధేయతతో' చూడాలి. The Emblems and Names (Prevention of Improper Use) Act, 1950 స్థానంలో వచ్చిన జాతీయపతాక నియమావళి -2002 పతాకం వాడకం, ప్రదర్శనలకు సంబంధించిన నియమాల సమాహారం.

దీని ప్రకారం పతాకం ఎప్పుడూ నేలనుగానీ, నీటినిగానీ తాకరాదు. టేబుల్ క్లాత్‌గా గానీ, ప్లాట్‌ఫాం ముందుగానీ వాడరాదు. విగ్రహాల మీద, ఇతర వస్తువుల మీద గానీ కప్పరాదు. 2005 వరకు దుస్తుల మీద, యూనిఫారాల్లో జెండాను వాడడం నిషిద్ధంగా ఉండేది. 05-07-2002 న సవరించబడిన నియమావళి ప్రకారం దుస్తులమీద, యూనిఫారాల్లో జెండాను వాడవచ్చు. ఐతే, నడుం కిందిభాగంలో, లోదుస్తుల మీద వాడరాదు. జెండాను దిండుగలీబులమీద, చేతిరుమాళ్ళ మీద ఎంబ్రాయిడర్ చేయడం కూడా నిషిద్ధం. ఉద్దేశపూర్వకంగా జెండాను తలకిందులు చేయడం, దేంట్లోనైనా ముంచడం, ఆవిష్కరణకు ముందు పువ్వులు తప్ప ఇతర వస్తువులను జెండాలో ఉంచడం, జెండా మీద ఏదైనా రాయడం కూడా నిషిద్ధం.

### పతాకానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

జెండా గౌరవాన్ని కాపాడడానికి పాటించవలసిన సాంప్రదాయిక నియమాలు అనేకం ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో వాతావరణ పరిస్థితులతో నిమిత్తం లేకుండా సూర్యోదయమప్పుడు ఎగురవేసి, సూర్యాస్తమయమప్పుడు దించివేయాలి. ఐతే ప్రత్యేకపరిస్థితుల్లో పబ్లిక్ భవంతి మీద రాత్రిపూట కూడా ఎగరనివ్వవచ్చు.

జెండాను ఎప్పుడూ తలకిందులుగా చూపించరాదు, ఎగురవేయరాదు, చిత్రించరాదు. నిలువుగా ధరించినప్పుడు సరిగ్గా 90 డిగ్రీలు తిప్పడంతో బాటు జెండాను తిప్పి ధరించాలి. దారాలు ఊడిపోయిన, మురికిగా ఉన్న జెండాను ప్రదర్శించడమంటే జెండాను అవమానించడమే. పతాకావిష్కరణకు వాడే జెండా కర్రలకు, జెండాను కర్రకు కట్టే తాడుకు ఇలాంటి నియమాలే వర్తిస్తాయి. ఇవన్నీ సరైన స్థితిలో ఉండేట్టు జాగ్రత్త వహించాలి.

### జాతీయపతాక ప్రదర్శన

పతాకప్రదర్శనను నిర్దేశించే నియమాల ప్రకారం రెండు జెండాలను పూర్తిగా విస్తరించి పోడియం వెనుక గోడ మీద సమాంతరంగా ప్రదర్శించినప్పుడు వాటికి కర్రలను తగిలించే చివరలు రెండూ ఒకదానికొకటి అభిముఖంగా ఉండాలి. జెండాను చిన్న కర్రకు తగిలించినప్పుడు గోడకు వాలుగా అందంగా కనిపించేటట్లు వేలాడదీయాలి. రెండు జాతీయపతాకాలను ఆకారంలోని కర్రలకు తగిలించినట్లైతే రెండు జెండాలూ వ్యతిరేకదిశల్లో విస్తరించుకునేటట్లు తగిలించాలి. జాతీయపతాకాలను టేబుళ్ళు, వేదికలు, పోడియంలు, బిల్డింగుల మీద కప్పడానికి గానీ, రెయిలింగుల మీద అలంకరణ కోసంగానీ వాడకూడదు.

### ఇతర దేశాల జాతీయపతాకాలతో

మన దేశంలో బహిరంగ ప్రదేశాల్లో ఇతర దేశాల జాతీయ పతాకాలతో కలిపి ఎగరేసేటప్పుడు ఇది కుడివైపు (చూసేవారి ఎడమచేతివైపు) మొట్టమొదటిదిగా ఉండాలి. మిగతా పతాకాలు ఇంగ్లీషులో ఆయాదేశాల పేర్లను బట్టి అక్షరక్రమంలో అమర్చాలి. అన్ని



Sthanika_BW_Janf13.indd 29 29/12/12 2:52 PM

పతాకాలూ దాదాపు ఒకే పరిమాణంలో ఉండాలి. ఏ పతాకమూ ఈ పతాకం కంటే పెద్దదిగా ఉండకూడదు. అన్ని పతాకాలూ విడివిడిగా వేర్వేరు జెండాకర్రల మీద ఎగరెయ్యాలేగానీ ఏ ఒక్క జాతీయపతాకమూ మరొక జాతీయపతాకం మీద ఉండకూడదు. అలాంటి సందర్భాల్లో పతాకాల వరస మొదట, చివర, అక్షరక్రమాన్ని బట్టి మధ్యలోనూ కూడా ఈ పతాకాన్ని ఎగరేయవచ్చు. పతాకాలను వృత్తాకారంలో ఎగరేసినప్పుడు, ఈ పతాకం దగ్గరే వృత్తం మొదలై, సవ్యదిశలో తిరిగి రావాలి. ఈ పతాకాన్ని అన్నిటి కంటే ముందు ఎగరేసి అన్నిటి కంటే చివర అవనతం చెయ్యాలి.

## జాతీయేతర పతాకాలతో

జాతీయపతాకాలు కాని ఇతర పతకాలతో - కార్పొరేట్ పతాకాలు, అడ్వర్టైజింగ్ బానర్లులాంటివాటితో - కలిపి ఎగరేసేటప్పుడు అన్నీ వేర్వేరు జెండా కర్రల మీద ఉన్నట్లైతే జాతీయపతాకం మధ్యలోనైనా ఉండాలి లేదా అన్నింటికంటే మొదట్లో - చూసేవారికి ఎడమవైపు చివరన వచ్చేటట్లు - ఉండాలి లేదా మిగతా పతాకాలన్నిటి కంటే కనీసం ఒక జెండా వెడల్పు ఎత్తులో ఉండాలి. మిగతా జెండాలన్నీ దీనికి వెనుకే ఉండాలి. ఒకవేళ జెండాలన్నీ ఒకే కర్రమీద ఉన్నట్లైతే ఇదే అన్నిటికంటే పైన ఉండాలి. ఇతర జెండాలతో కలిపి ఊరేగింపులో తీసుకువెళ్ళేటప్పుడు ఇది ఊరిగింపు మొదట్లో ఉండాలి. జెండాలన్నిటినీ ఒకే వరసలో తీసుకెళ్ళేటప్పుడు ఇది కుడివైపున మొదటిదిగా ఉండాలి.

## గదిలో పతాకాన్ని ప్రదర్శించడం

పతాకాన్ని హాళ్ళలోగానీ, గదుల్లోగానీ నిర్వహించే సమావేశాల్లో వేదికల మీద ప్రదర్శించేటప్పుడు కుడివైపునే (చూసేవారికి ఎడమవైపున) ప్రదర్శించాలి - ఇది అధికారాన్ని సూచించే స్థానం కాబట్టి. వక్తలు ఉపన్యసించే చోటికి దగ్గరలో ఉన్నట్లైతే ఇది వారికి కుడిచేతి వైపునే ఉండాలి. వేరే ఎక్కడైనా ఉన్నట్లైతే సభికులకు కుడివైపున ఉండాలి. కాషాయరంగు పైన ఉండేటట్లు పూర్తిగా విస్తరించి ప్రదర్శించాలి. నిలువుగా వేలాడదీసినట్లైతే కాషాయరంగు చూసేవారికి ఎడమచేతివైపున ఉండాలి.

## కవాతులు మరియు సంబరాల్లో

ఊరేగింపుల్లోగానీ, పెరేడ్‌లలోగానీ, ఇతర జెండా(ల)తో కలిపి తీసుకువెళ్తున్నప్పుడు ఊరేగింపు ముందుభాగాన కుడివైపు మొదటిదిగా గానీ, మధ్యలో ఇదొక్కటే అన్నిటికంటే ముందుగానీ ఉండాలి. విగ్రహాలను, కట్టడాలను, శిలాఫలకాలను అవిష్కరిస్తున్నప్పుడు ప్రత్యేక చిహ్నంగా జాతీయపతాకాన్ని వాడొచ్చు. కానీ వాటిని కప్పడానికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. దేనికీ/ఎవరికీ గౌరవసూచకంగా దీనిని కిందిక దించరాదు. రెజిమెంట్ల పతాకాలను, వివిధ సంస్థల పతాకాలను మాత్రం దించవచ్చు. పతాకావిష్కరణ జరుగుతున్నప్పుడు, పతాకాన్ని దించుతున్నప్పుడు, పెరేడ్‌లో పతాకాన్ని తీసుకువెళుతున్నప్పుడు, అక్కడున్న వాళ్ళందరూ పతాకం వైపు తిరిగి అటెన్షన్‌లో నిలబడాలి. యూనిఫాంలో ఉన్న వాళ్ళు తిగినవిధంగా సెల్యూట్ చేయ్యాలి. పతాకవందనం అయిన తర్వాత జాతీయగీతం అలపించాలి.

## వాహనాలపై ప్రదర్శన

జాతీయపతాకాన్ని తమ వాహనాల మీద ఎగరేసే అధికారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, పార్లమెంటు మరియు శాసనసభల సభ్యులు, లోక్‌సభ మరియు శాసనసభ స్పీకర్లు, రాజ్యసభ మరియు రాష్ట్రాల శాసనమండళ్ళ అధ్యక్షులు, సుప్రీమ్‌కోర్టు మరియు హైకోర్టుల న్యాయమూర్తులు, సైనిక, నావికాదళ మరియు వాయుసేనల్లోని ఉన్నతాధికారులకు మాత్రమే ఉంది.

వారికి అవపరమపించినపుడు తమ కార్లమీద ఎగరేసుకోవచ్చు. కారు బాయ్‌నెట్ ముందు భాగంలో సరిగ్గా మధ్యలోగానీ, కుడివైపు చివరగానీ స్థిరంగా నిలబడిన కమ్మీకి తగిలించాలి. ఇతర దేశాల నాయకులు భాతర ప్రభుత్వ వాహనంలో తిరుగుతున్నప్పుడు మన జాతీయపతాకం వాహనానికి కుడి వైపు చివరన, వారి జాతీయపతాకం ఎడమవైపు చివరన ఉండాలి.

## అవనతం

రాష్ట్రపతి ఆదేశాల ప్రకారం మాత్రమే సంతాపసూచకంగా పతాకాన్ని అవనతం (జెండా కర్రకు సగం ఎత్తులో ఎగరెయ్యడం) చెయ్యాలి. కాల అవధి ఎంతో కూడా ఆ ఆదేశంలో పేర్కొనబడుతుంది. అవనతం చేసేటప్పుడు మొదట పతాకాన్ని పూర్తిగా ఎగరేసి తర్వాత నెమ్మదిగా కిందకు దించాలి. పతాకాన్ని తీసేసేముందు దాన్ని పూర్తి ఎత్తుకు ఎగరేసి తర్వాతనే కిందికి దించాలి. భారతజాతీయపతాకం ఒక్కదాన్నే అవనతం చెయ్యాలి. ఇతరదేశాల పతాకాలు మామూలుగానే ఎగురుతాయి.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రతి, ప్రధానమంత్రుల్లో ఎవరు మరణించినా దేశవ్యాప్తంగా అవనతం చేయబడుతుంది. లోక్‌సభ స్పీకరు లేక సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి మరణిస్తే ఢిల్లీలోను, కేంద్ర క్యాబినెట్ మంత్రి మరణిస్తే ఢిల్లీ మరియు రాష్ట్రాల రాజధానుల్లోను, సహాయమంత్రి మరణిస్తే ఢిల్లీలోను, రాష్ట్రాల లేక కేంద్రపాలిత ప్రాంతాల గవర్నరు/లెఫ్టినెంట్ గవర్నరు లేక ముఖ్యమంత్రి మరణిస్తే ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోను అవనతం చేయబడుతుంది.

పైవారు ఎవరైనా చనిపోయినట్లు మధ్యాహ్నం తర్వాత సమాచారం తెలిసి, మరుసటిరోజు సూర్యోదయం లోపల అంత్యక్రియలు జరగకపోయినట్లైతే పైన పేర్కొన్నచోట్ల మరుసటిరోజు కూడా అవనతం చేసి ఉంచాలి. పైవారికి అంత్యక్రియలు జరిగేరోజు అవి జరిగేచోట కూడా అవనతం చేసి ఉంచాలి.

స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్రదినోత్సవం, గాంధీ జయంతి, జాతీయవారోత్సవాలప్పుడు (ఏప్రిల్ 6 నుంచి 13 వరకు), ఏదైనా రాష్ట్రావతరణం రోజు అవనతం చెయ్యవలసి వస్తే సదరు మృతదేహమున్న భవంతి మీద మాత్రమే అవనతం చేసి ఉంచాలి - అది కూడా మృతదేహాన్ని అక్కడినుంచి బయటకు తెచ్చేటంతవరకు మాత్రమే.

విదేశీ ప్రముఖులు చనిపోయినప్పుడు అవనతం చెయ్యడం హోం మంత్రిత్వ శాఖ ఇచ్చే ప్రత్యేక సూచనలను బట్టి ఉంటుంది. ఐతే ఎవరైనా దేశ నేత చనిపోయినప్పుడు ఆ దేశంలోని భారతకార్యాలయం అవనతం చెయ్యవచ్చు.

అధికార, సైనిక, పారామిలిటరీ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపేటప్పుడు శవపేటికి మీద తలవైపు కాషాయరంగు వచ్చేటట్లు కప్పాలి. ఐతే దానిని ఖననం/ దహనం చేసే ముందు తీసేయాలి. శవంతోబాటు గుంతలోకి దించడం, కాల్చడం చెయ్యరాదు.

## విసర్జన

పతాకం ఉపయోగించుకోలేని పరిస్థితికి చేరినపుడు దానిని సగౌరవంగా విసర్జించాలి. తగులబెట్టడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి.

◆



Sthanika_BW_Janf13.indd 30 29/12/12 2:52 PM



# గ్రామ పంచాయతీలలో టెలీకమ్యూనికేషన్ టవర్ల స్థాపన నియమావళి - 2012

**గ్రామపంచాయతీల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్రప్రభుత్వం మరో ఆదాయ వనరును సమకూర్చింది. వివరాల్లోకెళితే.....**

గతంలో అనగా తేది 9.10.12 మునుపటి వరకు బిఎస్ఎన్ఎల్, రిలయన్స్, టెలికాం, టవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మొదలైన టెలికాం కంపెనీలు, ఆపరేటర్లు గ్రామపంచాయతీలలో గ్రౌండ్ బేస్డ్ టవర్స్, రూఫ్ టాప్ టవర్స్, పోల్స్, డీజల్ జనరేషన్స్, కంటైనర్స్ మొదలైనవి స్థాపించడానికి సంబంధిత గ్రామ పంచాయతీ / మండల ప్రజాపరిషత్/ జిల్లా ప్రజాపరిషత్ నియంత్రణ క్రింద ఉన్న భవన అనుమతులు పొందాక మరియు భూమి వినియోగాన్ని బదలాయింపు చేయకనే ఆయా జిల్లా కలెక్టర్‌లతో సంబంధిత భవన, భూ యజమానులు కుదుర్చుకున్న ఒప్పందంలోని నిబంధనలకు లోబడి స్థాపన చేయటానికి ప్రభుత్వం నుండి మినహాయింపు పొంది ఉన్నారు.

ఫలితంగా వీటి స్థాపనలో గ్రామ పంచాయతీల ప్రమేయం లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం, గ్రామపంచాయతీ ప్రాథమిక విధులైన "ప్రజాశ్రేయస్సు, సౌకర్యం, ప్రజారోగ్యం" మొదలైన అంశాలను పరిశీలించడానికి అవకాశం లేకుండా పోయింది. పైపెచ్చు ఇన్‌స్టలేషన్ ఛార్జీలు, వార్షిక లైసెన్సు ఫీజు వసూలు పంచాయతీలకు లేనందువల్ల రెవెన్యూ రాబడిని కూడా కోల్పోయాయి.

పై అంశాలను పరిగణనలోనికి తీసుకుంటూ, ఇన్‌స్టలేషన్, లైసెన్సు

## గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయవనరు

ఫీజులు మొదలగు అంశాలపై భవన, భూ యజమానులు, టెలికాం కంపెనీలు హైకోర్టులో దాఖలు చేసిన పలు కేసులకు సంబంధించి కోర్టు వారి పరిశీలనలు మరియు చట్టంలోని సెక్షన్ 119 పై ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో జరిగిన చర్చలు, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటకలలో అమలులోనున్న విధానాలు మొదలైన పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయతీ టెలికమ్యూనికేషన్ టవర్ల స్థాపన నియమావళి-2012" ను ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 334 తేదీ. 9.10.12 ద్వారా తక్షణమే అమలులోనికి తీసుకొని వచ్చింది. దీనిపై ప్రభుత్వ గెజిట్‌లో తేదీ: 11.10.12 న నోటిఫికేషన్ కూడా ప్రచురించటం జరిగింది.

### నియమావళి - ముఖ్యాంశాలు

ఇప్పటికే గ్రామపంచాయతీలలో గ్రౌండ్ బేస్డ్ టెలికాం స్ట్రక్చర్స్ స్థాపించి ఉంటే, అవి ఈ నియమావళి పరిధిలోకి రావు. కానీ ఒక్కసారి రు. 10,000/- ఫీజు (One Time Fee) చెల్లించి వీటిని క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది.

కొత్తగా ఈ టవర్స్ స్థాపించదలచిన టెలికాం కంపెనీలు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి నుండి ప్రాథమిక ఆమోదం పొందవలసి ఉంటుంది. తుది అనుమతి సంబంధిత సాంకేతిక అథారిటి నుండి 'స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్' పొందిన తర్వాత మాత్రమే ఇవ్వబడుతుంది.

స్థాపించిన టవర్స్‌ను వినియోగించడానికి సంబంధిత కంపెనీలు గ్రామపంచాయతీ నుండి లైసెన్సు పొందడానికి ఈ క్రింద పేర్కొన్న అనుమతులు పొంది, నిబంధనలు పాటించవలసి ఉంటుంది.

- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి నుండి రూఫ్ ఏంటెన్నా ఎత్తుకు సంబంధించి మినహాయింపు అవసరమైన చోట ఆమోదం పొందాలి.
- అగ్ని ప్రమాదాలు, మెరుపులు మొదలగు వాటికి సంబంధించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది.
- భవనానికి గానీ, ప్రజాక్షేమానికి గానీ ఏదైనా నష్టం వాటిల్లితే, పూర్తి బాధ్యత వహిస్తున్నట్లుగా ఒక చట్టబద్ధమైన హామీని ఇవ్వవలసి ఉంటుంది.

• చుట్టుప్రక్కల భవన యజమానుల నుండి, ఇంటి పైకప్పుపై అమర్చే టవర్స్‌కు సంబంధిత ఇంటి యజమాని నుండి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' తీసుకోవాలి.

## లైసెన్స్ జారీ చేసే విధానం

ఇంటర్ మినిస్ట్రీరియల్ కమిటీ ఇఎంఎఫ్ రేడియేషన్‌పై ఇచ్చిన రిపోర్టులో, ఎక్కువ జనసాంద్రత కలిగిన నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆటస్థలాలు, హాస్పిటల్ ప్రాంతాలలో మొబైల్ టవర్స్ స్థాపించకూడదని తెలియజేయడం జరిగింది. తదనుగుణంగా పంచాయతీ కార్యదర్శి పై తెల్పిన ప్రాంతాలలో టవర్స్ స్థాపన చేయకుండా జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

టెలికాం టవర్స్ స్థాపన కొరకై వచ్చిన ప్రతి దరఖాస్తును పంచాయతీ కార్యదర్శి 2 దశలలో స్క్రూటినీ చేయవలసి ఉంటుంది.

మొదటి దశలో, Locational (site) norms ను పూర్తి చేసిన టెలికాం కంపెనీలకు 'టెంపరరీ పర్మిట్' గా పిలువబడే ప్రాథమిక లైసెన్సును దరఖాస్తుతో పాటు రు.1000/- ఫీజు వసూలు చేసి మంజూరు చేయడం జరుగుతుంది. పబ్లిక్ రోడ్లను టవర్స్ స్థాపనకు వినియోగించరాదు. పబ్లిక్ స్థలాలు, గ్రామపంచాయతీ ఆస్తులు మొదలగు వాటిని వారి నుండి లీజుకు తీసుకున్న తర్వాత మాత్రమే ఆ స్థలాన్ని వినియోగించాలి. లీజుకు సంబంధించిన నిబంధనలు ప్రభుత్వ ఉత్తర్వులు నె. 215 పిఆర్ అండ్ ఆర్‌డి తేది. 25.6.2001 ప్రకారం ఉండాలి.

రెండవ దశలో, టవర్ స్థాపన పూర్తయిన తర్వాత, సంబంధిత స్ట్రక్చరల్ ఇంజనీర్‌చే జారీచేయబడిన 'Structural Stability Certificate' గ్రామపంచాయతీకి ఇవ్వవలసి ఉంటుంది. తర్వాత మాత్రమే తుది అనుమతి ఇవ్వబడుతుంది.

గ్రామ పంచాయతీచే విధించబడు ఇన్‌స్టలేషన్ ఛార్జీలు, వార్షిక లైసెన్సు ఫీజులు ఈ క్రింది విధంగా ఉంటాయి.

| వ.నెం. | కేటగిరి | గ్రామపంచాయతీచే విధించబడు ఫీజు |
|---|---|---|
| 1. | సెల్ టవర్ ఇన్‌స్టలేషన్ ఫీజు (ఒకసారి మాత్రమే) | |
| | ఎ) గ్రౌండ్ బేస్డ్ టవర్స్ ......... | రు. 15000/- |
| | బి) రూఫ్ టాప్ టవర్స్ ........ | రు. 12000/- |
| 2. | వార్షిక లైసెన్సు రెన్యూయల్ ఫీజు గ్రౌండ్ బేస్డ్ మరియు రూఫ్ టాప్ టవర్స్......... | రు. 1000/- |

పైవాటితో పాటు దరఖాస్తుదారు భవన లేదా భూ యజమానికి లీజు అద్దె చెల్లించవలసి వుంటుంది.

లైసెన్సు రెన్యువల్ చేయించుకునేవారు తప్పనిసరిగా సంబంధిత స్ట్రక్చరల్ ఇంజనీర్‌చే జారీ చేయబడిన 'స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్'



ను జతపరచవలసి ఉంటుంది.

అందిన దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శి 30 రోజులలోపు నిర్ణయం తీసుకోనలేకపోయినట్లయితే, లేదా తగు కారణాలతో దరఖాస్తును తిరస్కరించినట్లయితే, దరఖాస్తుదారు (టెలికాం కంపెనీలు) గ్రామపంచాయతీ కమిటీకి మొదటి అప్పీలును చేసుకొనవచ్చును. ఈ కమిటీ 30 రోజుల లోపు ఈ నియమావళిలో పేర్కొనబడిన స్థల నిబంధనలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవలసి వుంటుంది. గ్రామపంచాయతీ కమిటీ నిర్ణయంపై తిరిగి అప్పీలు చేసుకోదలచిన వారు కమీషనర్ లేదా వారి నామినీకి చేసుకొనవచ్చును. 30 రోజులలోపు వీరు సదరు అప్పీలుపై ఉత్తర్వులు జారీ చేయవలసి వుంటుంది. కమీషనర్ లేదా వారి నామినీ జారీ చేసిన ఆర్డర్‌పై చివరి అప్పీలును పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 264 ననుసరించి ప్రభుత్వానికి రివిజన్ పిటిషన్ రూపంలో చేసుకొనవచ్చును.

## ఇన్సూరెన్స్ / నష్టపరిహారం

దరఖాస్తు చేసిన కంపెనీలు ప్రజల జీవితాలకు, ఆస్తులకు మరియు పశువులకు వాటిల్లే నష్టాన్ని భర్తీచేయటానికి ఇన్సూరెన్స్ ప్రీమియమ్ లేదా ప్రభుత్వం సూచించే నష్టపరిహారాన్ని చెల్లించడానికి అండర్ టేకింగ్‌ను గ్రామ పంచాయతీకి ఇవ్వవలసి వుంటుంది.

ఈ నియమావళిపై ఎదురయ్యే సమస్యలపై అంతిమ నిర్ణయం ప్రభుత్వానిదే.

**బి. శ్రీలక్ష్మి, యం.పి.డి.ఓ., బి.ఎన్., చిత్తూరు జిల్లా.**


"మీ కోసం - మేము" కార్యక్రమంలో వృద్ధురాలకు చీర పంపిణీ చేస్తున్న బి.ఎన్.విల బృందం


గ్రామంలోని ఓపెన్ లైబ్రరీ


మేము సైతం అంటూ... మీ కోసం - మేము కార్యక్రమంలో బాల బి.ఎన్.వి.లు


శ్రమదానం తో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న బి.ఎన్.విలు


"శుభమస్తు" కార్యక్రమంలో సామూహిక శ్రీమంతం నిర్వహిస్తున్న బి.ఎన్.విలు



గ్రామంలోని గోడపత్రిక వ్రాస్తున్న బి.ఎన్.వి మెంబర్

## మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

# మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే

ప్రతి గ్రామంలో నివసించే ప్రజలు వారి కష్టాలను తీర్చడానికి ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసే స్వభావం నుంచి దూరం కావాలి. ఎవరి గ్రామాన్ని వారే అభివృద్ధి చేసుకోవాలి, అంకిత భావంతో ప్రణాళికా బద్ధంగా, ఐక్యంగా నిబద్ధతతో పని చేస్తే గ్రామం బాగుపడటమే కాక, అభివృద్ధి శిఖరాలను అధిరోహిస్తుందనడంలో సందేహం లేదు అని నిరూపించారు కరీంనగర్ జిల్లా రామచంద్రాపురం గ్రామంలోని బి.ఎన్‌వి.లు. అపార్డ్ ద్వారా శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న 22 మంది అత్యంత పేదకుటుంబాలకు మీ కోసం మేము ఉన్నామంటూ బియ్యం, బట్టలు పంపిణీ చేశారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్‌లు ఇప్పించడంలో చేయూతనిచ్చారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామంలో ఒక్కో బి.ఎన్.వి ఒక్కో వీధిని దత్తత తీసుకుని ఎప్పటికప్పడు శుభ్రం చేయించడం, వీధికి ఇరువైపులా చెట్లు నాటించడం, వాటి సంరక్షణ తీసుకోవడం జరుగుతుంది. రైతులకు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, బహిరంగ గ్రంధాలయం ఏర్పాటు చేయటమే కాక, గోడపత్రిక ద్వారా జాతీయ, అంతర్జాతీయ విషయాలు ఎప్పటికప్పడు గ్రామస్తులకు తెలియజేయడం, ముఖ్యంగా గ్రామస్థులకు ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాలు, సాంప్రదాయేతర ఇంధన వనరులు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాలు, ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. వీరి కార్యక్రమాలను చూసి మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రామచంద్రాపురంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ఫిల్ము చిత్రీకరించి దేశ వ్యాప్తంగా వీరికి గుర్తింపు తెచ్చింది. ఈ గ్రామంలోని భారత నిర్మాణ్ వాలంటీర్లు బీహార్ రాష్ట్రం వెళ్ళి అక్కడ భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అవగాహన కల్గించటం తమ గ్రామం చేసుకొన్న అదృష్టం అంటారు - ఇక్కడి మాజీ సర్పంచ్ భానుప్రకాష్.

**మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !**

# బి.ఎన్.వి.ల చొరవతో వలసలు లేని గ్రామంగా మారిన కనపర్తి







**ప్రకాశం జిల్లా కనపర్తి గ్రామానికి చెందిన 20 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామీణ కుటుంబాలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా అంకితభావంతో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ పథకాలు, ఫలితాలు అందేలా చూసి తమ గ్రామ ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల, తీసుకురావడంలో కృతకృత్యులు కావటమే కాక, దేశ వ్యాప్తంగా మన్ననలను పొంది ఎన్నో అవార్డులును చేజిక్కించుకున్నారు.**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామస్తుల్లో అవగాహన లేక ఉపాధి కోసం గ్రామాన్ని విడిచి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు ఎక్కువగా వలసలు వెళ్తుండేవారు. బి.ఎన్.వి.లు చొరవ తీసుకొని గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామస్తుల్లో అవగాహన పెంచి వలసలు నివారించారు. గ్రామంలోని బి.ఎన్.వి.ల కృషితో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 160 ఎకరాల బీడు భూమిని సాగులోకి తీసుకురావడం జరిగింది.

అదే విధంగా కనపర్తి పంచాయితీ శివారు మేకల సాంబయ్య పట్టపుపాలెంలో దాదాపు 90% శాతానికి పైగా తాగుడుకి బానిసలై సంపాదించిన డబ్బులు మొత్తం తాగుడికి తగలేసి ఆ మత్తులో భార్యా పిల్లల్ని చితక బాదేవారు. ఈ విషయంపై బి.ఎన్.విలు తమ దృష్టి సారించారు.

సారా మత్తులో జరుగుతున్న తాగుబోతుల ఆగడాలను వదిలించాలని బి.ఎన్.వి.లు సంకల్పించారు. భార్యా, పిల్లలతో భర్తలకు బుద్ధి చెప్పించారు. భార్యా పిల్లల ఆనందమే కుటుంబ ఆనందమనే విషయాన్ని విపులంగా తెలియజేశారు. గ్రామంలో మద్యం దుకాణాన్ని మూసివేయించారు. "ఇకపై త్రాగిన వాళ్ళకు 2 వేలు జరిమానా త్రాగినవాడిని పట్టిస్తే ఆ జరిమానాలో ఒక వెయ్యి నజరానా" అంటూ కట్టుబాటుతో నిఘాను రూపొందించారు. దాంతో ఆ కుటుంబాల్లో ఇప్పుడు గొడవలు లేవు. ఎదిగొచ్చిన బిడ్డలు చెడిపోతారనే భయందోళనలు లేవు. జనశిక్షణ సంస్థ ద్వారా 80 మంది మహిళలకు కుట్టు, అల్లికలపై శిక్షణ ఇప్పించడంతో పాటు బ్యాంకు ద్వారా ఋణ సదుపాయంతో కుట్టుమిషన్‌లు ఇప్పించారు. దీంతో ఆ గ్రామంలో మహిళలు తమ కాళ్ళపై నిలబడేట్టు చేయగలిగారు. ఎమ్.ఎస్. పట్టపుపాలెం గ్రామానికి చేరువలో బకింగ్ హాం కాలువపై బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. దీని కోసం బి.ఎన్.విలు కృషి చేసి కాలువపై తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. ఈ విజయాలను భారత్ నిర్మాణ్ వాలంటీర్లు తొలిమెట్లుగా భావించి గ్రామంలో మిగతా విషయాలపై దృష్టి పెట్టి, ముందుకు సాగుతున్నారు. ■

















## మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

# బి.ఎన్.విల కృషితో పొగాకురహిత గ్రామంగా మారిన పొంగలిపాక

**పుట్టిన ఊరును, కన్నతల్లిని మరిచిపోకూడదని పెద్దలు చెబుతారు. చాలా మంది ప్రయోజకులయ్యాక పుట్టిన ఊరును మరిచిపోతూ ఉంటారు. కానీ అదే మాతృ భూమి పై ఉన్న మమకారంతో తమ గ్రామానికి ఏదో రకంగా సేవ చేయాలని తలంచారు విశాఖపట్నం జిల్లా పొంగలిపాక గ్రామానికి చెందిన 30 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.**

గ్రామంలో చాలామంది ధూమపానం, ఖైనీ, గుట్కా, వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం భారత్ నిర్మాణ్ వాలంటీర్లను కలచి వేసింది. గ్రామస్తులు ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే పొగాకు, అనుబంధ ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్థులకు తెలియజేయాలనుకున్నారు. దీంతో పొగాకు వల్ల కలిగే నష్టాలు తెలిపే బోర్డులను అతికించారు. పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల భయంకర వ్యాధులతో బాధపడే వారి ఫొటోలను అతికించారు. దీనిని అర్థం చేసుకున్న వ్యసనపరులలో క్రమంగా మార్పు రాసాగింది. తర్వాత గ్రామస్తులతో పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో పొగాకు ఉత్పత్తులను ఏ దుకాణంలోను అమ్మకుండా కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు. వ్యసనపరులు ఇతర ప్రాంతాల్లోనైనా మత్తు పదార్థాలను వినియోగించే అవకాశం ఉందని గ్రహించిన బి.ఎన్.వి.లు రోజూ వారిని ఒక చోటికి చేర్చి పొగాకు, సంబంధిత పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించడం మొదలు పెట్టారు. క్రమంగా ప్రజల్లో మార్పు రాసాగింది. పొగాకు ఉత్పత్తులు అమ్మే వ్యాపారులకు పత్యామ్నాయం కోసం మాడుగుల ఇండియన్ బ్యాంకు ద్వారా రుణాలను కూడా సమకూర్చారు. గ్రామంలో ఒకప్పుడు పారిశుద్ధ్యం పడకేసేది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం, మురుగు కాలువలు, దుర్గంధం వెదజల్లేవి.

ప్రజలలో అంటు రోగాలు ప్రబలుతున్నాయని, చర్యలు చేపట్టాలని, అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన కానరాలేదు. అంతే ఈ సమస్యపై భారత నిర్మాణ్ వాలంటీర్లు చర్చించుకుని ప్రతి ఆదివారం గ్రామాభివృద్ధికి శ్రమదానం చేయాలని నిశ్చయించుకున్నారు. సొంత ఊరుకు సేవ చేయడం మహాభాగ్యంగా తలచారు. పలుగు, పార పట్టారు. కన్పించిన తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించారు. వీధి రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేశారు. త్రాగునీటి బోర్ల వద్ద ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి గ్రామాన్ని అద్దంలా తీర్చిదిద్దారు. దాంతో గ్రామంలో ప్రతి ఒక్కరికీ శుభ్రతపై అవగాహన వచ్చింది. దీంతో ఎవరి ఇంటి వద్ద వారు శుభ్రం చేసుకోవడం వల్ల గ్రామమంతా కడిగిన ముత్యంలా కన్పిస్తుంది. వీటితో పాటు గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ గ్రామస్తులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నుండి పొగాకు రహిత గ్రామంగా అవార్డును అందుకున్నారు.

మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో సోలార్ గ్రామంగా రూపొందిన కన్నపుకుంట





**కేవలం 220 కుటుంబాలు 1100 జనాభా, మండలంలోనే మారు మూల గ్రామం, అదే కర్నూలు జిల్లా కన్నపుకుంట. ఈ గ్రామానికి ప్రభుత్వం నుండి అందుతున్న సహాయం అంతంతే. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉండేది. ఇదంతా గతంలో మాట. నేడు ఆ గ్రామమే రాష్ట్రానికి, దేశానికీ ఆదర్శంగా మారింది. దీనికంతటికీ కారణం ఆపార్డ్‌లో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.**



గ్రామంలో ఒకప్పుడు కట్టెలపొయ్యితో వంట చేయటానికి ఆడవాళ్లు ఎన్నో ఇబ్బందులు పడేవారు. కట్టెల పొయ్యి ద్వారా వచ్చే పొగతో అనారోగ్యం బారిన పడుతుండేవారు. గ్రామంలో ప్రొద్దుగూకితే చీకటి రాజ్యమేలేది. దీనితో కిరోసిన్ దీపాలే దిక్కు అయ్యేవి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం కనుగొనవచ్చునని నిరూపించారు కన్నపుకుంట బి.ఎన్.వి.లు. సోలార్ లాంతర్ల వినియోగం ద్వారా చీకటి రాత్రుల్ని తరిమెయ్యాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం నెడ్‌క్యాప్‌ను (సాంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ) సంప్రదించారు. నెడ్‌క్యాప్ సహకారంతో గ్రామంలో 50 వీధి లైట్ల స్తంభాలకు రూ॥ 2 లక్షల 50 వేల విలువగల సౌరశక్తి ద్వారా వెలిగే లైట్లను అమర్చుకున్నారు. దీని ద్వారా గ్రామంలో రహదారులన్నీ కాంతిమయం చేసుకున్నారు. అదే విధంగా పగలు సూర్యకిరణాలు పడితే, రాత్రి సమయంలో వెలుగునిచ్చే 18 సోలార్ దీపాలు నెడ్‌క్యాప్ వారి నుండి రాయితీపై పొందారు. వీటి సహాయంతో దాదాపు 6 గంటల పాటు విద్యుత్ లేకపోయినా చీకటి రాత్రుల్ని వెలుగుమయం చేసుకుంటున్నారు. దీనితో విద్యుత్ బిల్లుల భారం తగ్గటమేకాక విద్యుత్ కొరతను నివారించవచ్చు అని నిరూపించారు.

ఈ విధంగా మిగతా గృహాలకు కూడా సోలార్ దీపాలు ఇప్పించుకునే ప్రయత్నంగా బి.ఎన్.వి.లు కృషి చేస్తున్నారు. అంతేకాక గ్రామంలో ప్రతి కుటుంబం ఒక పొగరాని పొయ్యిని రాయితీపై పొందింది. వీటి ద్వారా పెద్ద ఎత్తున కట్టెలు సమకూర్చుకోవలసిన అవసరం లేకపోవడమే కాక, ఆడవాళ్ళ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యవంతమైన జీవనం సాధిస్తున్నారు.

**డా॥ వి. శివశంకర్‌ప్రసాద్ మరియు యమ్. ప్రదీప్‌కుమార్**

# జాతీయ పంచాయతీ పోర్టల్‌కు వెబ్‌రత్న గోల్డెన్ ఐకాన్ అవార్డు

**సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకొని పౌరసేవల్లో వేగం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించటానికి భారత ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. కేంద్ర మంత్రిత్వ శాఖల న్నింటిలోనూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రవేశపెట్టి ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందే సేవలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేసే బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్.ఐ.సి.) చూస్తుంది.**

కేంద్ర కమ్యూనికేషన్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నియంత్రణలో పని చేసే ఎన్.ఐ.సి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు ఇ-పరిపాలనలో వివిధ అప్లికేషన్ల రూప కల్పనకు సహాయ సహకారాలు అందజేస్తుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సేవలను ప్రజలు వినియోగించుకునేలా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువకి తీసుకొని వెళ్ళేందుకు వివిధ శాఖలు చేస్తున్న కృషిని గుర్తించి వారిని అభినందించటానికి, వారికి గుర్తింపు తీసుకొని రావటానికి కేంద్ర ఐ.టి. మంత్రిత్వ శాఖ 'వెబ్‌రత్న' అవార్డులను అందజేస్తుంది.




2012 సంవత్సరానికి గాను జాతీయ పోర్టల్‌కు అనుబంధంగా రూపొందించబడిన వివిధ శాఖలకు చెందిన పోర్టల్‌లను పరిగణనలోనికి తీసుకున్న కేంద్ర ఐ.టి. శాఖ 1. రెవిన్యూ డిపార్ట్‌మెంట్ మరియు ఆర్థిక మంత్రిత్వ శాఖ 2. పంచాయతీ మంత్రిత్వ శాఖ 3. కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు చెందిన వెబ్‌సైట్లకు వెబ్‌రత్న అవార్డులను బహుకరించింది.

కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న జాతీయ పోర్టల్ (www.panchayat.gov.in) గోల్డెన్ ఐకాన్ అవార్డును గెలుచుకుంది. మంత్రిత్వ శాఖ ద్వారా అమలు అయ్యే అన్ని పథకాల వివరాలు, తదితర సేవలను సమగ్రమైన రీతిలో నాణ్యమైన సమాచారాన్ని అందజేస్తున్నందుకు ఈ అవార్డును గెలుచుకుంది.

డిసెంబర్ 10, 2012న జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఐ.టి. మంత్రి శ్రీ కపిల్ సిబాల్, సహాయమంత్రి శ్రీ మిలింద్ దేవరా, శ్రీమతి కిల్లి కృపారాణి, సెక్రటరీ శ్రీ జె. సత్యనారాయణ పాల్గొన్నారు. ◆

## పంచాయతీ యువ క్రీడా ఖేల్ ఔర్ అభియాన్ (పైకా)

**గ్రామీణ బాల బాలికలు, యువతీ యువకులకు ఆటలలో ప్రోత్సాహం, నైపుణ్యం కల్గించడాని పంచాయతీ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్ పథకం (పైకా) ద్వారా క్రీడలు నిర్వహిస్తారు. ఈ క్రీడల ద్వారా గ్రామీణ క్రీడా కారులు మండల స్థాయి తదుపరి జిల్లా, రాష్ట్ర, నేషనల్ స్థాయి వరకు వారి క్రీడా నైపుణ్యం ప్రదర్శించవచ్చును.**



### క్రీడాంశాలు

పైకాలో పది క్రీడలలో పోటీలు నిర్వహిస్తారు. వీటిలో అయిదు వివిధ రకాల ఆటల పోటీలు కాగా, మిగిలిన అయిదు వ్యక్తిగత క్రీడా పోటీలు. వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీలు గ్రూప్ ఆటల పోటీలు, వ్యక్తిగత ఆటల పోటీలలో :- విలువిద్య, అథ్లెటిక్స్, బాక్సింగ్, త్కైకాండు, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయి.

### ఎంపిక విధానం

13 నుంచి 16 సంవత్సరాల వరకు మొదటి విభాగం. వీరు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్నవారు ఆడతారు. వీరు జూనియర్స్. 16 నుంచి 25 సంవత్సరాల వరకు సీనియర్స్. వీరు మండల స్థాయి వరకు ఆడతారు. జూనియర్స్‌ని మండల స్థాయిలో 12 మందిని ఎంపిక చేసి 60 మంది బాలురు, 60 మంది బాలికలను జోనల్ స్థాయికి పంపుతారు. జోనల్ స్థాయి నుంచి జిల్లా, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు వీరు క్రీడలలో పాల్గొని వారి నైపుణ్యం ప్రదర్శించవచ్చును.

### బహుమతి ప్రదానం

విద్యార్థులకు మండల స్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి కింద రూ. 120 నగదు, మెడల్, ద్వితీయ బహుమతి కింద 80 రూపాయలు, మెడల్, మూడవ బహుమతి కింద 60 రూపాయలు, మెడల్ చొప్పున బహుమతులు ఇచ్చి ఈ పథకంలో ప్రోత్సహిస్తారు. ఇక్కడ నగదు బహుమతి ఎంత అన్నది ప్రధానం కాదు. యువతీ యువకులలో క్రీడా స్ఫూర్తిని రగిలించటం, క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించటం ప్రధానంగా పేర్కొనవచ్చు.

ఈ పైకా ఆటల పోటీలను పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ శ్రీమతి వాణీమోహన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించడమైనది. ఈ పైకా పథకం ద్వారా విద్యార్థులకు క్రీడలలో గుర్తింపు లభిస్తుంది.

బీమడోలు మండలంలో పర్యాటక, క్రీడలు, పురావస్తు శాఖా మాత్యులు శ్రీ వట్టి వసంత్ కుమార్ పైకా ఆటల పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులు క్రీడలలో పాల్గొనాలని వారు సందేశం ఇచ్చారు. భీమడోలు మండలంలో 7 హైస్కూళ్ల విద్యార్థులు, పిఇటిలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

*- కె. కోటేశ్వర రావు,*
*ఎం.ఎ.బిఇడి, ఎం.పి.డి.ఓ. బీమడోలు మండలం*



Sthanika_Color_jan13.indd 24 29/12/12 5:49 PM



# అపార్డులో క్రిస్మస్ సంబరాలు



క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని అపార్డు ఉద్యోగులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఏ.ఎస్. ఉద్యోగులతో కలసి క్రిస్మస్ కేక్ కేట్ చేశారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు దేవుని బిడ్డయినా సమస్యలు అతనికి దూరం కాలేదని, సమాజంలో ఉన్న కుళ్ళును కడిగేయటానికి ఆయన తన రక్తం చిందించవలసి వచ్చిందన్నారు. ఆయనే అంత కష్టపడితే సామాన్య మానవులైనా మనం సమాజాన్ని బాగు చేయటానికి, చాలా కష్టపడవలసి వుంటుందన్నారు. అందుకు అనుగుణంగానే పనిచేయాలని కితాబిచ్చారు. ఇటువంటి పండుగలు జరుపుకోవడం వల్ల పనితనాన్ని పెంచి కులాలకు, మతాలకు అతీతంగా సంస్థలో మంచి వాతావరణాన్ని పెంపొందించు కోగలుగుతా మన్నారు. ఈ క్రమంలోనే గతంలో వినాయక చవితి, రంజాన్ ఇప్పుడు క్రిస్మస్ పండుగలు నిర్వహిస్తున్నామన్నారు.

ఒక్క భారతదేశంలోనే అన్ని మతాల పండగలని జరుపుకోగల్గుతామని ఇంత మంచి సాంప్రదాయం మనదేశంలో ఉన్నందుకు మనమందరం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అన్ని మతాలు పండుగల్ని కలసికట్టుగా అపార్డు ఉద్యోగులు నిర్వహించు కోవడం అభినందనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అపార్డ్ జాయింట్ డైరక్టర్ డా॥ నాగరాజు, సెంటర్ హెడ్‌లు ప్రొ॥ సూర్యనారాయణ రెడ్డి, మదనమోహనరావు, లక్ష్మీపతి, డా॥ ప్రసాద్, కూర్మారావు, శ్రీమతి శివపార్వతి, పరిపాలనాధికారి నరేంద్రనాథ్, వివిధ సెంటర్లలోని ఫాకల్టీ సభ్యులు, అపార్డు అధ్యాపకేతర సిబ్బంది, కాంట్రాక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ■



# యువ చైతన్య సదస్సుల ద్వారా భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అవగాహనా సదస్సులు - కర్నూలు జిల్లా అధికారుల చొరవ

**కర్నూలు జిల్లాలోని మొత్తం 53 మండలాల్లో 115 గ్రామాల్లో 2384 మంది యువకులు భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు కాబడి వారి వారి గ్రామాల పరిధిలో వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే వివిధ పద్ధతుల ద్వారా అపార్డు శిక్షణ ఇవ్వడం జరిగింది. మిగతా వారికి కూడా కార్యక్రమం పట్ల అవాగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో అక్కడి జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్ సి.ఇ.వో, జిల్లా యువజన సంక్షేమ అధికారి, సి.ఇ.వో సెట్కూర్ ఒక వినూత్న ఆలోచనతో జిల్లాలోని మొత్తం వాలంటీర్లకు ఒక రోజు అవగాహన సదస్సుని నిర్వహించటం, ప్రణాళిక తయారు చేయటం, అందుకు అవసరమైన నిధులను యువజన సర్వీసుల శాఖ నుండి ఏర్పాటు చేసుకోవడం, ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం విశేషం.**

ఇందులో భాగంగా పై జిల్లా అధికారులు మొట్టమొదట జిల్లాకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖవారి నుండి అందిన రూ.1,43,000/- లక్షల మొత్తాల్లో 15 క్లస్టర్లలో 17.12.2012 వ తేదీ నుండి 21.12.2012 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేయడం, ప్రతి క్లస్టరుకు ఒక రిసోర్సు టీ మును తయారు చేయుడం ఇందులో ఇద్దరు ఎమ్.పీ.డి.ఓ. లు, ఇద్దరు ఇ.ఓ.(పీ.ఆర్. & ఆర్.డి) లు; ఒక మానిటరింగ్ అధికారిని నియమించడం, హాజరయిన ప్రతి వాలంటీర్లకు భోజనం, రవాణా చార్జీలు చెల్లించడం విశేషం. ఈ అవగాహనా సదస్సుకు అధికశాతం వాలంటీర్లు హాజరుకావడం, తమ తమ అనుభవాలను చెప్పడం, చర్చించడం, వారి వారి గ్రామాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ముఖ్యంగా కర్నులు జిల్లా కలెక్టర్ ప్రవేశ పెట్టిన ప్రతి సోమవారం 'డైల్ యువర్ కలెక్టర్ ' కార్యక్రమంలో భాగస్వాములై, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుకొన్నట్లు కొందరు వాలంటీర్లు తెలియజేయటం విశేషం.

## జిల్లా అధికారుల చొరవ అభినందనీయం

ఇతర ప్రభుత్వ నిధులతో యువజనులైన భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు జిల్లా స్థాయిలో ఒక రోజు అవగాహన, చైతన్య సదస్సుల అతి తక్కువ ఖర్చుతో నిర్వహించిన కర్నులు జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్ సి.ఇ.వో, సిఇవో సెట్కూర్‌లు నిజంగా అభినందనీయులని అపార్డ్ కమిషనర్ శ్రీ కె. చంద్రమౌలి పేర్కొన్నారు. కార్యక్రమం ముగిసిన తరువాత తేదీ 24.12.2012 నాడు వారు స్వయంగా కర్నూలు జిల్లాను సందర్శించి పై ముగ్గురు అధికారులను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది. గ్రామస్థాయిలో ఆదర్శవంతమైన అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తేనే సాధ్యమౌతుందని, అర్హులందరికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. ఇటువంటి సేవలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ముందు వరుసలో నిలవాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా కలెక్టర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఇతర జిల్లాలల్లోని అధికారుల కార్యక్రమాల చేపట్టాలని సూచించారు.

**జి. జయపాల్ రెడ్డి,** సలహాదారుడు ఎ.ఎమ్.ఆర్. అపార్డ్



విశాఖపట్నం జిల్లా కలెక్టర్ శ్రీ శేషాద్రి గారికి
గ్రామ సమస్యల పరిష్కారం కోసం
వినతిపత్రం అందజేస్తున్న పొంగలిపాక బి.ఎన్.వి.లు



విశాఖ జిల్లా పొంగలిపాక గ్రామ సభలో పాల్గొన్న బి.ఎన్.వి.లు,
సి.ఇ.ఓ., జిల్లా ప్రజా పరిషత్



ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
సందర్భంగా అవగాహనా ర్యాలీ
చేస్తున్న శ్రీకాకుళం జిల్లా
కోమర్తి గ్రామ బి.ఎన్.వి.లు

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల






ప్రకాశం జిల్లా దోనకొండ మండలం భారత్ నిర్మాణ్ వాలంటీర్లు
రక్తదానం చేస్తున్న దృశ్యం



కరీంనగర్ జిల్లా రామచంద్రాపూర్
బి.ఎన్.వి.లతో చర్చిస్తున్న
అపార్డ్ అధ్యాపక బృందం



నల్గొండ జిల్లా (హుజూర్‌నగర్ )లో శ్రీనివాసపురం గ్రామంలో రహదారి కిరువైపులు ఉన్న ముళ్ళకంపలను తొలగిస్తున్న బి.ఎన్.వి.లు



తూర్పుగోదావరి జిల్లా, అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న బి.ఎన్.వి.లు




ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ చేస్తున్న కరీంనగర్ జిల్లా వీణవంక బి.ఎన్.వి.లు

# అపూర్వ విజయాలు




అంతర్జాతీయ వాలంటీర్ల దినోత్సవ సందర్భంగా ర్యాలీ చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం బి.ఎన్.వి.లు



విజయనగరం జిల్లా నోంద్రుకోన గ్రామస్తులకు జీరో బ్యాలెన్స్ బ్యాంక్ ఎకౌంట్స్ పుస్తకాలు అందజేస్తున్న బిఎన్.వి.లు, బి.ఎన్.వి.ల చొరవతో ఈ గ్రామంలో 200 నో ఫ్రిల్ అకౌంట్ల ప్రారంభమయ్యాయి.




మహబూబ్‌నగర్ జిల్లాలో అంతర్జాతీయ వాలంటీర్ల దినోత్సవ ర్యాలీ చేస్తున్న బి.న్.వి.లు




# మన జాతీయ పండగ

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు, భారతదేశ ప్రజలు అత్యంత ఉత్సాహం, భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగే గణతంత్ర దినోత్సవం. భారత ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో తయారుచేసిన అత్యున్నత శాసనం లేక చట్టాన్నే రాజ్యాంగంగా భావిస్తున్నారు.

భారతదేశానికి బ్రిటీషు దాస్య శృంఖలాల నుండి ఆగష్టు 15, 1947 నాడు విముక్తి పొంది, స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికి, మన కోసం మనతరపున, మనప్రతినిధులచే రాయబడిన రాజ్యాంగం, నవంబరు 26, 1949న. రాజ్యాంగ సభచే ఆమోదింపబడి, 26 జనవరి, 1950 తేదీ నుండి అమలులోకి వచ్చినది.

అందుచే జనవరి 26వ తేదీన జరుపుకొనే గణతంత్ర దినోత్సవ వేడుకలను మన జాతీయ పండుగగా పరిగణించవలసి ఉంటుంది.

## రాజ్యాంగ సభ

కేబినెట్ ప్రణాళిక ఆధారంగా రాజ్యాంగసభ ఆనాటి మేధావులు, రాజ్యాంగ నిష్ణాతులు, అకళింకిత దేశభక్తులతో ఏర్పాటు చేయబడింది. రాజ్యాంగ సభకు అధ్యక్షులుగా, డాక్టరు రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. కులమతాలకు అతీతంగా రాజ్యాంగపు రచనా సంఘానికి అధ్యక్షులుగా డా॥ బి.ఆర్.అంబేడ్కర్ గారి ఎంపిక ఆనాటి రాజకీయ నాయకుల నిజాయితీకి, రాజనీతజ్ఞతకు, ఔన్నత్యానికి నిదర్శనం. రాజ్యాంగసభచే నవంబర్ 26, 1949 న ఆమోదించబడిన భారత రాజ్యాంగం 22 భాగాలతో 395 అధికరణలతో 8వ షెడ్యూల్‌లను కలిగి ఉన్నది.

## భారత రాజ్యాంగపు పునాదులు

1857వ సంవత్సరంలో సిపాయిల తిరుగుబాటుతో ప్రారంభమయిన, భారత స్వాతంత్ర్య సంగ్రామపోరాటం, భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించే వరకు అనేక ఉద్యమాలు, బలిదానాలు, రౌలత్ చట్టాలు వంటి నిరంకుశ శాసనాలను ఎదుర్కొంటూ, జలియన్ వాలాబాగ్ లాంటి అత్యంత దురదృష్టకర సంఘటనలో వేలాదిమంది ప్రాణాలు పోగొట్టుకొని, అనేక మలుపులు తిరుగుతూ, అనేక సంఘటనలు,



Sthanika_Color_jan13.indd 30 29/12/12 5:49 PM

ఉద్యమాలతోపాటు భారత రాజ్యాంగపు పునాదులను స్వాతంత్ర్య పోరాట సంగ్రామం సమయంలోనే వేసుకోవటం జరిగినది.

1918లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొట్టమొదటిసారిగా ప్రాథమిక హక్కుల అవసరాన్ని గుర్తించి, 1925లో జరిగిన జాతీయ కన్వెషన్‌లో 'హక్కుల ప్రకటన' పేరుతో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, మతానికి సంబంధించిన హక్కుల ప్రాధాన్యతల గురించి చర్చించటం జరిగింది.

1928 మద్రాసు సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ హక్కుల ఆవశ్యకత గురించి మళ్ళీ చర్చించింది. 1928లో నియమించిన మోతీలాల్ నెహ్రూ కమిటీ తయారుచేసిన ప్రాథమిక హక్కులలో 10 ప్రాథమిక హక్కులను భారతరాజ్యాంగంలో పొందుపరచటం జరిగింది.

1931 లో జరిగిన కరాచి కాంగ్రెస్ సభలో ప్రాథమిక హక్కులతోపాటు ప్రాథమిక విధులు కూడా ప్రజలకు ఉండాలని తీర్మానం చేయటం జరిగింది. వీటిలో ఎక్కువభాగం ఆ దేశ సూత్రాలు లేక నిర్దేశిక నియమాల క్రింద రాజ్యాంగంలో పొందుపరచటం జరిగి, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చటం జరిగింది. భారత రాజ్యాంగపు ఎక్కువ భాగాలు స్వాతంత్ర్య పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులు, 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా తయారుచేయబడినవి.

## భారత రాజ్యాంగంపై వివిధ రాజ్యాంగాల ప్రభావం

భారతదేశ చరిత్ర సంస్కృతికి, సాంప్రదాయాలకు విఘాతం కలగకుండా భారత ప్రజల సంక్షేమాన్ని ఆశిస్తూ, ప్రపంచదేశాలలో అమలులో ఉన్న రాజ్యాంగాల ముఖ్యలక్షణాలను మన రాజ్యాంగంలో పొందుపరచటం జరిగింది. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశ సూత్రాలు లేక నిర్దేశిక నియమాలను ఐర్లాండు రాజ్యాంగం ఆధారంగా రూపొందించటం జరిగింది.

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో మంత్రిమండలి శాసనసభకు బాధ్యత వహించే పద్ధతి బ్రిటీష్ రాజ్యాంగం ఆధారంగా తయారు చేయటం జరిగింది. ప్రాథమిక హక్కులు అమెరికా రాజ్యాంగంలోని బిల్ ఆఫ్ రైట్సు ఆధారంగా తయారుచేయబడ్డాయి. రాష్ట్రపతిని దేశాధ్యక్షునిగాను, సర్వసైన్యాధిపతిగా చేసే విధానం అమెరికా రాజ్యాంగం నుండి తీసుకోవటం జరిగింది. రాష్ట్రపతి అధికారాలు ఫ్రెంచి రాజ్యాంగం ఆధారంగాను, కేంద్ర రాష్ట్రాల సంబంధాలు, కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ విధానం కెనడా రాజ్యాంగం ఆధారంగా రాయటం జరిగింది.

ఆస్ట్రేలియా రాజ్యాంగం ఆధారంగా ఉమ్మడి జాబితా, పార్లమెటరీ ప్రివిలేజెస్‌ను తయారుచేయటం జరిగింది. రాజ్యాంగ సవరణ సౌత్ ఆఫ్రికా రాజ్యాంగం పద్ధతిలో రాయబడింది.

## భారత రాజ్యాంగపు ఔన్నత్యం

భారత రాజ్యాంగం, భారత ప్రజల ఆశయాలకు, అభివృద్ధికి మార్గదర్శి. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశసూత్రాలు ముందుతరాల ప్రభుత్వాలకు రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన నియమాలు, జారీచేసిన ఆదేశాలు.

ప్రాథమిక హక్కులు అమలు జరిపే హక్కులయితే ఆదేశ సూత్రాలు ప్రభుత్వాలచే అమలుపరచబడే సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి, ప్రజల హక్కుల పరిరక్షణకు చేపట్టవలసిన బాధ్యతలు. రాజ్యాంగపు 37వ రాజ్యాంగపు అధికరణలో చట్టాలు చేసేటప్పుడు ఆదేశ సూత్రాలను దృష్టిలో ఉంచుకొని చేయవలసి ఉంటుందని ఆదేశించారు.

38వ అధికరణలో పేర్కొన్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించే దిశగానే సాంఘిక సంక్షేమ పథకాలు, గిరిజన సంక్షేమ పథకాలు, మాతా శిశు సంక్షేమ పథకాలు, విద్యాభివృద్ధి పథకాలు అమలు జరుగుచున్నాయి. రాజ్యాంగపు 40 వ అధికరణ ప్రకారమే పంచాయితీలకు, మునిసిపాలిటీలకు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించబడ్డాయి. రాజ్యాంగపు 45వ అధికరణ ప్రకారం విద్యాహక్కును చట్టబద్ధం చేయటం జరిగింది.




మన తరపున, మన సంక్షేమాన్ని, ముందుతరాల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ఎంతో శ్రమతో మన రాజ్యాంగ నిర్మాతలు చేసిన కృషి ఫలితంగా అమలు కాబడుతున్న మన రాజ్యాంగ అమలు రోజైన జనవరి, 26వ తేదీని జాతీయ పండగగా జరుపుకొని, రాజ్యాంగ నిర్మాతలైన ఆ మహా వ్యక్తుల త్యాగాలకు, నివాళులు అర్పించవలసిన బాధ్యత ప్రతీ భారతీయునిపైనా ఉంది.


*- మట్టా మదన మోహన రావు*
*సెంటర్ హెడ్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ అండ్ వాలంటరీ యాక్షన్, ఎ.ఎమ్.ఆర్.అపార్డ్, హైదరాబాద్.*





Sthanika_Color_jan13.indd 31 29/12/12 5:49 PM







# వికలాంగుల శ్రమ శక్తి సంఘాల సభ్యులకు సత్కారం

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో శ్రమ శక్తి సంఘాల ద్వారా పనులు కల్పించి వ్యక్తిగత ఆదాయ మార్గాలను పెంచటం జరుగుతోంది. అదే విధంగా బడుగు, బలహీన వర్గాలైన వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు మండల కంప్యూటర్ సెంటర్ ద్వారా ఏర్పాటు చేసి, వారిని ఉపాధి హామీలో భాగ స్వాములుగా చేయడమే కాకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారికి ఆదాయ మార్గాలను వివిధ పనుల ద్వారా కల్పించి సంపద సృష్టిలోను, ఉత్పాదకత పెంచడంలోను ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవనం కొనసాగించగలమనే నమ్మకాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా కల్పించడం జరుగుతున్నది.**

కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 8, 2012 న 'ఉపాధి హామీ పథకం - వికలాంగుల అవగాహన సదస్సు'ను నిర్వహించటం జరిగింది.

ఈ సదస్సులో మండల పరిధిలోని 16 గ్రామ పంచాయితీల నుండి 11 వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు, 142 జాబ్ కార్డు పొందిన కుటుంబాలు పాల్గొన్నాయి. 2012-13 ఆర్థిక సంవత్సరంలో 1492 పని రోజులకు గాను (మ్యాన్‌డేస్) రూ. 2,19,579లు వేతన రూపంలో చెల్లింపులు చేయడం జరిగింది. 58 కుటుంబాలు, 42 మంది పురుషులు, 16 మంది స్త్రీలు, 23 మంది షెడ్యూల్డ్ కులాలు, 1 షెడ్యూల్డ్ తెగలు కుటుంబాలు తమ ఆదాయానిమీ పథకం ద్వారా మెరుగుపర్చుకోవడం జరిగింది.




ప్రత్యేకంగా, నల్లగొండ గ్రామ పంచాయితీ నుండి 'గబ్బర్‌సింగ్' అనే వికలాంగుల శ్రమశక్తి సంఘంలోని శ్రీ సోమ లక్ష్మణ్ (జాబ్ కార్డు నెం.33301) కుటుంబం 77 రోజులు పనిచేసి రూ. 11,319 లు ఆదాయాన్ని పొందారు. అదే విధంగా రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ వికలాంగుల శ్రమ శక్తి సంఘంలోని శ్రీ మడుపు రాజిరెడ్డి (జాబ్ కార్డు నెం.13301) కుటుంబం 64 రోజులు పనిచేసి రూ. 8,768 లు ఆదాయాన్ని సమకూర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో రెండు కుటుంబాలను డ్వామా ఎపిఓ, ఎంపిడిఓ, ఎపిఎం/ఐకెపిపిఓ, అప్సాలు శాలువ, పూలమాలలతో సత్కరించి ఆత్మవిశ్వాసాన్ని నింపడం జరిగింది.

రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన వికలాంగుల శ్రమ శక్తి సంఘ సభ్యులు మరియు సన్మాన గ్రహీత అయిన సోమ లక్ష్మణ్ ఇలా ఆనందం వ్యక్తం చేశారు. "సారూ! మీ సలహా సహకారాలతో ప్రభుత్వం మాకు కల్పించిన 100 రోజుల పనులు చేస్తున్నాము. మా కుటుంబాలను పిలిచి మాలో ఆత్మ విశ్వాసాన్ని పెంచి గౌరవించి సత్కారం చేసినందుకు ఆనందంగా ఉంది."

కరీంనగర్ జిల్లాలోని వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేసి సాంకేతిక సహాయకుల ద్వారా పనులు కల్పించడానికి ప్రధాన స్ఫూర్తి శ్రీ జి. మనోహర్, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కరీంనగర్, కృష్ణ మూర్తి, వికలాంగుల ప్రోగ్రాం అధికారి, హైదరాబాద్. వీరు అందించిన సహకారంతో ఇది సాధ్యపడింది. వారి నేతృత్వంలో కరీంనగర్ జిల్లా మరిన్ని విజయాలు సాధించాలి.

*- దుర్గం శ్రీనివాస్,*
*అదనపు కార్యక్రమ అధికారి, ఉపాధి హామీ పథకం,*
*కొడిమ్యాల, కరీంనగర్ జిల్లా,*



Sthanika_Color_jan13.indd 26 29/12/12 5:49 PM



# ఉపాధి హామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని కల్పించడం శ్రామికుల హక్కు కాబట్టి, పని అడిగిన ప్రతి కుటుంబానికి 15 రోజుల వ్యవధిలో పనిని ఇవ్వాలని యం.జి.ఎన్.ఆర్.ఇ.జి.యస్. చట్టంలో చాప్టర్ III, పేరా 7లో నిర్దేశించారు.**

దీనికి సంబంధించి ప్రతి గ్రామ పంచాయితీలో ప్రతి శనివారం పనికోసం దరఖాస్తులు సేకరించాలి. దరఖాస్తు పత్రాలను పంచాయితీ కార్యదర్శి మరియు ఫీల్డ్ అసిస్టెంట్ పని కోరిన కూలీలకు ఇవ్వాలి. ప్రతి శనివారం ఫీల్డ్ అసిస్టెంట్ ఆ గ్రామ పంచాయితీకి సంబంధించిన శ్రమ శక్తి సంఘం నుండి లేదా కూలీల నుండి దరఖాస్తులను స్వీకరించాలి. ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాస్తులను స్వీకరించిన వెంటనే కూలీలకు లేదా శ్రమ శక్తి సంఘంలోని మేట్‌కు రశీదు పత్రం తప్పకుండా ఇవ్వాలి. పనికోసం దరఖాస్తు చేసుకున్నటువంటి సభ్యుల వివరాలను పరిశీలించి ఆ సమాచారాన్ని సెల్ ఫోన్ ద్వారా బ్లూ ఫ్రాగ్ సర్వర్‌కు పంపాలి. ఈ సదుపాయం లేని గ్రామ పంచాయితీలలో మొత్తం సమాచారం మండల కంప్యూటర్ సెంటర్ నందు నమోదు చేయాలి. సమాచారం మొత్తం సేకరించిన తర్వాత ఎంత మంది పని కోసం దరఖాస్తు చేసుకోన్నారో, వారికి సరిపడా పనిదినాలను లెక్కించి వారికి సంబంధించిన పనిని కేటాయించాలి. ఈ విధంగా సోమవారం, గురువారం పని ప్రారంభించే శ్రమ శక్తి సంఘాలకు పని కేటాయించిన లేఖను ఇవ్వాలి. దీనితో పాటు వారికి సరిపడా మస్టర్‌లను కూడా ఇవ్వాలి.

పై క్రమంలో ప్రతి సోమవారం మరియు గురువారం ప్రారంభమయ్యే పనులకు సంబంధించిన అంశాలను ఫీల్డ్ అసిస్టెంట్ మరియు సాంకేతిక సహాయకుల నుండి వారికి సరిపడా పని దినాలను ఇచ్చే విధంగా చూసుకోవాలి. పనికి హాజరయ్యే కూలీల వివరాలను, అనగా మస్టర్ సమాచారాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతి రోజు పని ప్రదేశం నుండి సెల్ ఫోన్ ద్వారా సర్వర్‌కు పంపాలి. ఈ విధంగా పనికోసం ప్రతి శనివారం దరఖాస్తులు తీసుకుంటూ శ్రమ శక్తి సంఘాలలో లేని కూలీలకు కూడా వారికి సరిపడా పనిదినాలను లెక్కించి పనులను కేటాయించాలి.

**- పి. మధువెంకటకృష్ణ**
**- బి. లావణ్య**
**సిఎన్.ఆర్.యం., అపార్డ్**



# సంక్రాంతి సంబరంలో అంబరాన్నంటే ఆనందం

*పచ్చిక బంగారు పావడా దిగజార*
*నీరెండ మైచాయ తీరుగేర*
*మబ్బు పాయల కురుల్ వలసి నీలాలాడ*
*బరిగె బిట్టల పల్కు లొరపు సూప*
*మంచి ముత్యాల దామంబుల దూగాడ*
*జలిగాలి యూర్పులు సందడింప*
*విరిమల్లె నవ్వులు గరగరల్ పచరింప*
*బంతి దద్దుల కాంతి గంతు లిడగ*

*పుష్య లక్ష్మి వచ్చి పుక్కిలించిన తమ్మ*
*రసము వోలె మిరెపరాసు లొప్ప*
*కనక గర్భ మందు ననురాగ సంపత్తి*
*పట్టి చూపె ననగ పంట వలతి.*



సస్యమనే లక్ష్మికి పచ్చిక బంగారు పావడా, నీరెండ శరీరకాంతి. మబ్బులే కురులు, పిట్టల అరుపులు పల్కులు, మంచు ముత్యాల హారం, విరిమల్లెలు నవ్వులు, బంతిపూలు దుద్దులూ అలంకారాలు, హొయలు. పంట అనే స్త్రీకి ఇంతటి ఒయ్యారం ఎప్పుడు వస్తుంది? ఇంకెప్పుడు ఒక్క సంక్రాంతి వేళలో మాత్రమే.

## మకర సంక్రాంతి శోభ

సూర్య గమనానికి సంబంధించిన పర్వదినం సంక్రాంతి. సూర్యుడే కనిపించే దైవం. సూర్యారాధన వేదకాలం నుంచి ఉంది. మూడు కాలాలలోనూ సంధ్యావందనం చేసే సంస్కృతి మనది.

*'సప్తాశ్వరధ మారుఢం ప్రచండం కశ్య పాత్మజం*
*శ్వేత పద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్య హమ్'*

అని సూర్యుణ్ణి అర్చిస్తాం. క్రమణం అంటే గమనం. సంక్రమణం అంటే మేలైన గమనం. లేదా మార్పు, అవస్థాంతరాన్ని పొందటమనే అర్థాల్నీ చెప్పుకోవచ్చు. సూర్యుడు 12 రాశులలోనికి ప్రవేశించినప్పుడు మనకు నెలకో సంక్రమణం వస్తుంది. దానిని 'మాస సంక్రాంతి' అంటారు. మకర రాశిలోనికి ప్రవేశించినప్పుడే మనం సంక్రాంతిని జరుపు కొంటున్నాం. దీనినే జయసింహ కల్పద్రుమం-

*'తత్ర మేషాదిషు ద్వాదశరాశిషు క్రమేణ సంచరతై*
*సూర్యస్య పూర్వస్మాద్రాశే రుత్తర రాశౌ సంక్రమణ ప్రవేశై సంక్రాంతి'*

అని చెప్తోంది.

*సంక్రాంతులు నాలుగు విభాగాలు*

1. అయన సంక్రాంతులు 2. విషువ సంక్రాంతులు
3. షడగీత సంక్రాంతులు 4. విష్ణుపదీ సంక్రాంతులు



Sthanika_Color_jan13.indd 27 29/12/12 5:49 PM

**1. అయన సంక్రాంతులు :** ఇవి ఏడాదికి రెండు సార్లు వస్తాయి. 1. కర్కట సంక్రాంతి, 2. మకర సంక్రాంతి.

**2. విషువ సంక్రాంతులు :** రాత్రీ పగలూ సమానంగా ఉండే సంక్రాంతులు. 1. మేష సంక్రాంతి. 2. తులా సంక్రాంతి.

**3. షడగీతి సంక్రాంతులు :** 1.మిధున, 2.కన్య, 3. ధనుర్ సంక్రాంతులు

**4. విష్ణుపదీ సంక్రాంతులు :** 1.వృషభ, 2. సింహ, 3.వృశ్చిక, 4.కుంభ సంక్రాంతులు.

జ్యోతిశ్శాస్త్రం ప్రకారం వార నక్షత్ర గణనను బట్టి - 1.మందా, 2. మందాకినీ, 3. ధ్వాంక్షీ, 4. హోరా, 5. మహోదరీ, 6. రాక్షసీ, 7. విశ్రితా అనే సంక్రాంతులూ ఉన్నాయి. కాలగణనం ప్రకారం సంక్రమణం అంటే త్రుటిలో నూరోవంతు. తత్పరలో నూరోవంతు త్రుటి. తత్పర రెప్పపాటు కాలంలో ముప్పయ్యవభాగం.

## ఉత్తరాయణ పుణ్యదినం - పర్వదినం

మకర సంక్రాంతి ఉత్తరాయణంలో వచ్చే పర్వదినం. సూర్యుడు ఉత్తరం వైపు నడుస్తాడు. ఈ కాలం దేవతలకెంతో ఇష్టం. స్వర్గద్వారాలు తెరచి ఉంటాయి.

*'అగ్ని ర్జ్యోతి: రహష్శుక:*
*షణ్మాసా ఉత్తరాయణమ్*
*తత్ర ప్రయతా గచ్ఛంతి*
*బ్రహ్మ బ్రహ్మ విదో జనా:*
*ధూమో రాత్రి స్తధాకృష్ణ :*
*షణ్మాసా దక్షిణాయనం*
*తత్ర చాంద్రమసం జ్యోతి:*
*యోగీ ప్రాప్య నివర్తతే'*

అని భగవద్గీత వచిస్తోంది.

## భోగుల్లో భోగుల్లో

'భోగుల్లో భోగుల్లో భోగభాగ్యాల భోగుల్లో' అంటూ పల్లెలన్నీ ఆనందతాండవం చేస్తాయి. భోగం కలది భోగి. సకల భోగాలనూ అందిస్తుందనీ, చెడును మంటల్లో వేసి త్యజించాలనీ, తరువాత రోజు సంక్రాంతి కాబట్టి మంచికి ఆహ్వానం పలకాలనీ సందేశం. సస్యసమృద్ధి, దేవతాప్రీతి ఈ పండుగ నాడు దేవతల్ని అర్చిస్తే కలుగుతాయి. భూదేవి అంశగా జన్మించిన గోదాదేవి రంగనాథుణ్ణి పెండ్లాడింది భోగి రోజునే. మంగళస్నానాలు, భోగిమంటలు గొబ్బెమ్మలు ఉదయం పూటా, భోగిపళ్ళు పోయటం, బొమ్మల కొలువు పెట్టటం సాయంకాలం జరిగే వేడుకలు.

## సంబరాల సంక్రాంతి

ఇది మొక్కుల పండుగ. అందుకే పెద్దపండుగ. సూర్యుడు మకరరాశిలోనికి ప్రవేశించే సమయమిది. మకరానికి అధిపతి శని అందుకే నువ్వులు, కూష్మాండం, కంబళ్ళు, సజ్జలు మొదలైన ఉష్ణప్రాకృతిక వస్తువులు దానం చేస్తారు.

*దీప దానం ప్రవస్తం హి ధనుర్మా సస్యపూజనే !*
*గోఘృతేన చ వై దీప మధవా తిలతైలత :*

విష్ణ్వాలయాలలో దీపారాధన చేయటమూ ఈ కాలంలో మంచిది.



*అఖండ దీపాన్ శక్త్యా చ విష్ణవై పరమాత్మనే*
*అర్పయేద్యతి పుణ్యాత్మా సర్వరోగాత్ప ముచ్యతే*

సంక్రాంతి నాడు బలిప్రదానం చేసి పితృదేవతల్ని స్మరించాలి. అభ్యంగన స్నానం చేయాలి. లేకపోతే ఏడు జన్మల వరకూ దారిద్ర్యం, అనారోగ్యం వెంటాడతాయట. బలిచక్రవర్తిని వామనుడు పాతాళానికి తొక్కింది మకర సంక్రాంతి నాడే. పితృదేవతలకు తర్పణం వదులుతారు. సంక్రాంతి రోజున చేసే దానధర్మాలు కోటిరెట్లు ఫలాన్నిస్తాయి.

## ఘనమైన కనుము

అవును ఇది ఘనమైనదే. మన జీవితంలో భాగంగా జీవించే పశువులను ఆరాధించే పండుగ కాబట్టి, ఇది రైతుల పండుగ పశువుల శాలలో పాలపొంగలి, పశు పొంగలి అని అరుస్తూ పొంగళ్ళు వండుతారు. దీనిని దేవతలకు నైవేద్యం పెట్టి ఆ మెతుకులను పొలాల్లో చల్లుతారు. దీనినే తమిళంలో 'మాట్టు పొంగల్' అంటారు. ఇంద్రపూజ కన్నా గోపూజ చేయటం సాంప్రదాయం అయింది. ఇది పక్షుల పండుగ. 'కనుము నాడు కాకైనా మునుగుతుంది' 'కనుము నాడు కాకైనా కదలదు' అనే సామెతలు మన జీవితంలో కలిసిపోయాయి. ఈ రోజు ప్రయాణాలు చేయకూడదు. మంగళ స్నానాలు చేసి విశాలమైన మైదానాలలో ధాన్యం గింజల్నీ, గారెలనీ విసిరి పక్షులకు పెడతారు. పశువులను దేవతాలయాల వద్ద పసుపుకుంకుమా పూసి హారతులిచ్చి కొలుస్తారు. ముక్కనుమ నాడు దేవతారాధన విశేషంగా చేస్తారు.

కోడిపందాలు, నాటకాలు, పగటివేషాలు, బుడబుక్కల వాళ్ళు, హరిదాసులు, గంగిరెద్దుల వాళ్ళు సంక్రాంతి సంబరాల్ని లోకమంతా వ్యాపింపజేసేలా ఆనందం పరిచే సంక్రాంతి సంబరంలో ఆనందం అంబరమే.

*- డా.యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి,*
*తెలుగు అకాడమి,*
*హిమాయత్‌నగర్, హైదరాబాద్.*



Sthanika_Color_jan13.indd 28 29/12/12 5:49 PM

# ప్రభుత్వ సబ్సిడీ పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పు నగదు బదిలీ పథకం





**జనవరి 1 నుండి కేంద్ర ప్రభుత్వ నగదు బదిలీపథకానికి నాంది పలుకనుంది. ప్రభుత్వ సబ్సిడీ పంపిణీ విధానంలో ఇదో కీలకమైన వ్యవస్థగత మార్పుగా భావించవచ్చు. యు.పి.ఏ. ప్రభుత్వం గత ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ నగదు బదిలీ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.**

జనవరి 1 నుండి దేశంలోని 16 రాష్ట్రాలలోని 51 జిల్లాల్లో అమలులోకి తీసుకురానున్న ఈ నగదు బదిలీ పథకంలో మొత్తం 29 కేంద్రప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిని నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తారు. కొత్త ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం, గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ జైరాం రమేష్ ఈ మేరకు ఒక ప్రకటనలో తెలియచేశారు.

ఈ సందర్భంగా శ్రీ జైరాం రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ సబ్సిడీని నేరుగా లబ్ధిదారులకు చేర్చటమన్నది ఒక విప్లవాత్మక చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ విధానం ద్వారా 2013 సంవత్సరం చివరికి రూ.3,20,000 ల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం తెలియచేశారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదును బదిలీ చేయదగిన 29 పథకాలతో ప్రారంభించి క్రమేపీ ప్రభుత్వ సబ్సిడీలన్నిటికీ ఇదే విధానాన్ని అవలంబించటానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి శ్రీ చిదంబరం తెలియచేశారు. ఆధార్ కార్డు ఆధారంగా ప్రారంభించిన ఖాతాల్లోకి ఈ నగదును బదలాయిస్తారు.

తొలి విడతగా విద్యార్థులకు ఉద్దేశించిన ఉపకార వేతనాలు, వృద్ధాప్య పింఛనులు, వికలాంగ పింఛనులు, వితంతు పింఛనులు, మహిళా శిశు సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును ఈ ఎకౌంటుల్లోకి బదిలీ చేస్తారు. మానవ వనరులు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ సాధికార శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

ఇకపై ప్రభుత్వ లబ్ధిని పొందే ప్రతీ లబ్ధిదారుడు ప్రత్యేక బ్యాంకు ఎకౌంటు ప్రారంభించాల్సిందే. బ్యాకింగ్ సేవలను విస్తృత పరచటానికి, గ్రామీణుల చెంతకు బ్యాంకింగ్ సేవలు చేర్చటానికి బ్యాంకింగ్ కరెస్పాండెంట్ మరియు మొబైల్ ఏ. టి. ఎం. సేవను గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తారు. నగదు బదిలీ పథకం అమలుకు దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 51 జిల్లాల్లో మనరాష్ట్రం నుండి హైదరాబాదు, రంగారెడ్డి, తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం జిల్లాలు ఉన్నాయి.

**అమలు ఇలా :**

ఎంపిక చేసిన 5 జిల్లాల్లో విశిష్ట సంఖ్య (ఆధార్) గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తికానందున మరియు లబ్ధిదారులందరికీ బ్యాంకు అకౌంట్లు లేనందున తొలివిడతగా 145 కేంద్రాలలో ప్రారంభించి దశల వారీగా 5 జిల్లాల్లో 10,000 షాపులకు వర్తింపచేస్తామని పౌర సరఫరాల శాఖ కమీషనర్ హరిప్రీత్ సింగ్ స్పష్టం చేశారు.

ఈ విధానాన్ని తొలివిడతగా పౌరసరఫరాల దుకాణం ద్వారా ఇచ్చే కిరోసిన్‌కు వర్తింపచేస్తారు. కేంద్రప్రభుత్వం కిరోసిన్ ఒక లీటర్ మీద రూ. 30/- సబ్సిడీగా ఇస్తోంది. కిరోసిన్ మార్కెట్ ధర రూ. 45గా ఉంది. ఈ నూతన విధానం ప్రకారం లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుండి రూ. 45/-లు చెల్లించి కిరోసిన్ కొనుగోలు చేయాలి. ఇలా కొనుగోలు చేసిన లబ్ధిదారుల వివరాలను రేషన్ షాపు డీలర్లు జిల్లా సివిల్ సప్లైస్ అధికారికి సంబంధిత తహసిల్దార్ ద్వారా నివేదిస్తారు. అనంతరం జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు సదరు సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాల్లోకి బదలాయిస్తారు. కిరోసిన్ తీసుకోకపోయినట్లయితే లబ్ధిదారులకు ఎటువంటి చెల్లింపులు చేయరు.

క్రమేపీ ఇదే పద్ధతి గ్యాస్ సిలిండర్లుకు కూడా వర్తింపచేస్తారు. లబ్ధిదారుని అకౌంటుకు నగదు పంపిణీ చేసిన వెంటనే వారికి సెల్‌ఫోన్ ద్వారా సంక్షిప్త సందేశం పంపుతారు.

**వి.ఎస్.ఎస్.పి.**



# చిరుధాన్యాల్లో పోషక విలువలు

**మనదేశంలో వాడుకలో వున్న చిరుధాన్యాలలో జొన్నలు, రాగులు, సజ్జలు, మొక్కజొన్నలు, వరిగలు, కొర్రలు చాలా ముఖ్యమైనవిగా చెప్పకోవచ్చు. చిరుధాన్యాలు ముఖ్యంగా నీటి ఎద్దడి అంటే తక్కువ వర్షపాతం, తక్కువ భూసారం వున్న నేలల్లో మెట్ట సేద్యంగా పండిస్తారు. ప్రతిపూట మనం బియ్యం వాడడం కంటే ఓ పూట ఏ జొన్నలో, రాగులో వాడుకుంటే మనకు మిశ్రమాహారం లభిస్తుంది. ఇది అత్యంత ఆరోగ్యకరం కూడా! మనలో చాలా మందికి చిరు ధాన్యాలు బియ్యమంత రుచిగా వుండవన్న భావన కలగడం కూడా సహజమే! ఏ ఆహారమైనా రుచికరంగా వుండడం లేకపోవడమన్నది మన అలవాట్లమీదే ఆధారపడి ఉంటుంది. అందుచేత మనం చిరుధాన్యాలు తినడం అలవాటు చేసుకుంటే కొద్ది రోజులకు బియ్యం, గోధుమల కంటే కూడా ఇవి రుచిరకంగా అనిపించవచ్చు.**

పోషక విలువల రీత్యా చూస్తే చిరుధాన్యాలు, బియ్యం, గోధుమలకు ఏ మాత్రం తీసిపోవు. మన రాష్ట్రంలో వాడుకలో వున్న చిరుధాన్యాలలో జొన్నలు ముఖ్యమైనవి. జొన్నలలో 10 శాతం మాంసకృత్తులు, 72 శాతం పిండి పదార్థాలే కాకుండా మన శరీరానికి అవసరమయ్యే కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఇనుము కూడా మంచి మొత్తాలలో వున్నాయి. బియ్యంతో పోల్చిచూస్తే జొన్నలలో ఎక్కువ మొత్తంలో థయామిన్, రైబోఫ్లేవిన్ అనే 'బి' విటమిన్లు కూడా వున్నాయి.

జొన్నలను పండించే ప్రాంతాలలో జొన్నలను అన్నం, సంగటి, రొట్టెల రూపంలో వాడుతుంటారు. జొన్న పైపొట్టు మందంగా వుండడం వలన జొన్న పిండి బరకగా వుండి రకరకాల వంటలు చేయడానికి అనువుగా వుండదు. జొన్న అన్నం తినే వారికి దానిమీద పొట్టు తీయడం శ్రమతో కూడుకున్న పని. జొన్నలను కడిగి, దంపి గృహిణులు శ్రమ పడటమేకాక వారి దిన చర్యలలో ఎక్కువ సమయం దీనికే కేటాయించవలసి వస్తుంది. గృహిణులను ఈ శ్రమ నుండి తప్పించడానికి జొన్నల నాణ్యతను పెంపొందించడానికి, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన గృహ విజ్ఞాన కళాశాల వారు పొట్టుతీసే మిల్లును తయారు చేశారు. ఈ మిల్లులో 11/2 గంటలలో 1 క్వింటాల్ జొన్నలపై పొట్టు తీసుకోవచ్చు. పొట్టు తీయడం వలన పిండి మెత్తగా వుండటమే కాక, చేదుతనం కూడా పోతుంది. ఈ పొట్టు తీసిన జొన్నలలో దొడ్డు రవ్వ, సన్నటి రవ్వ కూడా తయారు చేసుకోవచ్చు. పొట్టు తీసిన జొన్నలతో, జొన్న అన్నం, మాల్ట్, పేలాలు, చుడువా మొదలైన వంటకాలు చేసుకోవచ్చు. పొట్టు తీసిన జొన్న రవ్వతో కిచిడి, ఉప్మా, సాంబారు బాత్, పాయసం, ఇడ్లీ, టొమాటో బాత్, బిరియాని మొదలైన వంటకాలు చేసుకోవచ్చు. ఇక నాణ్యమైన జొన్న పిండితో బియ్యం పిండి, శెనగ పిండితో చేసుకునే సాంప్రదాయక వంటకాలన్నీ చేసుకోవచ్చు. మురుకులు, లడ్డూలు, కారప్పూస, పకోడి, చేగోడీలు మొదలైన వంటలన్నీ చేసుకోవచ్చు. ఈ జొన్న పిండితో సాంప్రదాయక వంటలేకాక అధునాతన వంటలు కూడా చేసుకోవచ్చు. ముఖ్యంగా బేకరీ వంటలు చేసుకోవచ్చు. అంటే బిస్కట్లు, కేకులు, కుక్కీలు లాంటి వంటలు చేసుకోవచ్చు. జొన్న ఆరోగ్య వంతులే కాక, డయాబెటీస్‌తో బాధపడుతున్న వారికి కూడా మేలు చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో రాగుల వాడకం ఎక్కువగానే వుంది. రాగులలో 7-8 శాతం మాంసకృత్తులు, 76 శాతం పిండి పదార్థాలు ఉన్నాయి. కాల్షియం అనబడే ఖనిజలవణం రాగులలో ఎక్కువ మొత్తంలో వుంది. మరి ఏ చిరుధాన్యంలో కూడా రాగులలో వున్నంత కాల్షియం వుండదు. మిగతా ధాన్యాలలో కాల్షియం మోతాదు తక్కువ వున్నందున ప్రతిరోజు మిగతా ధాన్యాలతో బాటు మనం రాగులను ఏదో ఒక రూపంలో తీసుకుంటే, మన శరీరానికి అవసరమయ్యే కాల్షియం లభ్యమవుతుంది.

రాగులలో అయొడిన్ అనబడే ఖనిజ లవణం కూడా కొంత వరకు ఉంది. జొన్నలలాగే రాగులు కూడా డయాబెటీస్‌తో వున్నవారికి చాలా అనువైన ఆహారం. ఈ చిరుధాన్యాలు త్వరగా జీర్ణం కానందున రక్తంలో చక్కెర శాతం పెరగదు.

రాగి పిండి రెండుపాళ్ళు, ఒక పాలు బియ్యం పిండి కలిపి రాగి సంగటి తయారుచేస్తారు. రాయలసీమ ప్రాంతంలో చాలా ఇష్టంగా తినే వంటకం ఇది. చేపల పులుసుతో గాని, మజ్జిగతో గాని తింటుంటారు. ఇక రాగి పిండితో రాగి పిట్టు, రాగి లీఫ్ కేకు, రాగి అరిశెలు, పకోడీలు మొదలైన వంటకాలు కూడా తయారు చేసుకోవచ్చు. అంతే కాకుండా రాగులను మొలకెత్తించి పుష్టికరమైన రాగి మాల్టు తయారు చేసుకోవచ్చు. ఈ రాగి మాల్టు పసిపిల్లలకు, ముసలి వారికి చాలా అనువైన ఆహారం. రాగి జావ వాడకం వేసవి కాలంలో చాలా ఎక్కువ.


చిరు ధాన్యాలలో ముఖ్యమైన మూడో చిరుధాన్యం సజ్జలు, సజ్జలు కూడా కాలక్రమేపీ కనుమరుగవుతున్న చిరుధాన్యం. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రాంతాలలో సజ్జ పిండితో రొట్టెగాక, వడలు, బూరెలు లాంటి వంటకాలు కూడా చేసుకుంటారు. సజ్జలలో మాంసకృత్తులు 12 శాతం వరకు వున్నాయి. అంటే రాగులు, బియ్యం వంటి ధాన్యాల కంటే, ఇందులో ఎక్కువ మాంసకృత్తులు వున్నాయి. హైబ్రీడ్ సజ్జ రకాలలో 16 శాతం వరకు మాంసకృత్తులున్నాయి. ఖనిజ లవణాల దృష్ట్యా కూడా, సజ్జలు బియ్యం కంటే ఎక్కువ విలువ కలిగినవి. వీటిలో కాల్షియం ఇంచుమించు గోధుమలు, జొన్నలలో వున్నంత వున్నట్లు చెప్పవచ్చు. ఐరన్ రాగులలో వున్నంత ఎక్కువగా సజ్జలలో లేకపోయినా మిగిలిన గింజ ధాన్యాల కంటే ఎక్కువే.

సజ్జలలో థయామిన్, రైబోఫ్లేవిన్, నయాసిన్ వంటి "బి" విటమిన్లు తగు మోతాదులో వున్న కారణంగా దీనిని తీసుకున్నప్పుడు మనకు కావలసిన మోతాదులో 'బి' విటమిన్‌లు లభిస్తాయి.

మొక్కజొన్నలు అన్ని వయసుల వారికి అత్యంత ప్రియమైన ధాన్యం. ఇందులో 11 శాతం మాంసకృత్తులు, 66శాతం పిండి పదార్థాలు వున్నాయి. మన కంటి ఆరోగ్యానికి అవసరమయ్యే కెరోటిన్ మొక్కజొన్నలలో ఎక్కువగా వుంది. 'బి' విటమిన్లు అంతగా లేవు. కాని ఫోలిక్ ఆసిడ్ శాతం మటుకు ఎక్కువగా వుంది. ఇక ఖనిజ లవణాలలో మెగ్నీషియం, పొటాషియం మోతాదు ఎక్కువగానే వుంది.

ఈ మొక్కజొన్న కండెలు మామూలుగా వుడకబెట్టి లేక కాల్చి తింటుంటారు. అంతేగాక మొక్కజొన్నలతో అన్ని వయసుల వారికి నచ్చే పేలాలు చేసుకోవచ్చు. మొక్కజొన్నలతో వడలేగాక పిండితో చపాతీలు కూడా చేసుకోవచ్చు. మొక్కజొన్న పిండి, పప్పుల నుండి కలిపి పౌష్టికరోటీ మిశ్రమాలు చేసుకోవచ్చు. మొక్కజొన్న పిండితోనే గాక జొన్నలు, రాగులు, సజ్జ పిండ్లతో కూడా పౌష్టికరోటీ మిశ్రమాలు తయారు చేసుకోవచ్చు. ప్రతి సూపర్ బజార్‌లోను 'మల్టి గ్రెయిన్ అటా' ఇప్పుడు దొరుకుతోంది. అందరికీ అందుబాటులో ఉంది.

కొర్రలు ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలోను అనంతపురం, కర్నూలు, ప్రకాశం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పండిస్తారు. కొర్రలు దంచి




పొట్టుతీసి ఎక్కువగా అన్నంలాగా వండుతారు. కొర్ర పిండి ఏదైనా పప్పుల పిండితో కలిపి వాడుకుంటే పోషక విలువల రీత్యా చాలా శ్రేష్ఠమైంది. కొర్రలతో అన్నమే కాకుండా కిచిడి, దోశలు, ఇడ్లీ కూడా చేసుకోవచ్చు. కొర్రలలో 12 శాతం మాంసకృత్తులు, 60 శాతం పిండి పదార్థాలు వున్నాయి. పీచు పదార్థం కూడా ఎక్కువగానే వుంది. కొర్రలతో 'బి' విటమిన్ మోతాదు కూడా ఎక్కువగానే వుంది. రైబోఫ్లేవిన్, థయామిన్ కంటే నయాసిన్ మోతాదు ఎక్కువగా వుంది. ఖనిజ లవణాలలో మెగ్నీషియం, పొటాషియం మోతాదు ఎక్కువగా వుంది.

వరిగ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువగా పండిస్తారు. వరిగలపై పొట్టు తీయడం కూడా కష్టకరమైన పని, ఇందులో 6-7 శాతం మాంసకృత్తులు 66 శాతం పిండి పదార్థాలు వున్నాయి. వరిగలతో ఎక్కువగా వరిగ అన్నం వండుతారు. వరిగలను పిండి చేసి శెనగపిండితో కలిపి జంతికలు తయారు చేసుకోవచ్చు. ఇలా వరిగ పిండి పప్పుధాన్యాలతో కలపడం వలన ఈ వరిగ పోషక విలువలు పెరుగుతాయి.

మనకు సూపర్ బజార్లలో, పెద్దపెద్ద మాల్స్‌ల్లో బియ్యం పిండి, గోధుమ పిండి, శెనగపిండి, మైదాతో తయారు చేయబడిన రెడీ టు కుక్ రెడీ టు ఈట్ ప్రొడక్ట్‌లు చాలా దొరుకుతున్నాయి. అంటే న్యూడిల్స్ పాస్తా ఉత్పత్తులు, బేకరీ ఉత్పత్తులు మనం చిరు ధాన్యాలతో చేసి ఈ తరం యువతను ఆకట్టుకొన్ననాడు మనం చిరుధాన్యాలు పండించే రైతుకు న్యాయం చేకూర్చగలము.

పోషక విలువల రీత్యా శ్రేష్ఠమైన ఈ చిరుధాన్యాలను విభిన్న రీతులలో మనం ఉపయోగించుకోవచ్చు. అంచేత చిరుధాన్యాలని చిన్నచూపు చూడకుండా ప్రతినిత్యం మన ఆహారంలో చేర్చుకుంటే ఆరోగ్యదాయకం.

**- డా॥ వి. విమల**
**రిటైర్డ్ ప్రొఫెసర్, గృహవిజ్ఞాన కళాశాల,**
**ఆచార్య ఎన్.జి.రంగా, వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్**



# కార్మికబంధు వరాహగిరి వెంకటగిరి

**మహా మేధావి, స్వాతంత్ర్య సమరయోధుడు, సహనశీలి, భారత ప్రజల ఆశాజ్యోతి, సాహిత్యాభిమాని, కార్మికరంగానికీ తన విశిష్ట సేవల్ని అందించి, అంచెలంచెలుగా ఎదిగి భారత రాష్ట్రపతి పదవిని అలంకరించిన కార్మిక నాయకుడు వరహగిరి వెంకటగిరి. పేరు పూర్తిగా అందరికీ తెలియకున్నా వి.వి. గిరిగా ఆయన లబ్ధప్రతిష్టులు. ఈయన 1884 ఆగష్టు 10వ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని గంజాం జిల్లా బరంపురంలో (ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రంలో ఉంది) జన్మించారు. వీరి తండ్రిగారు జోగయ్యపంతులు. అప్పట్లో పేరుపొందిన న్యాయవాది. గిరి తండ్రి అడుగుజాడల్లోనే నడుచుకుంటూ బారిష్టర్ లండన్‌లో చదువుతూ, 1914 లో మొదటి సారిగా గాంధీజీని కలిశారు. మహాత్మునితో తొలి సమావేశంలోనే గిరి గాంధీజీలో గల నిరాడంబరత, శాంతి, సహనశీలత, కర్తవ్యదీక్షలను పరిశీలించారు. మహాత్ముని గొప్ప గుణాలు ఆయనపై చెరగని ముద్రవేశాయి.**

1916లో వెంకటగిరి బారిష్టర్ పట్టా పుచ్చుకుని స్వదేశానికి తిరిగి వచ్చారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారి ఆశీస్సులతో న్యాయవాదవృత్తిని చేపట్టారు. సరస్వతిబాయిని ఆయన వివాహం చేసుకున్నారు. నిజం చెప్పాలంటే, గిరి కుటుంబం తూర్పుగోదావరి జిల్లా చింతపల్లి గ్రామం నుండి బరంపురం వలసివెళ్లి అక్కడ స్థిరపడింది. బరంపురంలో వున్నా ఆ కుంటుంబం అంతా చక్కగా తెలుగు మాట్లాడేవారు. చిన్న నాటినుండీ ఆయనకు పేదవారన్నా. అందులో హరిజనులన్నా అపారమైన ప్రేమాభిమానాలు ఉండేవి. అందువల్ల ఆయన అప్పట్లో ఉన్నత కులస్థుల విమర్శలకు గురికాక తప్పింది కాదు. బారిష్టర్ చదువుకు ముందు గిరి కళ్లికోట కాలేజీలో ఉన్నత విద్యాభ్యాసం సాగించారు.

ఐర్లండు నేషనల్ యూనివర్సిటీలో బారిష్టర్ చదివేటప్పుడు వరాహగిరి మన భారతీయులందరినీ ఒక సంఘంగా ఏర్పాటు చేసిన వ్యక్తి. ముఖ్యంగా బ్రిటిష్‌పాలకులు అప్పట్లో ఐర్లండు పౌరుల్ని నానాబాధలూ పెట్టేవారు. ఆ కారణంగా గిరి ఐర్లండు ఆక్రమణదారులైన బ్రిటిష్ పాలకులమీద తిరుగుబాటు తీసుకొచ్చారు. తిరుగుబాటుకు కారకుడైన గిరికి ఐర్లండు స్వాతంత్రోద్యమ నాయకులైన డి. వలేరా, కాలిన్స్, పీయరీ, డుజ్‌మంబ్. ఫిట్టరాల్డ్, మెకనెయల్, కాన్నోలికి వంటి వారితో పరిచయం బాగా పెరిగింది. బ్రిటిష్ పాలకులు గిరి మీద కోపంతో ఆయన తమకు ప్రాణ సంకటంగా మారాడని "నువ్వు తక్షణం దేశం విడిచి వెళ్లిపొమ్మని" నోటీసు పంపారు. 1916లో వెంకటగిరి స్వదేశం చేరుకోక తప్పలేదు. ఇండియా వచ్చాక న్యాయవాదిగా కొనసాగుతూ గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న అన్ని ప్రజాఉద్యమాలలోనూ పని చేయడానికి ఆయన ఉద్యుక్తుడయ్యారు.

కార్మికరంగంలోకి వి.వి. గిరి తన సేవల్ని విస్తరించారు. నికృష్టంగా కటిక దారిద్యంతో సతమతమౌతూ బ్రతికే రైల్వే రవాణా కార్మికులను సంఘటితపరిచి వారి సమ్మెలకు నాయకత్వం వహిస్తూ కార్మిక

సోదరులకు మేలు జరిగేటట్లు పాటుపడే వ్యక్తిత్వం ఆయనది. 1922 నాటికి కార్మిక సంఘాలతో సత్సంబంధాలు కలిగి లెఫ్టినెంట్ ఎన్.ఎం. జోషికి విశ్వాస పాత్రులయ్యారు గిరి. అందుచేత రైల్వే కార్మిక సంఘానికి నాయకుడుగా ఆయనని వారు ఎన్నుకున్నారు. కార్మికులకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 వేల మంది కార్మికులను సంఘటిత పరిచి సమ్మె చేయించిన కార్యశూరుడు ఆయన. కార్మికులెందరినో ఆనాటి తెల్లదొరతనం అరెష్టు చేసి జైలుపాలు చేసింది. అప్పుడు వారందరికీ ధైర్యం చెప్పి అండగా నిలిచారు. ఎలాగైతే కార్మిక విజయం లభించింది.

దీనితో గిరి భారత రైల్వే కార్మికుల సంఘానికి రెండు పర్యాయాలు అధ్యక్షుడుగా, సెక్రెటరీగా ఎన్నిక కాగలిగారు. 1931లో లండన్‌లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు భారత దేశ కార్మిక ప్రతినిధిగా హాజరయ్యారు ఆయన. ఆనాటి గిరిలో గల నాయకత్వ లక్షణాల పుణ్యమా అని 1934 ఎన్నికలలో కేంద్ర శాసన సభకు అభ్యర్థిగా నిలబడి విజయాన్ని కైవశం చేసుకోగలిగారు. 1937లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ) కేబినెట్‌లో వి.వి.గిరి కార్మిక శాఖామంత్రిగా నియమింపబడ్డారు. ఆ శాఖతో బాటు పరిశ్రమల్లో సహకారం, హరిజనాభ్యుదయశాఖల మంత్రిగా కూడా సమర్థనీయంగా నిర్వహించిన ధీశాలి. 1937లో గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్ మంత్రి వర్గాల రాజీనామాతో ఆయన తన పదవిని త్యాగం చేయాల్సివచ్చింది.

1942 లో జరిగిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నందున గిరిని అరెస్టు చేసి పదిహేను నెలలపాటు బ్రిటీష్ ప్రభుత్వం కారాగార శిక్ష విధించింది. 1946లో తిరిగి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వి.వి. గిరి పేరు పరిశీలనలోకి వస్తే, దానికి ఆయన అంగీకరించలేదు. ప్రకాశం గారి పేరును ఆయన సూచించడంతో వారికి గల గురుభక్తి ఏ పాటిదో అర్థం అవుతున్నది. ప్రకాశం ముఖ్యమంత్రి పదవి చేపట్టి అదే కార్మిక శాఖను వరాహగిరికి అప్పజెప్పడం విశేషం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అప్పుడు భారత ప్రభుత్వం గిరిని నేటి శ్రీలంక (సింహళదేశం)లో భారత్ హైకమీషనర్‌గా నియమించింది. 1952 లో వెంకటగిరి నెహ్రూ ప్రధానిగా ఆయన మంత్రివర్గ కేంద్ర క్యాబినెట్‌లో కేంద్ర కార్మిక మంత్రి పదవి చేపట్టాల్సి వచ్చింది. అయితే పారిశ్రామిక ట్రిబ్యునల్ యిచ్చిన అవార్డు అమలు పరిచే విషయాల్లో కేంద్ర మంత్రివర్గంలో అభిప్రాయ భేదాలు తలెత్తిన కారణంగా పదవీత్యాగం చెయ్యాల్సి వచ్చింది.

1957వ సంవత్సరంలో వి.వి. గిరిని ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా భారత ప్రభుత్వం నియమించింది. కేరళ, కర్నాటక రాష్ట్రాల గవర్నర్‌గా కూడా సుమారు పదేళ్లు అంటే 1967 వరకు గిరి సమర్థుడై పాలకుడుగా పేరు సంపాదించుకున్నారు. ఇదే సంవత్సరం వరాహగిరి వెంకటగిరి ఉపరాష్ట్రపతిగా పదోన్నతి పొంది 1969 వరకూ ఆ పదవిలో కొనసాగారు. దురదృష్టవశాత్తు అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ మే-35 ఆకస్మికంగా మరణించడంతో జూలై-20 వరకు గిరి తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. రాను రాను ప్రపంచ రాజకీయాలు మారినట్లుగానే భారత రాజకీయాల్లో కూడా గణనీయమైన మార్పులు రావడం సంభవించింది. పార్లమెంటులోనూ, రాష్ట్ర శాసన సభల్లోను 1969వ సంత్సరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ ఉన్నది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి నీలం సంజీవరెడ్డిని పార్టీ నిలబెట్టింది. రాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో పార్టీ అధికారిక అభ్యర్థికే ఓటు విధిగా వెయ్యాలనే పార్లమెంటు సభ్యులకు 'విప్' జారీ చేయాలనే ప్రతిపాదన వచ్చింది.

అందుకు అప్పటి పార్టీ నాయకురాలైన శ్రీమతి ఇందిరా గాంధీ తిరస్కరించారు. అంతరాత్మ ప్రభోదం మేరకు ఓట్లు వెయ్యాలంటూ సూచించడం జరిగింది. సత్ఫలితంగా అన్ని పార్టీలలోనూ క్రాస్ ఓటింగ్ జరిగింది. ఆ ఎన్నికలలో వరాహగిరి వెంకట గిరి రాష్ట్రపతి అభ్యర్థిగా, అందులో స్వతంత్ర అభ్యర్థిగా మాత్రమే పోటీ చేశారు. ఈ ఎన్నికలలో గిరి ఎలక్ట్రోకాలేజ నియమం ప్రకారం మొదటి ప్రాధాన్యం ఓట్లు, పార్లమెంటు సభ్యుల ఓట్లుతో ఘన విజయం సాధించడం, నాలుగవ భారత రాష్ట్రపతిగా బాధ్యతతో స్వీకరించడం జరిగిపోయింది. భారతదేశ చరిత్రలో వి.వి. గిరి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పనిచేశారు. 1975 లో గిరి ఆయన ప్రతిభాపాటవాలు గురించిన భావంతో ప్రభుత్వం ఈ దేశపు అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ను ఇచ్చి సత్కరించడం విశేషం అనే చెప్పాలి.

స్వతంత్ర భారతదేశంలో వరాహగిరి వెంకటగిరి తన వంతు పాత్రను అంటే తనను ఏ పదవి విరించినా దానికి న్యాయం చేస్తూనే భారత నిర్మాణానికి ఒక దేశ పౌరుడుగా కంటే భక్తుడుగా సేవలందించారనేది నిజం. ఇంకా విశేషించి చేప్పాలంటే శ్రామిక జనోద్ధరణకు కంకణం కట్టుకున్న వ్యక్తిగా తామ దేశ చరిత్రలో నిలిచిపోయారనడం సత్యదూరం కాదు. తన జీవితాన్నే ఆ కార్మిక లోకకళ్యాణానికి అంకితం చేసిన మహోన్నతుడు వి.వి. గిరి. ఎన్నేళ్లు బ్రతికాడనేది కాదు ఎందరి హృదయాల్లో నిలిచిపోయాడన్నది ఆలోచించాల్సిన అంశం. గిరి తన 85-ఏట చెన్నైలో మరణించారు. ఆయన మంచి వక్త. రచనా సామర్థ్యం కలిగిన భాషావేత్త. అందుకు నిదర్శనంగా పారిశ్రామిక సంబంధాలు, భారతదేశ పరిశ్రమలతో కార్మిక సమస్యలు వంటి పలు గ్రంథాలను ఆయన వ్రాయగలిగారు. ఆయన ఆధ్వర్యంలోనే 'ది ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్' అనే సంస్థ పలువురి మేధావులతో, ప్రముఖులతో ఏర్పాటవ్వడం నిజంగా విశేషం. వి.వి. గిరి జీవితం నేటి భావిభారత పౌరులకు ఆదర్శప్రాయమైనది.

**డా॥ మంతెన సత్యనారాయణరాజు**



# బి.ఎన్.వి. లకు అపార్డ్ ద్వారా ఉపాధి నైపుణ్య శిక్షణ



**ఎ.ఎమ్,ఆర్-అపార్డ్, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ & వాలంటీర్ యాక్షన్ విభాగం తేది 20.12.2012 నాడు విస్తరణ శిక్షణ అధికారులకు మరియు జిల్లా శిక్షణా మేనేజర్లకు ఒకరోజు అవగాహనా సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు 5 ఇ.టి.సిల నుండి మరియు 22 జిల్లాల నుండి మొత్తం 27 మంది హాజరు అయ్యారు.**

ఈ సదస్సులో పాల్గొన్న అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి గారు, మాట్లాడుతూ, వారు భారత నిర్మాణ్ వాలంటీర్లు వివిధ రాష్ట్రాలలో చేస్తున్న కార్యకలాపాలను వివరించారు. మన రాష్ట్రం తమిళనాడు తరువాత అత్యధిక సంఖ్యలో బి.ఎన్.వి.లు కల్గిన రాష్ట్రంగా నిలిచిందని ఆయిన తెలియచేసారు. ఆంధ్రప్రదేశ్ అకాడెమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్)లో శిక్షణ పొందిన భారత నిర్మాణ్ వాలంటీర్లు వారి వారి గ్రామాలలో చేస్తున్న అభివృద్ధి పనులను గురించి ఫేస్‌బుక్ ద్వారా వాటిని అపార్డ్ వెబ్‌సైట్‌కి పంపిస్తున్న సమాచారం గురించి బి.యన్.వి.ల కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని సుశిక్షితులైన సైనికులు లాగ భారత నిర్మాణ్ వాలంటీర్స్‌ని తయారు చేసి సమాజ సంక్షేమము, అభివృద్ధి కొరకు వారు పనిచేయుట అభినందనీయమని తెలియజేసారు.

ఇందులో భాగంగా శ్రీ యమ్. మదన మోహన రావు గారు, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ & వాలంటరీ యాక్షన్ విభాగాధిపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి, వివిధ కేటగిరీల వారీగా, వాటిని ఏ విధంగా అందిపుచ్చుకోవాలి, ఎంప్లాయింట్‌మెంట్ ఆఫీసులలో ఎటువంటి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి మొదలగు అంశాలపై వారి అనుభవాలను పార్టిసిపెంట్స్‌తో పంచుకోవడం జరిగింది. భారత నిర్మాణ వాలంటీర్స్ ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించుట ఒక కొత్త ప్రయోగమని వారు గ్రామ స్థాయిలో గ్రామీణులకు ఫ్రెండ్, ఫిలాసఫర్, మరియు గైడ్‌గా ఉంటూ స్వచ్ఛంద సేవ  చేస్తున్నందున వారికి ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తే వారు ఉద్యోగాలు పొందుట ద్వారా మిగతా వారు ప్రభావితులై ఈ కార్యక్రమము బలోపేతమగుటకు అవకాశము ఏర్పడుతుంది. కాబట్టి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించవలసి నదిగా కోరినారు.

తదుపరి భారత నిర్మాణ్ వాలంటీర్లకు వారి సామర్థ్యాల పెంపుదలకు సంబంధించి నిర్వహించవలసిన 5 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా, భారత నిర్మాణ వాలంటీర్లను ఏ విధంగా ఎంపిక చేయాలి అనే అంశంపై చర్చించారు.

శ్రీ యమ్.ఎ. కుమార రాజా, జాయింట్ సెక్రటరీ, సి.డి.యస్. మాట్లాడుతూ 5 రోజులు భారత నిర్మాణ్ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమము ఇ.టి.సి లలో నిర్వహించడానికి కావలసిన విషయ నిపుణులు ఎంపికపై పార్టిసిపెంట్స్‌కు వివరించడం జరిగింది. పార్టిసిపెంట్స్‌కు వచ్చిన వివిధ సందేహాలను వారు నివృత్తి చేయడం జరిగింది.

శ్రీ జయపాల్ రెడ్డి గారు, కన్సల్టెంట్, సి.యన్.ఆర్.యం. మాట్లాడుతూ భారత నిర్మాణ్ వాలంటీర్ల కొరకు చేపట్టబోయే కార్యక్రమాల గురించి మరియు కర్నూలు జిల్లాలో యువజన సర్వీసుల శాఖ నిధులతో ఏర్పాటు చేసిన భారత నిర్మాణ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం గురించి ఇ.టి.సి ఫ్యాకల్టీలకు మరియు జిల్లా శిక్షణా మేనేజర్లకు చేయవలసిన కార్యక్రమాల గురించి క్షుణంగా వివరించడం జరిగింది. మరియు శ్రీ శ్రీపతి రావు గారు, కన్సల్టెంట్ ఇ.టి.సి ఫ్యాకల్టీలను మరియు డి.టి.యమ్.లను వారికి సంబంధించి జిల్లాలకు విడుదల చేసిన నిధుల, జమాఖర్చులపై సమీక్ష జరిపి నిధుల విడుదలకు సంబంధించిన ఖర్చుల లెక్కలను, ఉపయోగ పత్రములను (యు.సి) సమర్పించవలసినదిగా కోరడమైనది.

ఈ కార్యక్రమానికి శ్రీ యమ్.ఎ. కుమార్ రాజా, జాయింట్ సెక్రటరీ, సి.డి.యస్., డా॥ వి.యస్.యస్. ప్రసాద్, సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్ మరియు డిప్యూటీ డైరెక్టర్ (లెక్కలు), సి.హెచ్. కూర్మారావ్, సెంటర్ హెడ్, సి.యన్.ఆర్.యమ్., శ్రీ జయపాల్ రెడ్డి, కన్సల్ట్‌టెంట్, సి.యన్.ఆర్.యమ్. & శ్రీపతి రావు, కన్సల్ట్‌టెంట్, సి.డి.పి.ఎ. శ్రీ మున్వర్ అహ్మద్, సి.డి.ఎస్. పై అధికారులు పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

**కోటా మోహన్ రావు,** జె.ఆర్.పి, అపార్డ్

# సేవ ఒక యోగసాధన

**మానవుడుగా పుట్టినందుకు తోటి మానవులకు సేవ చేయకపోతే, ఆ బ్రతుకు బ్రతుకేకాదు అంటారు భగవాన్ సత్యసాయి.**

'సేవ' అనే పదంలో ఉన్నది రెండే రెండు అక్షరాలు. కానీ అందులో మహత్తరమైన అర్థం ఉంది.

సేవకు ప్రధానమైన గుణములు దయ, వినయం, త్యాగం. ఈ మూడు గుణములు కల వ్యక్తి మాత్రమే, నిస్వార్థచిత్తంతో సేవచేసి సమాజానికి ఆనందాన్ని ప్రసాదించగలడు. అహంకారం వల్ల మూలతత్వాన్ని విమర్శిస్తాడు. అభిమానం వల్ల పశుత్వాన్ని పెంచుకొంటాడు. ఆడంబరం ఉన్నంతవరకు ఆత్మవిశ్వాసం కలుగదు. ఆత్మవిశ్వాసంలేని వాడు తనను తానే నమ్మడు. అట్టివాడు సమాజానికేమాత్రం సేవచేయలేడు. అహంకారం ఏమాత్రం లేనివాడు వినయవంతుడవుతాడు. వినయవంతుడు మాత్రమే సమాజ సేవలో పాల్గొంటాడు.



భక్తి, కర్మ, జ్ఞానతత్వాలను సేవాతత్వంలో ప్రతిబింబింపజేసి, సేవను ఉత్కృష్ట సాధనంగా రూపొందించారు భగవాన్ సత్యసాయి.

సేవా, సాధన పేరుతో, పరోపకార దృష్టితో చేసే ప్రతి మంచిపనీ సేవ అనిపించుకొంటుంది. 'సర్వేజనా సుఖినోభవంతు' అనేది శుష్కప్రియత్వం కాదు, జ్ఞాని యొక్క ప్రేమఫలం అన్నారు భగవాన్ రమణ మహర్షి. ఈ దేశంలో సంఘసేవకూ, ఆత్మజ్ఞానానికి గల అనుబంధాన్ని వివరించారు.

సేవద్వారా మనం వ్యష్టి నుంచి సమష్టిలోకి, అహం తత్వం నుంచి సోహంతత్వంలోకి ప్రవేశిస్తాము. సేవ అనే పదంలోని గొప్పతనం ఇదే. దివ్యత్వం అనే కల్పవృక్షాన్ని మన హృదయ క్షేత్రంలో అభివృద్ధి పరచుకోడానికి చేసే కృషి సేవ. సేవ చేస్తున్నామనే భావంతో కాక, తన కోసం తన కార్యంగా భావించి సేవ చేయాలి. ఇదే నిజమైన ఆధ్యాత్మిక భావన. ఇందులో ఉన్న ఆనందం మరెక్కడా లేదు. ప్రపంచమంతా పరమాత్మ కుటుంబంగా భావిస్తే మానవ సమాజంలో ఐకమత్యం పెరిగి ద్వేషాసూయాదులు తొలగి, ప్రేమ పెంపొందుతుంది.

ఈ నాడు మన మనుగడకు మానవజాతి పట్ల ప్రేమను చూపించేవారు కావాలి. సానుభూతిపరులు కావాలి. అట్టివారు లోకుల ప్రీతికొరకు కాక లోకేశ్వరుని ప్రీతికొరకు సేవలు చేస్తారు. వీరు చేసే సేవయే 'యోగం' అంటారు భగవాన్.

1984లో కౌలాలంపూర్‌లో జరిగిన ప్రాచ్యదేశాల ప్రపంచ మత సమ్మేళనానికి, బాబా పంపిన సందేశసారం ఇలా ఉంది.

"జగత్తు ఈనాడు భయంకరమైన నైతిక ఆధ్యాత్మిక సంక్షోభంలో పడింది. మానవ సమాజం నిరాశా నిస్పృహలకు లోనై, మానవజాతికి క్షణంలో ఏమి జరగనున్నదో అన్న భయంతో ఉంది. ఆధునిక భౌతికత దేశ కాల పరిస్థితులను, అవధులను అధిగమించింది, కానీ ప్రపంచ దేశాల ప్రజల మధ్య ప్రేమానురాగాలను పెంచలేకపోతున్నది. ఇంద్రియ లోలత్వం పెరిగి, పశుత్వం పెంపొంది, ప్రపంచం దుస్సహ స్థితికి చేరుకొనే దశలో ఉంది. శాంతి సామరస్యాల సాధనకు, సర్వత్రా సుఖ సంతోషాలను వ్యాప్యం చేయడానికి ప్రతి మానవుడు తన సంకుచిత్వాన్ని, స్వార్థాన్ని, దుశ్చింతను మానుకోవాలి. అన్ని మతాలకు మూలాధారమైన సత్యధర్మ, సంస్థాపనకు, శాంతి సంక్షేమాల స్థాపనకు దీక్ష వహించాలి. అప్పుడే ఉపనిషత్ ప్రవచించిన 'లోకస్సమస్తా సుఖినోభవంతు' అన్న ఆశయం ఫలిస్తుంది".

**- డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

**మనదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు పొందినప్పటికి మహిళల అక్షరాస్యత శాతంలో చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేదని మన దేశ అక్షరాస్యత 2011 గణాకాలు పరిశీలనలో వెల్లడి అయింది. 'విద్యాపరంగా స్త్రీ సమానత్వం అవసరమే కాదు స్త్రీ ఆర్థిక పటిష్టతకు మూలం'. స్త్రీ విద్యాపరంగా సమానత్వం సాధించినపుడే, మనదేశ భావి భారత పౌరుల సమానత్వం రాజ్యంగపరంగా, నైతికపరంగా పూర్తి స్థాయిలో సాధ్యమవుతుంది.**

విద్యాపరంగా బాలికల అక్షరాస్యత నమోదును ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలతో పరిశీలిస్తే, వారి నమోదు శాతం అసమానతలు దేశ అభివృద్ధికి ఆందోళన కలిగించే విషయంగా ఉంది. ముఖ్యంగా మనదేశ గ్రామీణ ప్రాంతాలలో విద్యాపరంగా బాలికల నమోదు శాతం చాలా తక్కువగా ఉంది. స్త్రీ, పురుషులు ప్రకృతిలో సమభాగం, స్త్రీ శ్రేయస్సుతోనే సమాజ శ్రేయస్సు ఉందనే వాస్తవం తెలిసినప్పటికి నేటికి స్త్రీల పైన అత్యాచారాలు, అణచివేతలు, వేధింపులు, లింగనిర్ధారణ పరీక్షలు ద్వారా బాలికల భ్రూణహత్యలు, బాలికల హత్యలలో మన దేశం ప్రథమ స్థానంలో నిలిచింది. మన దేశంలో స్త్రీ జననపరంగా కూడా క్రమంగా సమానత్వం కోల్పోతూ ఉంది.

# ఉన్నత విద్యయే స్త్రీ సమానత్వానికి సాధికారతకు మూలం

2011 సంవత్సరంలో మన దేశ జాతీయ గణాంకాలు ప్రకారం పురుషుల అక్షరాస్యత 82.14% గాను, స్త్రీల అక్షరాస్యత 65.46% ఉంది. ఈ అసమానతలు దేశ అభివృద్ధిపైన కీలకమైన ప్రభావాన్ని చూపుతాయి.

**మన దేశంలో బాలికల అక్షరాస్యత నమోదు**

| | |
|---|---|
| రాజస్థాన్‌లో | 52.7 % |
| బీహార్‌లో | 53.3 % |
| జార్ఖండ్‌లో | 56.2 % |
| ఉత్తరప్రదేశ్‌లో | 59.26 % |
| అరుణాచల్ ప్రదేశ్ | 59.26 % |
| ఆంధ్రప్రదేశ్ | 59.26 % |

ప్రగతిపథంలో ఉన్నత విద్యలో గోవా 61.2% గా ఉంటే, కేరళ 51% గా ఉంది. అక్షరాస్యతలో కేరళ మహిళల నమోదు శాతం 92% గా, మెజోరాం 89.4% ఉంది.

అయితే దేశ అక్షరాస్యత శాతం ప్రాథమిక, మాధ్యమిక విద్యలో మాత్రమే కొంత ఆశాజనకంగా ఉందని, ఉన్నత మాధ్యమిక విద్యలలో ఈ నమోదు శాతాన్ని పరిశీలించినట్లయితే 69.76% పురుషులు ఉంటే 30.24% స్త్రీలు ఉన్నట్లుగా 2010-11 సంవత్సరంలో ప్రాథమిక గణాంకాల ద్వారా తెలుస్తుంది.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఉన్నత విద్య నమోదు శాతం చాలా వ్యత్యాసం ఉంది. పట్టణ ప్రాంతంలో ఉన్నత విద్యలో బాలికల నమోదు శాతం 30% ఉండగా, 8% మాత్రమే గ్రామీణ ప్రాంతాలలో ఉంది. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైట్ టు ఎడ్యుకేషన్ యాక్టు క్రింద సర్వశిక్ష అభియాన్, కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయ పథకం, మధ్యాహ్న భోజన పథకం, మహిళా సమాఖ్య పథకం, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షణ అభియాన్, ఇన్‌సెంటివ్ స్కీమ్స్, ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ కార్యక్రమాలు ఎన్ని ప్రవేశపెట్టినప్పటికీ నేటికి ప్రాథమిక, మాధ్యమిక విద్యలో బాలికల నమోదు శాతం ప్రభుత్వానికి సమస్యాత్మకంగానే ఉంది.

'మహిళలను విద్యావంతుల్ని, చేయడం ద్వారానే సమానత్వం సాధ్యం' అనే అంశంపై డిసెంబర్ 5, 2012న జరిగిన జస్టిస్ సునంద బండారే మెమోరియల్ లెక్చర్ వారి 18 వ వార్షిక సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మాత్యులు డాక్టర్ శశి థరూర్ వారి సందేశంలో విద్యాపరంగా స్త్రీ సమానత్వం ప్రధాన అవసరంగా పేర్కొన్నారు.

విద్యావిధానంలో అత్యధిక స్థాయిలో స్త్రీలను విద్యావంతుల ను చేయడం ద్వారా స్త్రీ భాగస్వామ్యం విజ్ఞానాన్ని పంచడంలోను, నాణ్యతాపరమైన పరిపాలనని అందచేయడంలోను స్త్రీలు కీలకమైన పాత్ర పోషిస్తారని, సాంకేతిక పరంగా, పరిపాలన పరంగా అన్ని స్థాయిలలో, ఉన్నతవిద్యలో స్త్రీకి గుర్తింపు, భాగస్వామ్యం పెంపొందించడం ద్వారా కళాశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా, విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్స్‌గా నాణ్యతాపరమైన పరిపాలనని అందిస్తారని పేర్కొన్నారు.

11 వ పంచవర్ష ప్రణాళికలో ఈ దిశగా ప్రభుత్వం లక్ష్యసాధనకై మహిళలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుకు, కళాశాలలో, విశ్వవిద్యాల యాలలో తగిన ప్రాధాన్యత, విద్యా ప్రమాణాలు పెంచడానికి పటిష్టమైన చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో స్త్రీ సమానత్వం అవసరమే కాదు, స్త్రీ ఆర్థిక పటిష్టతకు ప్రధానంగా దోహదం చేస్తుందని లింగవివక్షత, బాలికల హత్యలు అన్ని స్థాయిలలో స్త్రీ, పురుషుల వ్యత్యాసాన్ని పెంచుతున్నాయని ఇది జాతికి సిగ్గుచేటని ఆయన సూచించారు.

2011 సంవత్సరంలో గణాంకాల ప్రకారం మన రాష్ట్ర అక్షరాస్యత నమోదు శాతం పురుషులు 75.56% ఉండగా, స్త్రీల అక్షరాస్యత. 59.74% గా ఉంది. మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో స్త్రీల అక్షరాస్యత 52.05% గా ఉంది. ప్రాథమిక, మాధ్యమిక విద్యతోనే గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు అత్యధిక శాతం విద్యకు స్వస్తి చెపుతున్నారు. ప్రధాన కారణంగా పేదరికం, సరియైన వసతులు లేకపోవటం, బాలికల రక్షణ విషయంలో పటిష్టమైన భద్రత లేకపోవటం


Sthanika_BW_Janf13.indd 31 29/12/12 2:52 PM

కారణాలుగా ఉన్నాయి. మన రాష్ట్రంలో ఉన్నత విద్యలో స్త్రీల నమోదు శాతం చాలా తక్కువ స్థానంలో ఉంది. మన రాష్ట్ర అక్షరాస్యత శాతం పరిశీలించి నట్లయితే -

| | |
|---|---|
| మహబూబ్ నగర్ | 45.65 % |
| విజయనగరం | 50.16 % |
| అదిలాబాద్ | 51.99 % |
| నిజామాబాద్ | 52.33 % |
| శ్రీకాకుళం | 52.58 % |

మన రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో అత్యల్పంగా మహబూబ్ నగర్‌లో 41.09 % గా ఉండగా, తరువాత స్థానంలో ఉన్నాయి. ఒక స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులు అవుతారని, ఒక పురుషుడు విద్యావంతుడు అయి, స్త్రీ నిరక్షరాస్యులు అయితే ఆ కుటుంబం, సంరక్షణ విషయంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఉండదని అనేక సర్వేలలో వెల్లడి అయినప్పటికీ స్త్రీలు విద్యాపరంగా వివక్షతకు గురి అవుతూనే ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నాణ్యతాపరమైన విద్యా ప్రమాణాలు పెంచి పేద గ్రామీణ మహిళలకు ఉచితంగా విద్యను అందించి వారిని ప్రగతిపథంలో ముందుకు తీసుకొని వెళ్ళినపుడే స్త్రీ సమానత్వం, సాధికారత సాధ్యమవుతుంది.

*ఓ మహిళా మేలుకో*
*చదువు విలువ తెలుసుకో ॥*
*చదువే నీ ప్రగతికి శ్రీకారం*
*చదువే నీ శక్తికి మూలం*
*చదువే నీ విజ్ఞానం*
*చదువే నీ ఆర్థిక బలం*
*చదువే నీ సామాజిక న్యాయం*
*చదువే నీ సమానత్వం*
*చదువే నీ సమభాగం*
*ఓ మహిళా మేలుకో*
*చదువు విలువ తెలుసుకో ॥*

**- వి. పద్మావతి దేవి**
*ఎ.యమ్.ఆర్.అపార్డ్*

## 2013 సంవత్సరంలో ప్రభుత్వ సెలవు దినాలు

***రా**ష్ట్ర ప్రభుత్వంలోని విభాగాల్లో పనిచేసే అధికారులకు ఉద్యోగులకు 2013లో సాధారణ మరియు ఐచ్ఛిక సెలవులను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 22-11-2012న జీ.వో.ఆర్.టి.నెం. 5364 సాధారణ పరిపాలన (పొలిటికల్ -ఎ విభాగం)ను జారీ చేసింది. ఈ జీ.వో. ప్రకారం పేర్కొన్న సెలవులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.*

### సాధారణ సెలవులు

| క్ర.సంఖ్య | పండుగ | రోజు | తేది | |
|---|---|---|---|---|
| 1. | సంక్రాంతి / పొంగల్ | సోమవారం | 14 | జనవరి |
| 2. | మిలాద్-ఉన్-నబి-ఇద్-ఇ-మిలాద్ | శుక్రవారం | 25 | జనవరి |
| 3. | రిపబ్లిక్ డే (గణతంత్ర దినోత్సవం) | శనివారం | 26 | జనవరి |
| 4. | హోళీ | బుధవారం | 27 | మార్చి |
| 5. | గుడ్‌ఫ్రైడే | శుక్రవారం | 29 | మార్చి |
| 6. | బాబు జగ్జీవన్ రామ్ జయంతి | శుక్రవారం | 5 | ఏప్రిల్ |
| 7. | ఉగాది | గురువారం | 11 | ఏప్రిల్ |
| 8. | శ్రీరామనవమి | శుక్రవారం | 19 | ఏప్రిల్ |
| 9. | రంజాన్ | శుక్రవారం | 9 | ఆగస్టు |
| 10. | స్వాతంత్ర్య దినోత్సవం | గురువారం | 15 | ఆగస్టు |
| 11. | శ్రీకృష్ణాష్టమి | గురువారం | 29 | ఆగస్టు |
| 12. | వినాయక చవితి | సోమవారం | 9 | సెప్టెంబర్ |
| 13. | గాంధీజయంతి | బుధవారం | 2 | అక్టోబర్ |
| 14. | విజయదశమి / దసరా | సోమవారం | 14 | అక్టోబర్ |
| 15. | బక్రీద్ | బుధవారం | 16 | అక్టోబర్ |
| 16. | దీపావళి | శనివారం | 2 | నవంబర్ |
| 17. | మొహర్రం | గురువారం | 14 | నవంబర్ |
| 18 | క్రిస్టమస్ | బుధవారం | 25 | డిసెంబర్ |

### ఐచ్ఛిక సెలవులు

| క్ర.సంఖ్య | పండుగ | రోజు | తేది | |
|---|---|---|---|---|
| 1. | నూతన సంవత్సర దినం | మంగళవారం | 1 | జనవరి |
| 2. | అర్బయీన్ | గురువారం | 3 | జనవరి |
| 3. | కనుమ | మంగళవారం | 15 | జనవరి |
| 4. | శ్రీ పంచమి | గురువారం | 14 | ఫిబ్రవరి |
| 5. | యాజ్ దహ్ షరీఫ్ | గురువారం | 21 | ఫిబ్రవరి |
| 6. | మహవీర్ జయంతి | బుధవారం | 24 | ఏప్రిల్ |
| 7. | బసవ జయంతి | సోమవారం | 13 | మే |
| 8. | హజ్‌రాత్ ఆలి పుట్టినరోజు | శుక్రవారం | 24 | మే |
| 9. | బుద్ధపూర్ణిమ | శనివారం | 25 | మే |
| 10. | షాబ్ -ఇ-మీరజ్ | శుక్రవారం | 7 | జూన్ |
| 11. | షాబ్ -ఇ-బరాత్ | మంగళవారం | 25 | జూన్ |
| 12. | రథయాత్ర | బుధవారం | 10 | జూలై |
| 13. | జుమాత్-ఉల్ -విదా | శుక్రవారం | 2 | ఆగస్టు |
| 14. | షాబ్‌ఇ-ఖదర్ | సోమవారం | 5 | ఆగస్టు |
| 15. | వరలక్ష్మీ వ్రతం | శుక్రవారం | 16 | ఆగస్టు |
| 16. | శ్రావణ పూర్ణిమ / రాఖీపూర్ణిమ | మంగళవారం | 20 | ఆగస్టు |
| 17. | మహాలయ అమావాస్య | శుక్రవారం | 4 | అక్టోబర్ |
| 18. | ఇద్-ఇ-గదీర్ | గురువారం | 24 | అక్టోబర్ |
| 19. | 9వ మొహర్రం | బుధవారం | 13 | నవంబర్ |
| 20. | కార్తీక పూర్ణిమ | శనివారం | 16 | నవంబర్ |
| 21. | అర్బయీన్ | సోమవారం | 23 | డిసెంబర్ |
| 22. | క్రిస్టమస్ ఈవ్ | మంగళవారం | 24 | డిసెంబర్ |
| 23. | బాక్సింగ్ దినం | గురువారం | 26 | డిసెంబర్ |



Sthanika_BW_Janf13.indd 32 29/12/12 2:52 PM






# ప్రకాశం జిల్లా భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలు - నమ్మలేని నిజాలు

**ప్రకాశం జిల్లాలోని 56 మండలాలలోని 222 గ్రామాలలో 2542 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు కాబడి స్వగ్రామంలో పలు సామాజిక స్వచ్ఛంద కార్యక్రమాలతో పాటుగా పలు కుటుంబాల వ్యక్తిగత అవసరాలు తీర్చటంలో వారు చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం.**

**ఇటీవల అపార్డ్ బృందం జిల్లాలోని కొన్ని గ్రామాలను సందర్శించడం జరిగింది. ఆయా గ్రామాలలోని వాలంటీర్ల సేవలు, కార్యక్రమాలు ఒకసారి పరిశీలిద్దాం.**




### నాగులుప్పలపాడు (మం) కనపర్తి గ్రామం

2012లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో దేశవ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయితీలలో 25 వేల మంది వాలంటీర్లు పోటీపడగా, జాతీయ స్థాయిలో అవార్డు సాధించి గుర్తింపు పొందిన గ్రామం. ఈ సాధనలో స్థానిక భారత్ నిర్మాణ్ వాలంటీర్లు శ్రీ త్రినాథ రెడ్డి, వారి బృందం చేసిన కృషి అనిర్వచనీయం. పథకం అమలులో వాలంటీర్ల వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి స్పష్టమైన తేడా కనబడుతూ వుంది. గ్రామంలోని 22 మంది వాలంటీర్లు సమిష్టిగా పలు సామాజిక మరియు వ్యక్తిగత కార్యక్రమాలు చేపట్టడం, పలు ప్రభుత్వ పథకాలను సమన్వయ పరచి భూమి అభివృద్ధి, అలాగే నీటి వసతి కల్పించుకోవడం తద్వారా భూమి విలువలను పెంచుకోవడం జాతీయ ఆహారోత్పత్తికి దోహదపడటం ముఖ్యమైనవి. వీటితో పాటుగా ఉపాధి హామీ పథకపు ప్రణాళిక రూపకల్పనలో చురుకైన పాత్ర పోషించడం, వ్యక్తిగత, సామాజిక పనులు గుర్తించడం, కూలీలగా పని కల్పించడం, తద్వారా గ్రామం నుండి వలసలు నివారించడం వీరు చేస్తున్న ముఖ్య కార్యక్రమాలు. అలాగే ప్రతి ఏటా ఒక కోటి రూపాయల పైగా వ్యవసాయ సంబంధిత భూ ఆధారిత పనులు గుర్తించడం, అమలు చేయడం, తద్వారా వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు తగ్గించడం అతి ముఖ్య విషయం.

ఇంకో ముఖ్య విషయం. గ్రామ మజరా యానాది కాలనీలో వున్న 40 యానాది కుటుంబాలకు నీటిపారుదల, భూమి అభివృద్ధి పనులు తప్పనిసరి. అన్ని కుటుంబాలకు జాబ్‌కార్డులు వున్నాయి. అందరూ కలసి ప్రతి సంవత్సరం వారి సొంత పొలాలలో ఉపాధిహామీ పనులు చేయడం, ఉపాధి పొందడంతో పాటుగా సొంత పొలాలు అభివృద్ధి చేసుకోవడం ప్రతి కుటుంబం ప్రతి సంవత్సరం వందరోజులు పనిచేసుకోవడం, రెండు పంటల పండించుకోవడం గమనించదగ్గ విషయం. ఈ విధంగా గ్రామాభివృద్ధికి ఎనలేని స్వచ్ఛంద సేవ చేస్తున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు త్రినాథ్‌రెడ్డి, రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు, మహేష్, నారాయణ, మోషే అభినందనీయులు.



Sthanika_BW_Janf13.indd 27 29/12/12 2:52 PM

2013-14 లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకపు రూపకల్పనకు ఇటీవల అపార్డు బృందం ఆధ్వర్యంలో కనపర్తి గ్రామ పంచాయితీ పరిధిలో నవంబర్ 29న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల భాగస్వామ్యంతో నిర్వహించిన గ్రామసభకు అనూహ్య స్పందన లభించింది. గ్రామంలోని వాలంటీర్లు అన్ని కుటుంబాలను వ్యక్తిగతంగా కలవడం, ముందు వార్డు సభలు నిర్వహించి గ్రామస్తులను, కూలీలను చైతన్య పరచడం, గ్రామసభల ప్రాముఖ్యతను వివరించడం, వివిధ పనుల గుర్తింపుపై ప్రజలకు అవగాహన కల్పించడం, గతంలో చేపట్టిన పనుల ఫలితాలు వివరించడం, ఫలితంగా గ్రామ సభలో సుమారు రూ. 1.82 కోట్ల విలువగల 142 పనులు గుర్తించడం నిజంగా అభినందనీయం. అర్థవంతమైన గ్రామసభ నిర్వహణలో, పథక రచనల్లో గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర సుస్పష్టం. ఇలా వాలంటీర్ల సేవలు ప్రతి పథక ప్రణాళిక రచనలో ఉపయోగించుకుంటే, అనూహ్య ఫలితాలు వస్తాయనేది అక్షర సత్యం.

## పొదిలి (మం) మాదిరెడ్డివారి పాలెం గ్రామం

ఈ గ్రామంలో గతంలో ఫ్యాక్షన్ కోరలలో చిక్కుకొని అభివృద్ధికి ఆమడ దూరంలో వుండేది. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఏర్పడిన తరువాత గ్రామంలో 20 మంది యువకులు బి.ఎన్.వి.లుగా నమోదై వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడం వీరి ప్రత్యేకత.

చిరకాలంగా గ్రామంలో వున్నటువంటి త్రాగునీటి సమస్యకు అధికారుల సహకారంతో జి.ఎల్.ఎస్.ఆర్ నిర్మించి సమస్యను పరిష్కరించడం, ఉపాధిహామీ పథకపు చెల్లింపులో అవకతవకలు సరిచేయడం, మద్యపాన నిషేధం, 100% విద్యార్థులు పాఠశాలకు హాజరుకు సహకరించడం, వీధి దీపాల ఏర్పాటు, మొక్కలు నాటడం, మహిళలకు కుట్టు శిక్షణ, రక్తదాన శిబిరం ఏర్పాటు, ఉపాధిహామీ జాబ్‌కార్డులేని వారికి జాబ్‌కార్డు పొందటంలో సహకరించడం వీరు చేపట్టిన కార్యక్రమాలు.

ఇంకో ముఖ్య విషయమేమంటే, గ్రామం మధ్యలో పొడవైన కచ్చా మురుగు కాల్వ పూడిపోవడం, మురుగు నీరు రోడ్లపై పారడం, పారిశుధ్య సమస్య ఏర్పడటం, గత ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్యకు పరిష్కారం దొరకక అధికారులు సతమతమవుతూ వుంటే, గ్రామంలోని 20 మంది బి.ఎన్.వి.లు ఒక్కటై గ్రామస్తులందరినీ ఒప్పించి మొదట కాల్వలు పూడిక తీయడం, తదుపరి అధికారుల సహకారంతో సిమెంట్ కాల్వ







నిర్మించడం, ప్రజల సహకారంతో పనిపూర్తి చేయడం హర్షించదగ్గ విషయం.

గ్రామ పెద్ద మాజీ సర్పంచ్ శ్రీ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ, తాను సర్పంచ్‌గా చేయలేని పనులు బి.ఎన్.విలు చేయగలిగారని తెలిపారు. గ్రామ వాలంటీర్లు సుబ్బయ్య, కిరణ్, వెంకట్రావు, కోటేష్, ఇతర బి.ఎన్.విలు చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలు హర్షణీయమన్నారు.

## చినగంజాం (మం) కడవకుదురు గ్రామం

ఈ గ్రామంలోని వాలంటీర్లు చంద్రశేఖర్ రెడ్డి, శేషగిరిరావు, సురేష్, అంకయ్య, సోమయ్యల బృందం చేపట్టిన సామాజిక కార్యక్రమాలు పరిశీలిస్తే గతంలో రూ. 5.00 లక్షలతో నిర్మించిన ఆర్.టి.సి. ప్రయాణీకుల ప్రాంగణం నిరుపయోగమై ముళ్ళ పొదలతో నిండి అసాంఘిక కార్యక్రమాలకు నిలయమై వుండగా గ్రామస్తులు, వారి కుటుంబ సభ్యులతో కలసి శ్రమదానం ద్వారా మళ్ళీ ఉపయోగంలోకి తేవడం, సొంత ఖర్చులతో త్రాగునీటి చేతిపంపును ఏర్పాటు చేయడం, ప్రాంగణం చుట్టూ వున్న ఆక్రమణలు తొలగించి గుంతలను పూడ్చి ఆర్.టి.సి. బస్సులను రప్పించడం నిజంగా అభినందనీయం . ఇంతేకాకుండా శ్మశానంలో ముళ్ళపొదలు తొలగించి దారి ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం, ఇటీవలి నీలం తుపాన్ బాధితులకు ఆహారధాన్యాలు, దుస్తులు అందజేయడం ముఖ్యమైనవి.

పై విధంగా ప్రకాశం జిల్లా వాలంటీర్ల నమోదులో రాష్ట్ర స్థాయిగా ప్రథమస్థానంలో వుండటమే కాక, వీరు చేపట్టే స్వచ్ఛంద కార్యక్రమాలు కూడా అదే స్థాయిలో వుండటం ఎంతో అభినందనీయం. వీరి వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ గంగాధర గౌడ్, వివిధ మండల అభివృద్ధి అధికారులు అభినందనీయులు

ఇలాగే అన్ని గ్రామాలలో స్వచ్ఛంద సేవకులు ముందుకు వస్తే బాపూజీ కలలు గన్న గ్రామోద్ధరణ సాధ్యమే !

**- జి. జైపాల్‌రెడ్డి**
*కన్సల్టెంట్, సిఎన్ఆర్ఎం, అపార్డ్*



# షెడ్యూల్డు తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం-2006

**1. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఎప్పుడు అమలులోనికి వచ్చింది?**

అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 లో రూపొందించబడింది. ఈ చట్టం డిసెంబరు 31, 2007 నుండి అమల్లోకి వచ్చింది. చట్టం అమలు నియమావళిని తయారు చేసి జనవరి 1, 2008 నుండి అమల్లోకి తీసుకురాబడ్డాయి.

**2. ఎవరి అటవీ హక్కులు గుర్తిస్తారు?**

అటవీ ప్రాంతాలలో నివశిస్తూ అటవీ భూములు, వనరులపై ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్న గిరిజనులు మరియు సాంప్రదాయక అటవీ నివాసితుల హక్కులు గుర్తించబడతాయి.

**3. ఈ చట్టం కింద అటవీ హక్కులు గుర్తించాలంటే ఏ తేదీకి అడవులు గిరిజనుల వినియోగంలో ఉండాలి?**

డిసెంబర్ 13, 2005 నాటికి అటవీ భూములు గిరిజనుల ఆధీనంలో ఉన్నాయని చెప్పడానికి తగిన సాక్ష్యం చూపాలి.

**4. సాంప్రదాయక అటవీ నివాసితులు అంటే ఎవరు?**

డిసెంబరు 13, 2005 నాటికి అడవులలో 75 సంవత్సరాలుగా నివసిస్తూ అడవులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నవారు. అంటే డిసెంబర్ 13, 1930 పూర్వం నుండి అటవీ ప్రాంతాల్లో నివసించి ఉండాలి.

**5. నేను సాగు చేస్తున్న అటవీ భూమిపై హక్కు కొరకు ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి?**

మీరు దరఖాస్తును సంబంధించిన గ్రామసభకు దాఖలు చేసుకోవాలి.

**6. గ్రామసభను ఎవరు నిర్వహిస్తారు ?**

'గ్రామపంచాయితీ' గ్రామసభను నిర్వహిస్తుంది.

**7. గ్రామసభ విధులు నిర్వర్తించడంలో బాధ్యత ఎవరిది ?**

గ్రామసభ విధులు నిర్వర్తించడంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి 'గ్రామసభ'కు కూడా కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

**8. గ్రామసభ విధులు ఏమిటి?**

- అటవీ హక్కుల స్వభావం, విస్తీర్ణ నిర్ధారణ ప్రక్రియలో క్లయిమ్ (అర్జీ)ల స్వీకరణ, విచారణ చేయడం
- హక్కులు కోరే వారి జాబితా తయారు చేసి రిజిస్టర్ నిర్వహించడం
- అటవీహక్కులు కోరే వ్యక్తులకు, సంబంధిత అధికార్లకు తగిన అవకాశం ఇచ్చి అటవీ హక్కుల గుర్తింపు క్లయిమ్స్ తీర్మానం ఆమోదించి సబ్‌డివిజనల్ కమిటీకి పంపడం.
- నిర్వాసితుల పునరావాసం ప్యాకేజీను పరిశీలించి తగు తీర్మానాలు ఆమోదించడం
- వన్యప్రాణి, అడవులు మరియు జీవవైవిధ్యం కాపాడటానికి తగు పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం

**9. అటవీ భూములపై ప్రభుత్వం ఇచ్చే హక్కు ఏ రూపంలో ఉంటుంది?**

భూమి అన్యాక్రాంతానికి వీలుండని విధంగా హక్కు పత్రాలు మంజూరు చేయబడతాయి. అటవీ భూమి హక్కు పత్రాలు భార్య, భర్త ఇరువురి పేర ఇవ్వబడతాయి. కుటుంబంలో ఒకే సభ్యుడు ఉంటే వారి పేరిట ఇవ్వబడతాయి. భూమిపై వారసత్వపు ఆస్తి హక్కు వస్తుంది. హక్కుదార్లకు వారసులు లేనప్పుడు సమీప బంధువులకు ఆ భూమిపై హక్కు లభిస్తుంది.

**10. ఎన్ని హెక్టార్ల అటవీ భూమికి హక్కు గుర్తింపు పొందవచ్చు?**

వ్యక్తులు లేదా కుటుంబం లేదా ప్రజల అధీనంలో ఉన్న భూమి హక్కు గుర్తింపు నాలుగు హెక్టార్ల వరకు గరిష్ఠ పరిమితం చేయబడింది. నాలుగు హెక్టార్లు అంటే సుమారు 10 ఎకరాలు.

**11. హక్కు పత్రం కొరకై నేను చేసుకున్న దరఖాస్తు తిరస్కరించబడింది. నేను హక్కు పత్రం పొందటానికి ఎవరిని సంప్రదించాలి?**

గ్రామసభ మీ దరఖాస్తు తిరస్కరించినా, వారి నిర్ణయంపై మీరు పూర్తిగా సంతృప్తి చెందకపోయినా సబ్ డివిజనల్ (సబ్ కలెక్టర్ లేదా ఆర్.డి.వో) స్థాయి కమిటీకి 60 రోజుల లోపల దరఖాస్తు చేసుకుంటే వారు పరిశీలిస్తారు.

**12. హక్కు పత్రం పొందటానికి ఎలాంటి ఆధారాలుండాలి?**

అటవీ హక్కు పత్రం పొందాలంటే డిసెంబర్ 13, 2005 నాటికి ఆ భూమి ఆక్రమణలో ఉన్నట్లు రుజువు చూపాలి. దీనికై ప్రభుత్వ డాక్యుమెంట్లు కానీ, ప్రభుత్వ రికార్డు ఏదైనా అంటే జనాభా లెక్కలు, గెజిటేర్లు, సర్వే, సెటిల్‌మెంట్ రిపోర్టులు, మేప్‌లు, సాటిలైట్ మేప్‌లు, వర్కింగ్ ప్లానులు, అటవీ ఎంక్వైరీ రిపోర్టులు లాంటివి ఏవైనా ఆధారంగా చూపవచ్చు. ఇవే కాకుండా, రేషన్ కార్డు, వోటర్ ఐడెంటిటీ కార్డు, పాస్ పోర్టు, ఇంటి పన్ను రసీదు, నివాస సర్టిఫికెట్ లాంటివి కూడా చూపవచ్చు. ఇళ్ళు, కోర్టు ఆర్డర్లు, సర్వే రిపోర్టులు, సంస్థానాలు ఇచ్చిన సర్టిఫికెట్లు, వంశవృక్షాలు, గ్రామ పెద్దల స్టేట్‌మెంట్లు లాంటివి అన్నీ ఆధారాలుగా చూపవచ్చు.

**13. అటవీ భూములలో ఇంటి స్థలాలకు పట్టాలిస్తారా?**

అటవీ హక్కుల చట్టం గ్రామానికి, ఇళ్ళ స్థలాలకు కూడా వర్తిస్తుంది. కాబట్టి ఇళ్ళ స్థలాలకు కూడా పట్టాలు పొందవచ్చు.

**14. సామాజిక హక్కులు అంటే ఏమిటి? వాటికి హక్కు పత్రం ఇస్తారా? ఎవరికిస్తారు?**

సాంప్రదాయక గ్రామ సరిహద్దులో ఉండే సామాజిక అటవీ సంపద అంటే సాంప్రదాయిక సమిష్టి అడవి అని అర్థం. ఇది కాక సమాజ అవసరాలకు సంబంధించిన హక్కులకు పట్టాలు ఇస్తారు.

**15. హక్కు పత్రం పొందిన అటవీ భూములను అమ్ముకోవచ్చా?**

అటవీ హక్కులు వ్యక్తులు, సమాజం అనుభవించేందుకే గానీ అమ్ముకునేందుకు వీలు లేదు. అవి వంశపారంపర్యంగా బదిలీ కాబడతాయి కానీ, అమ్ముకునే అవకాశం లేదు.

**16. నేను అటవీ భూమిని సాగు చేసుకుంటున్నాను. కానీ హక్కు పత్రం కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చా?**

డిసెంబర్ 13, 2005 నాటికి మీ ఆక్రమణలో ఆ అటవీ భూమి ఉంటే ఇంతకు ముందు పేర్కొన్న ఆధారాలు చూపుతూ గ్రామసభకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

**17. నాకు హక్కు పత్రం వచ్చింది. కానీ ఈ భూమిని సాగు చేసుకుంటున్నందుకు గాను అటవీ శాఖ వారు కొన్ని సంవత్సరాల క్రితం కేసు నమోదు చేశారు. ఆ కేసు ఇంకా పెండింగులో ఉంది. ఈ కేసు రద్దయ్యే అవకాశముందా?**

హక్కు పత్రం ఇచ్చిన తరువాత అంతకు ముందు అటవీశాఖ వారు ఆ స్థలంపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు అవుతాయి.

**18. నేను తే 13-5-2005 దీ తరువాత అటవీ భూమిని సాగు చేసుకుంటే పట్టా వస్తుందా?**

డిసెంబర్ 13, 2005 తరువాత ఆక్రమించుకున్న అటవీ భూమిపై హక్కులు రావు.

**19. హక్కు పత్రం పొందిన భూమి అన్యాక్రాంతమైంది. ఈ భూమి తిరిగి పొందాలంటే ఎలా?**

భారత అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కులు బదలాయించటానికి వీలు లేదు. కాబట్టి, గ్రామసభలో తీర్మానం చేయించి, భూమిని తిరిగి పొందవచ్చు.



**20.వాస్తవంగా సాగు చేసుకుంటున్న విస్తీర్ణం కంటే హక్కు పత్రంలోని విస్తీర్ణం తక్కువగా నమోదైంది. నేను సాగు చేసుకుంటున్న మొత్తం భూమికి హక్కు పత్రం పొందాలంటే ఎలా?**

ఒకసారి, హక్కులు నిర్ణయం అయిన తరువాత ఎలాంటి మార్పులు చేయటం కుదరదు. ఎందుకంటే, జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తిరుగులేనిది. అయినా కూడా వాస్తవంగా ఎంత భూమిలో సాగులో వున్నారో నిరూపిస్తే ఆ భూమిని డిసెంబరు 13, 2005 నాటికి సాగు చేసుకుంటున్నట్లుగా ఆధారాలు చూపుతూ గ్రామసభకు మిగిలిన భూమికి పట్టా కొరకై తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చు.

**21. హక్కు పత్రంలో నమోదైన వివరాలలో తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దాలంటే ఎలా?**

హక్కుల పత్రంలో తప్పులు ఉంటే గ్రామసభ తీర్మానంతో సరైన వివరాలు జతచేసి సబ్ డివిజనల్ కమిటీ ద్వారా సరైన హక్కుల పత్రం పొందవచ్చు.

**22.అటవీ భూములకు హక్కు పత్రం పొందిన వారి వివరాలు ఏఏ రికార్డులలో నమోదు చేస్తారు?**

హక్కులు పొందిన వారి వివరాలు రెవెన్యూ రికార్డు (అడంగల్ / పహాణీ)లలో పొందుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**23.హక్కు పత్రం ఉన్న వారు బ్యాంకు నుంచి రుణాలు పొందవచ్చా?**

బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వబడ్డాయి. కనుక సంబంధిత హక్కు పత్రాలను దాఖలు పరచటం ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంది.

**24.జిల్లా స్థాయి కమిటీ ముఖ్యమైన విధి ఏమిటి?**

అటవీ హక్కులు నిర్ణయిస్తారు.

**25.అటవీ హక్కులు పొందిన వారికి పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడు ఇవ్వవచ్చునా ?**

అటవీ భూములపై వారికి అనుభవించు దృవీకరణ పత్రం మాత్రమే ఇస్తున్నారు కాబట్టి వారికి పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ ఇవ్వడానికి వీలులేదు.

**ల్యాండ్‌సెల్, అపార్డ్ సౌజన్యంతో...**

# గిరిజన జీవనంలో "సంత" ఎంతో ప్రధానం



**తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మారేడుమిల్లి చుట్టు ప్రక్కల ఉన్న అన్ని గిరిజన గ్రామాలకు కూడలి, మండల కేంద్రం. ఇక్కడ ప్రతి శనివారం సంత జరుగుతుంది. ఈ సంతకు సమీప గ్రామాలలోని గిరిజనులలో ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకుంటే గిరిజన జీవన విధానంలో సంత ప్రాధాన్యత ఏమిటో మనకు ఇట్టే అర్థమవుతుంది.**

ముందుగా ఒక గిరిజన గ్రామం అయిన బోదలూరుకు వెళ్దాం. అది శనివారం ఉదయం. ఇక్కడ 40 ఇళ్ళు వున్నాయి. ఇళ్లలో నివశించే గిరిజనులు అంతా ఆదిమ గిరిజన తెగకు చెందిన కొండ రెడ్లు. కొండ రెడ్ల ఇళ్ళు విశాలమైన స్థలంలో నిర్మించు కుంటారు. సాధారణంగా చుట్టు పక్కల అడవిలో లభ్యమయ్యే కలప, రాళ్ళతో నిర్మించి, పైన గడ్డితో కప్పువేస్తారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వ సహకారంతో ఇటుకలు, సిమెంట్‌తో నిర్మిస్తున్నారు. గిరిజన గ్రామంలో గమనించినట్లయితే ఇంటి గోడలకు ఎర్రని మట్టిపూత, ఇంటి ముందు కూర్చోటానికి వీలుగా అరుగులు ఉండటం ప్రత్యేకత. ఇంటికి వాకిలి ఉండి, ప్రతి నిత్యం గిరిజన మహిళలు కళ్ళాపి చల్లి శుభ్రంగా ఉంచటం వారి సాంప్రదాయం. ఇంటి చుట్టూ చెట్లు పెంచటం వీరి అలవాటు. ఆ చెట్లలో పండ్లనిచ్చే బొప్పాయి, నిమ్మ, సీతాఫలం, ఎక్కువగా పనస, ప్రత్యేకంగా కల్లు కోసం జీలుగ చెట్లు పెంచుతారు.



మహిళలు ఇంటి ఆవరణలోని పెరటితోటలో ఒక పందిరిని ఆసరాగా చేసుకొని బీర, దొండ, సొర, పాదులను మొ॥నవి పెంచుతారు. ఇవే కాకుండా వంకాయ, టమాట వంటి కూరగాయలు పెంచటం గమనించవచ్చు.

ఇంటి ఆవరణలోనే కోళ్ళకు ప్రత్యేకమైన గూడు నిర్మిస్తారు. అదే విధంగా మేకలను ప్రత్యేక శ్రద్ధతో పెంచటమే కాకుండా, వాటిని తోడేళ్ళ నుండి రక్షణ నిమిత్తం ఎత్తైన వేదికపై కట్టడం నిర్మిస్తారు. ఉదయాన్నే నిద్రలేవటం అలవాటుగల కొండరెడ్ల మహిళలు ఇంటి పనులలో భాగంగా మంచినీటిని దగ్గరలోగల వాగు నుండి తెచ్చుకోవటం, ఇంటిని, పరిసరాలను శుభ్రపరచి, కల్లాపి చల్లి, ఇంటి బయటగల పొయ్యిపై వంట చేయటం ప్రారంభించి, పిల్లలను సంతకు వెళ్ళటానికి సిద్ధం చేస్తారు. అదే మగవారు అయితే కొండపోడు వద్దకు

వెళ్ళి సంతలో అమ్మటానికి సిద్ధంగా ఉండే ధాన్యాన్ని, (చోళ్ళు, సామలు) దగ్గరలో గల అటవీ ఉత్పత్తులను, తేనె, తదితర వస్తువులు సేకరించి, ఇంటికి వస్తారు. కొంతమంది వేటకు వెళ్ళి ఏదో ఒక జంతువుని వేటాడి రావటం జరుగుతుంది. డబ్బు అవసరం ఉంటే వీటితో పాటు ఏ కోడినో, ఇంకా ఎక్కువగా అవసరం అంటే మేకనో అమ్మకం గురించి సంతకు తీసు కెళ్ళాల్సిందే.



వంట చేసుకొని, తిని, భార్యా పిల్లలతో తనవద్ద ఉన్న అటవీ ఉత్పత్తులలో సంతకు బయలుదేరి వెళ్ళటం పరిపాటి. సంతకు వెళ్ళటానికి అందుబాటు లో వుండే జీపు, ఆటో, బస్సు దొరికితే సరే, లేకుంటే కాలి నడకే.

ఈ విధంగా చుట్టు ప్రక్కల గ్రామాల నుండి మారేడుమల్లి సంతకు వచ్చిన గిరిజనులంతా ముందుగా వారు తమ గ్రామం నుండి తెచ్చిన సరుకును అమ్మడంపై దృష్టిపెడతారు. ఈ విధంగా వివిధ గిరిజన గూడాలనుండి వచ్చిన గిరిజనులు ముందుగా తాము సేకరించిన అటవీ ఉత్పత్తులను దగ్గరలోని గిరిజన సహకార సంస్థ సేకరణ కేంద్రంలో అమ్మటంపై దృష్టి కేంద్రీకరిస్తారు. కొంత మంది దళారులకు అమ్మటం ఇంకనూ జరుగుతూనే ఉంది. ఆ తర్వాత మహిళలు పెరట్లో లేదా అడవిలో సేకరించిన దుంపలు మరియు కూరగాయ లను సంతలో అమ్మటం ద్వారా డబ్బు సంపాదిస్తారు.

సంత చేయడానికి సంతలోనికి వెళ్ళేముందు ప్రధానంగా తినుబండారాలకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి సంతలో మాంసాహారం అయిన పంది మాంసం, కోడిమాంసం కొనటం సహజం. అదే విధంగా గిరిజనులకు ఇష్టమైన ఎండు చేపలు, రొయ్యలు కొనటం, వీటికి తోడు మసాలా దినుసులు కొనటం పరిపాటి. సంతలోనే కుండలు, వివిధ రకాలైన వంట పాత్రలు, పిల్లలకు పెద్దలకు రెడీమేడ్ బట్టలు కొంటారు. బట్టలు కుట్టే దర్జీ, క్షవరం చేసే మంగలి కూడా అందుబాటులో ఉంటారు. నాణ్యత ఎలా ఉన్నా వివిధ రకాలైన ఎలక్ట్రానిక్ వస్తువులైన గడియారాలు, టేప్ రికార్డర్లు కొనటంపై శ్రద్ధ చూపుతారు. మహిళలైతే గాజులు, ఆభరణాలు కొనుగోలుపై దృష్టి సారిస్తారు. ఈ విధంగా సంతలో తమ సేకరించిన అటవీ ఉత్పత్తులు అమ్మడంతో పాటు వారంపాటు తమకు కావలసిన వస్తువులు కొనుగోలు చేసిన గిరిజనులు ఇతర గూడేల నుండి సంతకు వచ్చిన తమ బంధుమిత్రులను కలుసుకొని యోగక్షేమాలను, అడుగుతూ సంతలోనే అందుబాటులో ఉండే కల్లు, ''నంజూక్''తో సేదదీరుతారు. కొన్ని గిరిజన తెగలలో భాగస్వామి ఎంపిక కూడా సంతలో జరుగుతుంది. అందుకే యుక్త వయస్సు యువతీ, యువకులు సంతకు రావటం, ఇష్టమైన వారిని వరించి వివాహం చేసుకోవటానికి సంత ఒక వేదిక.



గిరిజనుల జీవన విధానంలో సంతకు విశిష్ఠమైన ప్రాధాన్యత ఉంది. సంతలో వస్తుసేవల వినిమయమే కాకుండా, వివిధ గిరిజన గూడాల మధ్య సమాచార వినిమయం, భాగస్వాముల ఎంపిక, సంస్కృతీ సాంప్రదాయాలు పరస్పర పరిచయ వేదికగా ప్రధానపాత్ర పోషిస్తుందనటంలో సందేహం లేదు.

**ఎ. సుభాష్ చంద్రగౌడ్,**
**సీనియర్ ఫ్యాకల్టీ, సిఎన్ఆర్ఎమ్, అపార్డ్**

# ఉపాధి హామీ పథకంతో వెలుగుబాట

## తను చేరలేని గమ్యాన్ని తన పిల్లలు చేరాలన్నదే ధ్యేయం

సాయంత్రమయింది పొలంలో ముళ్ళచెట్లు నరుకుతూ ఉన్నారు రామాంజనేయులు. అతని భార్య రాజేశ్వరి. ఆ పొలం నల్లరేగడి పొలం. నాలుగేళ్ల కిందట ఎస్సీ కార్పోరేషన్ వారు రామాంజనేయులుకు 2.27 ఎకరాలు పట్టాగా మంజూరు చేశారు. అయితే ఆ పొలం నిండా ముళ్లకంపలు. ప్రతి సంవత్సరం పంట పెట్టే సమయానికి ఆ ముళ్ళకంపల్ని నరికేస్తూ ఉండడం వారికి ఆనవాయితీగా మారింది.

ఎంతసేపూ పైపైన ఉన్న కంపలనే నరికి వేయడం జరుగుతోంది. లోపల కాండం, వేర్లూ ఉండడంతో తర్వాత సంవత్సరం ఎప్పటి మాదిరే తిరిగి ముండ్ల మొక్కలు చెట్లయి పోతున్నాయి.

'ఎప్పటికంటే ఎక్కువుగా ఉన్నాయి ముండ్ల తుప్పలు. నా చేతకాదు. అసలే రోజూ నాకు జ్వరం వస్తా వుంది' అన్నది రాజేశ్వరి. చేసేది లేక గొడ్డళ్లు భుజాన వేసుకొని ఇంటి దారి పట్టారు ఇద్దరూ.

అంత కష్టమూ పడ్డాక, ఏభై వేలు అప్పు తెచ్చి పంటకు పెట్టుబడి పెడితే వర్షాలు వస్తే, పెట్టుబడి పోనూ అరవయి వేలు మిగులుతుంది. పొలానికి సంబంధించిన ఏ పని అయినా ఆలూమగలు ఇద్దరే కష్టపడుతుంటారు. పొలం పనులు లేనపుడు కూలికి పోతారు. కరువుకాలంలో అయితే కూలీ లేదు, నాలీ లేదు. అందుకే కుటుంబ పోషణకు చేసిన అప్పులు కూడా ఇప్పుడు ఎక్కువే ఉన్నాయి.

2006 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు మొదలు కావడంతో రామాంజనేయులూ, రాజేశ్వరీలు ఇద్దరూ ఉపాధి కూలీలు అయ్యారు. అప్పటి నుంచీ రోజు వారీ జీవితం సులభంగా మారింది అన్నో ఇన్నో ఉన్న అప్పులు అన్నీ తీరిపోయాయి. పొలంలో ఉన్న ముళ్లపొదలు అన్నీ ముళ్లపొదల తొలగింపు పనితో పూర్తిగా తొలగిపోయాయి. పైగా దున్నకం వంటి సేద్యం పనులు అన్నీ ఉపాధి హామీ పథకం పనులతో జరిగిపోయాయి.

ఇప్పుడు తన పొలంలో పత్తి పండించడం ద్వారా అతని సంవత్సరాదాయం ఎనభై వేల రూపాయలు. దానికితోడు ఉపాధి హామీ వేతనాలు. ఇప్పుడు అతను పొట్టేళ్ల వ్యాపారం కూడా చేస్తున్నాడు. 15 వందల రూపాయలకు ఒక పొట్టేలు పిల్లను కొని, మూడు నెలలు మేపి, అయిదు వేల రూపాయలకు అమ్మేస్తాడు. అలా సంవత్సరానికి రూ. 20,000 వేలు అదనంగా సంపాదిస్తాడు. ఆ కుటుంబానికి దిగులే లేదు. వాళ్లకిద్దరు పిల్లలు. ఒక కూతురు సుప్రియ, ఒక కొడుకు విక్రమసింహ (2 సంవత్సరాలు). ఉరవకొండలో కార్పోరేట్ స్కూల్లో సుప్రియ 1వ తరగతి చదువుతోంది. ఆమెకు సంవత్సరానికి రూ. 10,000 వేలు ఖర్చు అవుతుంది. ఆ డబ్బు ఉపాధి వేతనాల్లో మిగిలిన డబ్బే!

"నాకు అబ్బని చదువులు నా కూతురూ, కొడుకూ చదవాలి... ఏమయితేనేం మా జీవితాలలో వెలుగు నింపినది మాత్రం ఉపాధి హామీయే!" అంటాడు అతను.



**జాబ్‌కార్డు నెం. 10360**

| | |
|---|---|
| **భర్తపేరు** | **: బోగల రామాంజనేయులు (34 సంవత్సరాలు)** |
| **భార్యపేరు** | **: రాజేశ్వరి (28 సంవత్సరాలు)** |
| **కులం** | **: మాదిగ (ఎస్సీ)** |
| **గ్రామం** | **: మాళాపురం** |
| **గ్రామపంచాయితీ** | **: మాళాపురం** |
| **మండలం** | **: విడపనకల్లు** |
| **జిల్లా** | **: అనంతపురం** |

**సమాచార సేకరణ తేది : 14-10-2012**

## అటు ఉపాధిహామీ పనులు - ఇటు పాడి గేదెలూ...

2004వ సంవత్సరంలో తనకు 1.80 సెంట్లు పట్టాగా మంజూరు చేసి పట్టా కాగితాన్ని చేతికి ఇచ్చినపుడు ఆకాశంలో తేలిపోయాడు వరదప్ప. అతని భార్య వెంకటరమణమ్మకు కాలు ఒకచోట నిలువలేదు. వాళ్ల బంధువులందరికీ చెప్పివచ్చింది. వాళ్ల కుల వృత్తి అయిన చాకలి పని చేయడం దాదాపు తగ్గించి, ఇంక పొలం పనులపైనే తమ దృష్టంతా ఉంటుందని చెప్పుకుంది కూడా.

అయితే ఒక వారం తర్వాత సర్వేయరు వాళ్లకి పట్టాగా ఇచ్చిన భూమిని చూపించాక భార్యభర్తలిద్దరూ దిగులుతో పాతాళానికి కుంగి పోయారు- ఆ భూమిని చూసి. ఆ భూమి నిండా పెద్ద పెద్ద బండరాళ్లూ, ముళ్లపొదలూ. దాన్ని సాగు యోగ్యంగా మార్చాలంటే వేలాది రూపాయలు అప్పు చేయాలిసిందే. అప్పటికే తన ఇద్దరు చెల్లెళ్ల పెండ్లిండ్ల కోసం చేసిన అప్పులు రూ. 45,000లు దాకా ఉన్నాయి. దాంతో భూమి సాగుచేసుకోవాలన్న ఆశను వదిలేసుకొని, వరదప్ప ఎప్పటి లాగే కూలికీ, వెంకటరమణమ్మ తిరిగీ చాకలి పనికీ పోసాగారు. 2006 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం పనుల వేతనాలలో పొదుపు చేసుకొన్న డబ్బులతో ఒకవైపున పాత అప్పులు తీర్చేశారు. 4 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో 18 వేలు అప్పు చేసి 4 ఎనుములను కొన్నారు. ఉపాధి హామీ కూలీ వేతనాల పొదుపు డబ్బుతో అప్పునీ తీర్చేశారు.



Sthanika_BW_Janf13.indd 25 29/12/12 2:52 PM



జాబ్‌కార్డు నెం. 40014

| | | |
|---|---|---|
| భర్తపేరు | : | నడిమిదొడ్డి వరదప్ప (37 సంవత్సరాలు) |
| భార్యపేరు | : | వెంకటరమణమ్మ (28 సంవత్సరాలు) |
| కులం | : | చాకలి (బి.సి-ఎ) |
| గ్రామం | : | మరూరు చెర్లోపల్లి |
| గ్రామపంచాయితీ | : | మరూరు చెర్లోపల్లి |
| మండలం | : | రాప్తాడు |
| జిల్లా | : | అనంతపురం |
| సమాచార సేకరణ తేది | : | 26.9.2012 |

అప్పటి నించి పాల వ్యాపారం కూడా చేస్తున్నారు. ఇది వారికి అదనపు ఆదాయం. 3 ఎనుములు ఇప్పుడు గర్భంతో ఉన్నాయి. అవి ఈనాక రోజుకు 12 లీటర్ల పాలు వచ్చే అవకాశం ఉన్నది. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన 1.80 ఎకరాల భూమికి ఉపాధిహామీ పథకం పనులు అయిన రాతిగుట్టలు తొలగింపు, గులకరాళ్ల కట్టలు, ముళ్లపొదలు తొలగింపు పనుల ద్వారా పొలమంతా వ్యవసాయ యోగ్యంగా మారింది. మెట్టభూముల్లో పండ్లతోటల పెంపకం కింద 2011-12 సంవత్సరానికిగాను 140 మామిడి మొక్కలు మంజూరు అయ్యాయి. 10 రోజులలో నాటుతున్నారు.

"మేమూ పండ్ల తోటల యజమానులం అవుతున్నామంటే అదంతా ఉపాధి హామీ పథకం చలువే!" అన్నారు ఆ దంపతులు సంతోషంగా.

***- చిలుకూరి దేవపుత్ర***

*డి.డబ్లు.ఎం.ఎ. అనంతపూర్*

# 'ఇందిర ప్రభ' వెలుగులు

**సిద్దిపేట మండలంలోని లక్ష్మీ దేవి పల్లి గ్రామంలో యస్.సి. కుటుంబానికి చెందిన దండు స్వామికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అతనికి 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, పెసర, బబ్బెర తదితర పంటలను పండించేవాడు. ఆ సమయంలో సంవత్సరానికి కేవలం ఒక పంటను మాత్రమే, అది కూడా వర్షాలపై ఆధారపడి పండించేవాడు. సకాలంలో వర్షాలు పడితే సంవత్సరానికి 10 వేల నుండి 15 వేల అదాయం వరకు, వర్షాలు పడకపోతే పూర్తిగా పెట్టుబడులు సైతం రాక ఇబ్బందులు ఎదుర్కొనే వాడు. మిగతా సమయాలలో బొప్పాయి తోటలలో కూలీగా పనిచేసేవాడు.**



జాబ్ కార్డు నెం. 063

**పేరు : దండు స్వామి; గ్రామం : లక్ష్మిదేవిపల్లి; మండలం : సిద్దిపేట**
**జిల్లా : మెదక్; విస్తీర్ణం : 3.00 గుంటలు ; సర్వే నం. : 1300**

మండలంలో 'ఇందిర ప్రభ' (సమగ్ర భూ అభివృద్ధి పథకం) ద్వారా ఆర్.ఐ.డి.యఫ్. - 13 పథకం ద్వారా బోరుబావి, విద్యుత్తు సౌకర్యం కల్పించడం జరిగింది.

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం' ద్వారా అతని భూమిలో భూమి అభివృద్ధి పనులు, అంటే భూమి చదును చేయటం, వండ్రుమట్టి చేరవేయటం, పండ్ల తోటల పెంపకం ద్వారా మామిడితోటల పెంపకం కోసం 3 ఎకరాలలో (210) మొక్కలను నాటుకున్నాడు.

గతంలో సంవత్సరానికి కేవలం వర్షాకాలంలో ఒక పంటను మాత్రమే పండించే వారు. ప్రస్తుతం బోరులో నీరు సరిపడా ఉండటం వల్ల, తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగుచేయటానికి గాను పూర్తి స్థాయిలో డ్రిప్ సౌకర్యం కల్పించారు. పూర్తి స్థాయిలో పంటలు పండించడానికి వీలుగా, మామిడి తోటలో అంతర పంటగా పొద్దు తిరుగుడు పువ్వు, చిక్కుడు, వంకాయ, బీన్స్, ఉల్లి, టమాట, బెండ వంటి తదితర పంటలను గత రెండు సంవత్సరాల నుండి పండించటం ద్వారా, సంవత్సరానికి 1.50 లక్షల నుండి 2 లక్షల వరకు అదనపు ఆదాయం సంపాదించటం జరిగింది.

ఈ కూరగాయలను సమీపంలోని మార్కెట్లయిన దుబ్బాక, మాచారెడ్డి, సిద్దిపేట, గంబీర్రావుపేట తదితర ప్రాంతాలకు తీసుకొని వెళ్లి అమ్ముకుంటున్నాడు. తన పిల్లలను రాఘవాపూర్‌లోని ప్రయివేటు పాఠశాలలో చదివిస్తున్నాడు తను కూడా ప్రస్తుతం బొప్పాయి పండ్ల తోటల్లో కూలీ పనులకు వెళ్లకుండా, తన భూమిలోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు.

'ఇందిర ప్రభ', 'ఉపాధి హామీ' పథకాల ద్వారా తన భూమి సాగులోకి రావటం, తద్వారా తాను ఆర్థికంగా అభివృద్ధి చెందటం జరిగిందని, ఈ పథకం తముకు, తమ కుటుంబానికి వరంలాంటిదని దండు స్వామి ఆనందం వ్యక్తం చేశాడు.

***- బాలరాజు,*** *ఎం.పి.డి.ఓ, సిద్ధిపేట*



Sthanika_BW_Janf13.indd 26 29/12/12 2:52 PM





# ఆధునిక పరికరాలతో వ్యవసాయ సాగు

**ఆధునిక వ్యవసాయ పరికరాలు వాడటం వలన ఖర్చు తగ్గడమే కాక, సమయం కూడా వృధా కాదు. శ్రమ తక్కువగా ఉండి, లాభం పెరుగుతుంది. ఉత్పత్తి కూడా ఎక్కువ చేయవచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం ప్రకారం మన ఉత్పత్తికి విదేశాలలో గిట్టుబాటు ధర లభించాలంటే ఉత్పత్తుల నాణ్యత పెంచి, ఖర్చు తగ్గించాలి. ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాల వాడకం దీనికి దోహదం పడుతుంది.**

## దమ్ము నాగలి

ఈ నాగలిని అన్ని రకాల నేలల్లోను ఉపయోగించవచ్చు. తేలిక నేలల్లో చిన్న గిత్తలు కూడా దీనిని లాగగలవు. 75 సెం.మీ. వెడల్పు గల ఈ దమ్ము నాగలితో రోజుకు సుమారు రెండు ఎకరాలను ఒక సారి దమ్ము చేయవచ్చు. ఈ నాగలి మట్టిగడ్డలను పగల గొట్టడమే కాక, నీరు భూమి లోపలికి ఇంకి పోవటాన్ని తగ్గించి సేద్యం నీటి వాడకాన్ని పొదుపు చేస్తుంది. ఈ దమ్ము నాగలిని ఉపయోగించేటప్పుడు భూమిపైన కనీసం 6 సెం.మీ., నీరు ఉండాలి. దీనిని దిగుబాటు నేలలో ఉపయోగించేటప్పుడుగానీ, చిన్న గిత్తలతో దమ్ము చేసేటప్పుడు గాని సీటుపై మనిషి కూర్చోకూడదు.

గడ్డి, కలుపు మొక్కలు ఎక్కువగా పెరిగిన నేలలో ఉపయోగించే ముందుగా ఒకసారి పొలాన్ని ఇనుప నాగలితో దున్నాలి. ఈ దమ్ము నాగలిని ఉపయోగించటం వలన దమ్ము చేయటానికయ్యే ఖర్చు తగ్గటమే కాక, పని తొందరగా పూర్తి అవుతుంది. దమ్ము నాణ్యత కూడా బాగుంటుంది. ఈ నాగలిని ఉపయోగించేటప్పుడు దిగుబాటు భూముల్లో బ్లేడ్లను అప్పుడప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఈ దమ్ము నాగలి ధర రూ. 23,500 నుండి 27,500 వరకు ఉంటుంది.

## వరి కోత యంత్రం

ఈ యంత్రం 5 హెచ్.పి. డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ యంత్రాన్ని ఒక మనిషి నడుపుతూ ఒక ఎకరా పొలాన్ని 2 గంటలలో కోయగలదు. ఈ యంత్రంలో క్రింది భాగాన అమర్చబడిన బ్లేడ్లు వరి పొలాన్ని కోయగా, బెల్టులు కోసిన వరిని కుడివైపున వరుసల్లో వేస్తాయి. ఈ యంత్రం నడపటానికి గంటకు ఒక లీటరు డీజిల్ ఖర్చవుతుంది. ఈ యంత్రం నిలబడి ఉన్న వరి పొలాన్ని మాత్రమే కోయగలదు. కోతకు కనీసం వారం రోజుల ముందు పొలానికి నీరు పెట్టడం ఆపి బాగా అరనివ్వాలి. ఈ యంత్రం నడపటానికి ముందు గట్ల వెంబడి కనీసం 50 సెం.మీ. వెడల్పులో వరిని కొడవలితో కోయాలి. దీని ధర రూ. 91,000 నుండి 1,10,000 వరకు ఉంటుంది.

## పలు పంటలు మార్చే యంత్రం

ఈ యంత్రాన్ని ఉపయోగించి పలు పంటలను మార్చి, విత్తనాన్ని జల్లెడ పట్టి, మంచి విత్తనాన్ని వేరు చేసుకోవచ్చును. ముఖ్యంగా వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న పంటలకు ఇది చాలా





Sthanika_Color_jan13.indd 15 29/12/12 5:48 PM

ఉపయోగం. వేరు వేరు పంటలు మార్చటానికి ఈ యంత్రంలోని కొన్ని భాగాలను తగు విధంగా సవరించాలి. వరి, గోధుమ పంటలను మార్చటానికి ఈ యంత్రంలోనికి కంకులతో బాటు మొక్కలను వేయవచ్చు. జొన్న, మొక్కజొన్న కంకులను మాత్రమే ఈ యంత్రంలోనికి వేయాలి. వరి నూర్చినప్పుడు, వరిగడ్డి ఏమాత్రం పాడవకుండా పశువులు తినటానికి అనుకూలంగా ఉంటుంది. ఈ యంత్రం నడపటానికి 7.5 హెచ్.పి. విద్యుత్తు మోటారు గాని, డీజిల్ ఇంజనుగాని ఉపయోగించవచ్చు. ఈ యంత్రం గంటకు 6 నుండి 10 క్వింటాళ్ళ వరి, 4 నుండి 10 క్వింటాళ్ళ గోధుమ, 10-15 క్వింటాళ్ళ జొన్న, 15-20 క్వింటాళ్ళ మొక్కజొన్నను నూర్చుతుంది. దీని ధర రూ. 70,000 నుండి 1,20,000 వరకు ఉంటుంది.

## ఎరువు, విత్తనం ఒకేసారి వేసే పరికరం (ఎద్దులతో నడిచేది)

దీని సహాయంతో పలు పంటలను ఎరువుతో సహా విత్తుకోవచ్చు. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం లాంటి విత్తనాన్ని తేలికగా విత్తుకోవచ్చు. వేరు వేరు పంటలను విత్తటానికి ఆయా పంటలకు సంబంధించిన రోలర్లను మార్చుకోవాలి. పంటలను బట్టి సాళ్ళ మధ్య దూరాన్ని మార్చుకునే ఏర్పాటు ఉంది. ఒకేసారి 3 సాళ్ళ వరకు విత్తనం, ఎరువు వేసుకోవచ్చు. సాళ్ళ మధ్య దూరం 30-90 సెం.మీల వరకు మార్చుకోవచ్చు.

దీని సహాయంతో రోజుకు రెండున్నర ఎకరాల్లో విత్తనం, ఎరువు ఒకేసారి వేసుకోవచ్చు. ఈ పరికరాన్ని ఉపయోగించటానికి ముందు భూమిని బాగా దున్ని తయారుచేయాలి. ఈ పరికరాన్ని ఒక జత ఎద్దులు సులువుగా లాగుతాయి. పవరు టిల్లరుకు కూడా తగిలించి విత్తుకోవచ్చు. గింజలు, ఎరువు సక్రమంగా పడుతుందీ లేనిదీ అప్పుడప్పుడు చూసి సరి చేసుకోవాలి. దీని ధర రూ. 7,000 వరకు ఉంటుంది.

## ఎరువు, విత్తనం ఒకేసారి వేసే పరికరం (ట్రాక్టరుతో నడిచేది)

దీని సహాయంతో పలు పంటలను ఎరువుతో సహా విత్తుకోవచ్చు. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం లాంటి విత్తనాల్ని తేలికగా విత్తుకోవచ్చు. వేరు వేరు పంటలను విత్తటానికి ఆయా పంటలకు సంబంధించిన రోలర్లను మార్చుకోవాలి. పంటలను బట్టి సాళ్ళ మధ్య దూరాన్ని మార్చుకోవచ్చు. ఒకేసారి 9 సాళ్ళ వరకు విత్తనం, ఎరువు వేయవచ్చు. ఈ పరికరాన్ని ట్రాక్టరు కల్టివేటరుకు బిగించి 35 హెచ్.పి. ట్రాక్టరుతో నడపాలి. ఈ పరికరంతో రోజుకు ఏడున్నర ఎకరాల వరకు విత్తనం, ఎరువు వేసుకోవచ్చు. విత్తేటప్పుడు గింజలు, ఎరువు సక్రమంగా పడుతున్నది లేనిదీ చూసి సరిచేసుకోవాలి. దీని ధర రూ. 42,000 ఉంటుంది.



## వేరుశనగ కాయలను విడదీసే యంత్రం

ఈ యంత్రం 2 హెచ్.పి. విద్యుత్తు మోటారు సహాయంతో నడుస్తుంది. పొలం నుంచి తీసిన పంటలను ఎండబెట్టనవసరం లేకుండా వెంటనే ఈ యంత్రం సహాయంతో కాయలను వేరు చేయవచ్చు. ఈ యంత్రం నడిచేటప్పుడు వేరుశనగ మొక్కలను అందించటానికి, యంత్రంలో ఉంచటానికి, విడదీసిన వేరుశనగ కాయలను ప్రోగుచేయటానికి ఐదుగురు కూలీలు కావాలి. ఈ యంత్రం కాయలను పూర్తిగా విడదీస్తుంది. కాయ పగలదు. కాయలను విడదీయగా మిగిలిన మొక్కలు ఏ మాత్రం పాడు కావు కనుక, పశువుల దాణాగా ఉపయోగించుకోవచ్చు. ఈ యంత్రంమీద పని చేసే కూలీల చేతులు యంత్రానికి తగలకుండా జాగ్రత పడాలి. తాము కట్టుకొన్న బట్టలు యంత్రంలో తిరిగే భాగాలకు తగలకుండా జాగ్రత్తపడాలి. దీని ధర రూ. 26,000 ఉంటుంది.

## వేరుశనగ కాయలను వలిచే పరికరం

ఈ పరికరం సహాయంతో వేరుశనగ కాయల నుండి గింజలను వేరు చేసుకోవచ్చు. ఒక మనిషి సులభంగా దీనిని నడపగలడు. ఒకేసారి 3 కిలోల కాయలను వేసి గింజలను వేరు చేసుకోవచ్చు. తొక్కులను, విత్తనాన్ని చెరిగే ద్వారా వేరు చేసుకోవాలి. గింజలు పగులుతుంటే జల్లెడకు, ఇనుప దిమ్మలకు మధ్య దూరాన్ని సరి చేసుకోవాలి. దీని ధర రూ. 1380.

## పొద్దు తిరుగుడు పూలు / మొక్క జొన్న కంకులను నూర్పిడి చేసే యంత్రం

ఈ యంత్రం 5 హెచ్ పి మోటారు సహాయంతో పని చేస్తుంది. ఈ యంత్రం పొద్దుతిరుగుడు పూలను / మొక్కజొన్న కంకులను నూర్చటమే గాక, జల్లెడపట్టి మంచి విత్తనాలను వేరు చేస్తుంది. ఈ యంత్రం ముగ్గురు కూలీల సహాయంలో ఒక గంటలో 2 క్వింటాళ్ళ మొక్కజొన్న కంకులను నూర్పిడి చేస్తుంది. ఈ యంత్రంలో మార్చటానికి ముందు పొద్దుతిరుగుడు పూలను / మొక్కజొన్న కంకులను బాగా ఎండబెట్టాలి. దీని ధర రూ. 40,560 ఉంటుంది.

## ఆముదం కాయలు నూర్చే యంత్రం

ఈ యంత్రం ఆముదం కాయలను నూర్చటమే గాక, గింజలను జల్లెడ బట్టి శుభ్రపరచిన గింజలను ఇస్తుంది. గంటకు 500-600 కిలోల గింజలను మాత్రమే ఈ యంత్రంలో వేయాలి. 8 హెచ్ పి డీజిల్‌తో ఇంజను నడుస్తుంది. ఈ యంత్రంలో గింజలు పగిలినప్పుడు గాని లేక కాయలు పూర్తిగా నూర్పిడి కానప్పుడు గాని, సిలెండర్లు కాన్కేవ్ మధ్య దూరాన్ని మార్చుకొనే సౌకర్యం ఉంది. దీని ధర రూ.42,952 ఉంటుంది.

## గింజలను శుభ్రం చేసే యంత్రం

ఈ యంత్రం 3 హెచ్ పి మోటారుతో నడుస్తుంది. ఆయా పంటలను బట్టి దీనిలోని జల్లెడలను మార్చుకోవాలి. దీని సహాయంతో పంటను బట్టి 3-6 క్వింటాళ్ళ ధాన్యం శుభ్రం చేసుకోవచ్చు. వరి ధాన్యాన్ని శుభ్రం చేసేటప్పుడు అప్పుడప్పుడు హాసర్‌ను శుభ్రం చేస్తుండాలి. దీని ధర రూ. 26,520 ఉంటుంది.


Sthanika_Color_jan13.indd 16 29/12/12 5:48 PM

## బూమ్ స్ప్రేయర్

వరి కోత యంత్రంలో కొన్ని మార్పులు చేసి బూమ్ స్ప్రేయర్ రూపొందించబడింది. వరుసల్లో విత్తిన / నాటిన అన్ని మెట్ట పంటలలో (45 రోజుల లోపు) ఈ యంత్రాన్ని ఉపయోగించి పురుగుమందుల ను పిచికారి చేయవచ్చు. ఇందులో 14 నాజిల్లలో అమర్చబడి ఒకేసారి 6 మీటర్ల వెడల్పుతో మందు చల్లబడుతుంది. స్ప్రేయింగ్ చేయ వలసిన పంట ఎత్తును బట్టి, పంటవరుసల దూరాన్ని బట్టి నాజిల్ ఎత్తును (30-60 సెం.మీ.) నాజిల్ల మధ్య దూరాన్ని మార్చుకోవచ్చును. ఈ యంత్రాన్ని ఉపయోగించి రోజుకు సుమారు 4 హెక్టార్ల పొలంలో మందు చల్లవచ్చు. దీని ధర రూ. 42,000 ఉంటుంది.

## మాగాణి భూమి చదును చేసే యంత్రం (ట్రాక్టరుతో)

ఇది ట్రాక్టరు సహాయంతో నడుస్తుంది. ఇది ట్రాక్టరు వెడల్పును, కేజ వీల్స్ వెడల్పును బ్లేడ్ వాలును 0-90 డిగ్రీల వరకు ట్రాక్టరు హైడ్రాలిక్ లివర్ సహాయంతో మార్చుకోవచ్చు. ఈ యంత్రం సహాయంతో మాగాణి భూమిని తక్కువ సమయంలో చక్కగా చదును చేసుకోవచ్చు. రోజుకు సుమారు 2 హెక్టార్ల పొలం చదును చేసుకోవచ్చు. దీనిని బాగా దమ్ము చేసిన తర్వాతనే ఉపయోగించాలి. దీనిని ఉపయోగించేటప్పుడు పొలంలో పలుచగా నీరు ఉండాలి. గట్ల దగ్గర, మలుపుల వద్ద మనుషుల సహాయంతో చదును చేసుకోవాలి. దీని ధర రూ. 9,000 ఉంటుంది.

## మొక్క జొన్న కండెలను పైపొర తీసి నూర్చే యంత్రం

ఈ యంత్రం 35 హెచ్ పి టాక్టరు పిటిఓ ద్వారా పని చేస్తుంది. ఈ యంత్రంలో బాగా ఎండిన మొక్కజొన్న కండెలను పైపొర తీయకుండా వేసిన ఎడల పైపొరను తీసి గింజలను నూరుస్తుంది. కండెల తేమ శాతం ఎక్కువ ఉంటే యంత్రంలో చుట్టుకొని పోతుంది. ఈ యంత్రంలో కండెల నుండి పైపొరను తీయటం, మార్చడం, గింజలను శుభ్రం చేయటానికి తగిన అమరిక ఉంది.

ఈ యంత్రం ద్వారా గంటకు 450-650 కిలోల గింజలను నూర్చుకోవచ్చు. దీనితో నూర్చుకుంటే 85 శాతం వరకు పనివాళ్ళను ఆదా చేసుకోవచ్చు. దీని ధర రూ. 1,04,000 ఉంటుంది.

## వరి విత్తే సాధనం

ఈ యంత్రం ద్వారా 8 సాళ్ళలో మొలకెత్తిన వరి విత్తనాన్ని చల్లవచ్చు. దీనిని ఉపయోగించి వరి నారు పెంచటం, నాటటం మొదలైన పనుల ను నివారించవచ్చు. ఒక మనిషి యంత్రం లాగటానికి, మరొకరు వరి విత్తనాలు నింపటానికి కావాలి. దీనితో గంటకు 0.25 ఎకరకు వరి విత్త వచ్చు. దీని ధర రూ.4,900 ఉంటుంది.

## వరి నాటే యంత్రం

ఈ యంత్రంలో ఒకేసారి 8 సాళ్ళలో వరి నాటుకోవచ్చు. ఈ యంత్రం 4 హెచ్ పి డిజిల్ ఇంజనుతో నడుస్తుంది. ఇది చైనా దేశంలో తయారు చేయబడింది. ఈ యంత్రానికి తప్పనిసరిగా చాపనారు ప్లాస్టిక్ షీట్‌ను ఉపయోగించి ఉంచాలి. దీని బరువు 320 కేజీలు. దీనిలో సాళ్ళ వరుసకు, వరుసకు మధ్య దూరం 23.8 సెం.మీ., హిల్‌కు



హిల్‌కు మధ్య 140 - 170 సెం.మీ గా వేసుకొనే వీలు కలుగుతుంది. ఈ యంత్రంతో రోజుకు 4 ఎకరాలు నాటుకోవచ్చును. దీని ధర రూ. 1,93,000 ఉంటుంది.

## వేరుశనగ పంటను త్రవ్వి కాయలు తీసే పరికరం

ట్రాక్టరు సహాయంతో నడిచే ఈ వేరుశనగ పంటను త్రవ్వి కాయలను తీసే పరికరం వాడడానికి సులభం. దీనిని 45 హెచ్ పి. ట్రాక్టరు సహాయంతో పంటను తవ్వి కాయలను తీసే మేలైన సామర్థ్యం కలిగిన ఈ పరికరం చాలా తక్కువ పంట నష్టాన్ని కలిగిస్తుంది. ఈ పరికరం వాడటం వల్ల కాయలు తీసే సమయంలో కూలీలపై ఆధారపడకుండా నివారిస్తుంది. ఈ యంత్ర పరికరాన్ని ఉపయోగించడం వలన వేరుశనగలో అధిక దిగుబడులు పొందవచ్చు. దీని ధర రూ.1,80,000 ఉంటుంది.

## వరి నూర్చే యంత్రం (కంబైన్ హార్వెస్టర్)

ఈ యంత్రం ద్వారా వరి పంటను కోయడం, మార్పిడి ఒకేసారి చేసుకోవచ్చు. నేల, పొలం పరిస్థితిని బట్టి ఒక ఎకరా పొలాన్ని 1.15-1.30 గంటలలో కోసి, నూర్పిడి చేసి ధాన్యాన్ని శుభ్రపరచడం. చక్రాలు, ట్రాక్ మోడల్స్‌లో లభ్యమవుతాయి. ట్రాక్టరు, స్వయంశక్తితో నడిచే ఈ యంత్రం 40-110 అశ్వశక్తిలో లభిస్తున్నాయి. ఈ యంత్రం ఖరీదు రూ. 6-8 లక్షలు. ట్రాక్టరు నడిచేది (ట్రాక్టరు ఖరీదు కాకుండా) రూ. 14-24 లక్షల ఉంటుంది.

వ్యవసాయ సేద్యంలో ఈ యంత్రాలు, పరికరాలు వాడటం వలన ఖర్చు తగ్గడమే కాకుండా, సమయం వృధా కాదు. ఉత్పత్తుల నాణ్యత పెంచటం వలన తగిన సమయంలో గిట్టుబాటు ధర కూడా లభించటానికి అవకాశం ఉంది.

*- ఎమ్. మొగలయ్య, ఎమ్.యస్.సి (అగ్రికల్చర్)*
*ఫ్యాకల్టీ, సిఎస్ఆర్ఎం, అపార్డ్*



Sthanika_Color_jan13.indd 17 29/12/12 5:48 PM



# గిరిజన మహిళా శక్తి

**పెద్దగా చదువూ సంధ్యాలేని మహిళలు వారు.**

**మారుమూల గ్రామాల్లో పనులు చేసుకు బతికే పేదవాళ్లు.**

**రెక్కాడితే కానీ డొక్కాడని అతిసాధారణ గ్రామీణులు.**

**నిరంతరం బతుకు పోరాటంలో నలిగిపోతున్న స్త్రీలు....**

**పని, చాకిరి, కాయకష్టం, చెమట చిందితేనే పొయ్యిమీద అన్నం ఉడికేది. ఇలాంటి అట్టడుగున వున్నా, ఎవరికీ పట్టని ఆదివాసీలు కూడా ఒక అద్భుతం సృష్టించగలిగారంటే మీరు నమ్మగలరా? వాళ్లు సాధించింది మామూలు విజయం కాదు. ఏకంగా ఒక జలవిద్యుత్ కేంద్రమే కట్టారు.**

**వృధాగా పోతున్న ఏలేరు నీటిని వెలుగులు చిమ్మే విద్యుత్ కాంతి కెరటాలుగా మార్చి ఈ దేశానికి ఆదర్శంగా నిలిచారు. ఆ ఆదివాసీ మహిళలకు అండగా,చేదోడు వాదోడుగా నిలిచింది రాష్ట్రప్రభుత్వం. ఆర్థికంగా ఆదుకుంది నాబార్డు (జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు).**

పని నేర్పించి, శిక్షణ ఇచ్చారు. అమాయకమైన ఆదివాసీ అమ్మాయిల ను ఆత్మవిశ్వాసం తొణికిసలాడే 'పారిశ్రామికులు'గా తయారుచేశారు. ప్రభుత్వం తల్చుకుంటే ఎంత గొప్ప పనులు చేయగలదో, ఎంతమంది భవిష్యత్‌కు పూలదారులు వేయగలదో చేసి చూపించిన గొప్ప కృషి ఇది. అనామకులైన వారిని పారిశ్రామికులుగా మార్చిన నిజమైన అనుభవం ఇది.

ఆదివాసీ మహిళలు 1.2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చిన్న తరహా జల విద్యుత్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఏడాదికి కోటి రూపాయలకు పైగా ఆదాయాన్ని తెస్తున్నారు. అవిద్య, పేదరికం, అనారోగ్యం సమస్యల చీకట్లు ముసురుకున్న గ్రామాలకు వెలుగుబాట చూపుతున్నారు. చిన్న ప్రాజెక్టు అయినా ఒక కొత్త భవిష్యత్తుకి పూలదారులు పరుస్తున్నారు.

## అడ్డతీగల విద్యుల్లతలు

ప్రపంచ గ్రామీణ చరిత్రలో ఇదో అరుదైన అభివృద్ధి కోణం. గిరిజన మహిళ యాజమాన్యంలో వారే ఉద్యోగులుగా, నిర్దేశకులుగా, జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా జరుగుతుందా? ఇది సాధ్యమా? సామాన్య గిరిజన స్త్రీలు ఇంతపని చేయగలరా? 'చేయగలం' అని స్త్రీశక్తిని నిరూపిస్తున్నారీ నిరుపేద గ్రామీణులు.

తూర్పుగోదావరిజిల్లా ఏజెన్సీలో ప్రవహిస్తున్న ఏలేరు నదిపై ఈ ప్రాజెక్టు ఏర్పాటయింది. ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గిరిజన గ్రామాలలో సహజంగా ఏర్పడిన ఆరు జలాశయాలు, నదులు, వాగులు, వంకలలో ప్రవహించే నీళ్ళ నుండి విద్యుత్ ఉత్పత్తి చేయడం, ఆ ఆదాయంతో స్థానిక గిరిజనులు జీవన ప్రమాణాలు మెరుగుపరిచి వారి గ్రామాల అభివృద్ధికి తోడ్పడేలా మినీ హైడల్ పవర్ ప్రాజెక్టులను స్థాపించాలనే లక్ష్యంతో జూలై 2002లో 'ఆంధ్రప్రదేశ్ గిరిజన విద్యుత్ సంస్థ' ను భారతీయ కంపెనీల చట్టం 1956 ప్రాతిపదికగా స్థాపించారు.

గిరిజన మహిళా సాధికారతలో భాగంగా ఏర్పడిన ట్రిప్‌కో, రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో ఏలేరు నదిపై వేటమామిడి, మిట్టపాలెం, పింజరికొండ గ్రామాల వద్ద 3 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం 2005లో మొదలైంది. ఒక్కొక్క ప్రాజెక్టు సామర్థ్యం 1.20 మె.వా.

### నాబార్డు ఆర్థిక ఆసరా

ఎపి ట్రిప్‌కో సంస్థ జలవిద్యుత్ ప్రాజెక్టు రూపకల్పన అనంతరం ఆర్థిక నిధులు సమకూర్చుకోవడం కోసం నాబార్డును సంప్రదించగా, ఆర్ఐడిఎఫ్ నుండి రుణం ఇవ్వడానికి నాబార్డు సిజిఎం శ్రీ మోహనయ్య ముందుకు వచ్చారు. నాబార్డు అధికారులు వేటమామిడి సందర్శించి అక్కడి ప్రాజెక్టు నిర్మాణ పనులను చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.



Sthanika_Color_jan13.indd 18 29/12/12 5:48 PM

రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్న జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ గిరిజన గ్రామాల్లో జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణానికి కొంత రుణం ట్రిప్‌కో సంస్థకు అందించింది.

నాబార్డు చేయూతనివ్వడంతో ట్రిప్‌కో ఉత్సాహంగా పనులు ప్రారంభించింది. మరిన్ని ఆర్థికవనరులను భారతప్రభుత్వ సంప్రదాయేతర ఇంధనవనరుల సంస్థ (ఎంఎన్ఆర్ఇ) నుంచి సబ్సిడీ రూపంలో కొంత, ట్రిప్‌కో సంస్థ సమకూర్చుకుంటుంది.

తూర్పుగోదావరిజిల్లా అడ్డతీగల మండలం వేటమామిడి, పింజరి కొండ, మిట్లపాలెం, ఖమ్మం జిల్లా మోతుగూడెంలో నాలుగు జలవిద్యుత్ ప్రాజెక్టుల కోసం 31 కోట్ల 72 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వీటి మొత్తం సామర్థ్యం 6.6 మె.వా.

## గిరిజన మహిళల యాజమాన్యం

పవర్ ప్రాజెక్టుతో స్థానిక గిరిజనులు స్వయంసమృద్ధి సాధించడమే ఇక్కడ ప్రధాన లక్ష్యం. దీన్ని సాధించడానికి జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను స్థానిక గిరిజన మహిళలతో ఏర్పాటయిన ప్రాజెక్టు కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. ఈ పవర్ ప్రాజెక్టులను ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఇ.పి.సి) పద్ధతిలో కాంపిటేటివ్ బిడ్డింగ్ ద్వారా కాంట్రాక్టర్లను నియమించారు. ప్రాజెక్టు కమిటీలు, ఐటీడిఎ, రాష్ట్రస్థాయి కమిటీల పర్యవేక్షణలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది.

## ఎవరు కొంటారు...?

ఈ మూడు ప్రాజెక్టుల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు మండల విద్యుత్ పంపిణీ సంస్థతో ప్రాజెక్టు కమిటీలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి.

## సాంకేతిక శిక్షణ

స్థానిక గిరిజన మహిళల సారథ్యంలో ఏర్పడిన ప్రాజెక్టు కమిటీలకు జల విద్యుత్ కేంద్రాల నిర్వహణలో శిక్షణను ట్రిప్‌కో చేపట్టింది. సాంకేతిక (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్), ఆర్థిక, యాజమాన్య అంశాలపై గిరిజన మహిళలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. నిడదవోలులోని శెట్టిపేట మినీ హైడల్ పవర్ ప్లాంట్‌లో 2009 లో 3 నెలలపాటు ప్రాజెక్టు కమిటీలకు శిక్షణ ఇచ్చారు.

## సౌర వెలుగులు

గిరిజన పల్లెల్లో వెలుగుల కోసం, రాష్ట్రంలో విద్యుత్ సౌకర్యంలేని మారుమూల గిరిజన గ్రామాలలో సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుదీకరణను ట్రిప్‌కో చేపట్టింది. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్.ఐ.ఆర్.డి) సహకారంతో విశాఖపట్నం, పాడేరు, ఐటిడిఎ పరిధిలోని తమ్మింగుల, పూసలపాలెం గ్రామాలలో 120 కుటుంబాలకు సోలార్ విద్యుత్‌ను అందించి ఆ చీకటి పల్లెల్లో వెలుగులు నింపారు.

అలాగే శ్రీశైలం ఐటిడిఎ పరిధిలో అమ్రాబాద్, కొల్లాపూర్ మండలాల్లోని చెంచుగూడేలలో 'లైట్ ఎమిటింగ్ డయాడ్'ల (ఎల్ఇడి) విద్యుత్‌ను అందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్ (సిఇసి) సంస్థ సహకారంతో గిరిజన మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ఆర్థిక సహాయంతో ఈ ప్రాజెక్టుని విజయవంతంగా అమలు చేశారు.

## ప్రాజెక్టు నిర్మాణంలో శ్రద్ధ

వేటమామిడి, మిట్లపాలెం ప్రాజెక్టుల నిర్మాణంలో పనిచేసిన గుత్తేదారులు మిగిలిన పవర్ హౌస్‌ల నిర్మాణ పనులను నత్తనడక సాగించినందుకు వారిని తొలగించి కొత్తగా మూడు ఏజెన్సీలకు





Sthanika_Color_jan13.indd 19 29/12/12 5:48 PM

## హైదరాబాద్‌లో నాబార్డు సత్కారం

"మా గ్రామం పక్కనుండి పారుతున్న ఏలేరు నదిలో దుస్తులు ఉతుక్కోవడం, చేపలు పట్టుకోవడమే మాకు తెలుసు. మా పంట పొలాలకు చాలా దిగువన నది ప్రవహించడంతో వ్యవసాయ సాగుకు కూడా ఈ నీళ్లు అందుబాటులో లేవు. కానీ ఈ నీళ్లతోనే కరెంట్‌ను తయారుచేయవచ్చని తెలిశాక మా ఊరంతా ఆశ్చర్యపోయింది. కొన్నేళ్ల క్రితం మా ప్రాంతంలో కొన్ని ప్రైవేట్ కంపెనీలు జలవిద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు సర్వేలు చేశాయి.

ఆ సమయంలో హైదరాబాద్ నుండి శ్రీ ఛాయారతన్ అనే గిరిజన శాఖ ఉన్నతాధికారి అడ్డతీగల వచ్చి మాతో గ్రామసభ పెట్టించి... 'ఏమీ ప్రాంతంలో గిరిజనేతరులు ఎలాంటి కంపెనీలు పెట్టకూడదు. నాబార్డు సంస్థవారు రుణం ఇస్తారు. గిరిజన విద్యుత్ సంస్థ మరింత పెట్టుబడి సేకరించి విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి మీకు అప్పగిస్తారు. దానిని మీరే నిర్వహించుకోండి. వచ్చిన ఆదాయాన్ని మీ ఊరిబాగు కోసం ఖర్చుపెట్టండి' అని మాకు ఈ ప్రాజెక్టు మీద ఆసక్తి కలిగించారు. దాంతో మా ఊరి పెద్దలంతా ఆలోచించి జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక కమిటీగా ఏర్పడి 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నాం. ఇందులో మెజారిటీ సభ్యులు మహిళలే. గిరిజన శాఖ అధికారులు మమ్మల్ని హైదరాబాద్‌కు ఆహ్వానించారు. 2006లో అవగాహనా ఒప్పందం మీద సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు కోసం నాబార్డు రూ. 2 కోట్ల 90 లక్షలు రుణంగా ఇవ్వగా, మిగతా డబ్బును కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చింది. పవర్ ప్లాంట్ నిర్మాణం పనులను మేం దగ్గరుండి చేయించాం. యంత్రాలను ఎలా నిర్వహించాలో తెలుసుకున్నాం. కరెంట్ ఉత్పత్తి మొదలైంది. ఒక్క యూనిట్‌కి రూ. 2.49 పైసల చొప్పున విశాఖలోని సెంట్రల్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి అమ్ముతున్నాం. అంటే మన ప్రభుత్వం ప్రైవేట్ విద్యుత్ కంపెనీల దగ్గర కొంటున్న యూనిట్ ధర కంటే మా ధర చాలా తక్కువ. సంవత్సరానికి కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా... నిర్వహణ ఖర్చులు పోనూ వచ్చిన ఆదాయాన్ని మా గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలనేది మా కమిటీ తీర్మానం.

జలవిద్యుత్ కేంద్రాన్ని మేం నిర్వహిస్తున్న తీరును తెలుసుకొని 2012లో మహిళా దినోత్సవం నాడు నాతో పాటు మా కమిటీ సభ్యులను హైదరాబాద్‌లో నాబార్డు సంస్థ సత్కరించింది. పవర్ ప్రాజెక్టుని శ్రద్ధగా నిర్వహించండి, మీకు మేం అండగా ఉంటామని నాబార్డు సిజిఎం శ్రీ మోహనయ్య మాకు ధైర్యం చెప్పారు. ట్రిప్‌కో అధికారులు కూడా మాకు అన్నివిధాల సహకరిస్తున్నారు."

*- సత్యవతి*

పనులు అప్పగించి పవర్ హౌస్ నిర్మాణం పూర్తిచేశారు. 2010 నుంచి వేటమామిడి జలవిద్యుత్ ప్రాజెక్టులో ఉత్పత్తి మొదలైంది.

భారతప్రభుత్వం సాంప్రదాయేతర ఇంధనవనరుల సంస్థ 4 ప్రాజెక్టుల కోసం 13 కోట్ల 30 లక్షల రూపాయలు మంజూరైనప్పటికీ, మూడు ప్రాజెక్టులకే అనుమతి లభించింది.

### 2006లో ఒప్పందం

2006, డిసెంబర్ 5న నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి సమక్షంలో పై మూడు ప్రాజెక్టులను గిరిజన మహిళలతో ఏర్పడిన ప్రాజెక్టు కమిటీలకు అప్పగిస్తూ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ), ట్రిప్‌కోలు ప్రాజెక్టు కమిటీలతో త్రైపాక్షిక అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయు) కుదుర్చుకున్నాయి. ప్రాజెక్టుల నుండి వచ్చే నికర ఆదాయం స్థానిక గిరిజన గ్రామాల అభివృద్ధికి వినియోగించాలన్నది ఒప్పందంలో కీలకాంశం.

### వీరికి శిక్షణ ఇలా ...

అడ్డతీగల ప్రాంతంలో ఆదివాసీ మహిళలకు జలవిద్యుత్ కేంద్రాలను ప్రభుత్వం అప్పగించాక వాటిని నిర్వహించడానికి, తగిన శిక్షణనివ్వడానికి పలుకార్యక్రమాలు నిర్వహించారు. వీరికి తగిన చదువు, అర్హతలు లేనప్పటికీ సాంకేతిక శిక్షణనిచ్చి వారు స్వంతంగా ఈ విద్యుత్ కేంద్రం నిర్వహించుకునేలా తీర్చిదిద్దారు.

- ★ ఎపీ ట్రిప్‌కో వేటమామిడి, పింజరకొండ, మిట్లపాలెం వద్ద ఆరుకోట్ల రూపాయల నిర్మాణ వ్యయంతో మూడు మినీ హైడల్‌పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. ఈ ప్రాజెక్టులకు ఎంఎన్ఆర్ఐ రూ.3.10 కోట్ల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయగా, నాబార్డు సంస్థ ఆర్ఐడిఎఫ్ నుండి రూ.2.90 కోట్లు రుణాన్ని మంజూరు చేసింది.
- ★ ఏప్రిల్ 7, 2004న వెలువడిన జిఓ ప్రకారం స్థానిక ఆదివాసీ మహిళలకు ఎంహెచ్‌పిపిలను ప్రభుత్వం కేటాయించింది. ఈ జలవిద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ అమ్మకాల ద్వారా కలిగే లాభాలను స్థానిక గిరిజన మహిళలకు అందజేసి వారి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు వినియోగిస్తారు.
- ★ ప్రాజెక్టు నిర్వహణ, ప్రణాళిక అమలు కార్యక్రమం నెడ్‌క్యాప్, ప్రత్యామ్నాయ జలవిద్యుత్ కేంద్రం, ఐఐటి, ఎపీ జెన్‌కోలోని నిపుణుల పర్యవేక్షణలో సాగుతుంది. వీరు స్థానిక గిరిజన యువతకు శిక్షణ అందిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో సాగుతాయి. స్థానిక ఆదివాసీ మహిళాసంఘాల అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉంటుంది.
- ★ ఆదివాసీ మహిళా ప్రతినిధులకు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్

## మెడలోతు నీళ్లలో నది దాటాలి

"మా ప్రాజెక్టులో 12 మంది సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. వీరందరికీ జీతాల రూపం, పి రూ. 65 వేలు చెల్లిస్తున్నారు. వేసవిలో నది ప్రవాహం తక్కువ కాబట్టి తక్కువ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మేం ఉత్పత్తి చేసే కరెంట్‌పై నెలకు సుమారుగా రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. నదిలో ప్రవాహం ఎక్కువగా లేనపుడు నీటిని నిలువ చేసి ప్లాంట్‌కి వాడుతున్నాం. నేను ఉండేది వేటమామిడి పక్కనే ఉన్న తణుకురాతిపాలెం గ్రామంలో. వెయ్యిమంది జనాభా ఉంటారు. అక్కడి నుండి వేటమామిడి రావాలంటే రహదారులు లేవు. అడ్డంగా పారుతున్న ఏలేరు వాగును దాటాల్సిందే. మెడలోతు నీళ్లలో జాగ్రత్తగా దాటుకుంటూ రావాలి. మాకు ఇది రోజూ అలవాటయిపోయింది. మాకు ఆసుపత్రి, స్కూల్ కావాలి. పవర్‌ప్లాంట్ వల్ల వచ్చిన ఆదాయంతో మా గ్రామాన్ని కొంతైనా తీర్చిదిద్దాలన్న ప్రయత్నంలో ఉన్నాం. ప్రతి ఇంటికి టాయిలెట్ సౌకర్యం కల్పించుకోవాలన్నది అందరి కోరిక. దీనివల్ల ఊరు పరిశుభ్రంగా ఉంటుంది. బ్యాంకులు సాయం చేస్తే పాడిపశువుల పెంపకం చేపట్టాలని ఉంది."

*-బట్టు రాజేశ్వరి, ట్రెజరర్, ప్రాజెక్టు కమిటీ మెంబర్*



Sthanika_Color_jan13.indd 20 29/12/12 5:48 PM



వంటి సాంకేతిక శిక్షణ కోసం బిహెచ్ఈఎల్, నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నైవేలీ సంస్థల సహకారాన్ని ఏపీ జెన్‌కో తీసుకుంది.

- విద్యుత్ ఉత్పత్తి, యంత్రపరికరాల నిర్వహణ, పవర్ హౌస్ నిర్మాణం, జలవనరుల మళ్లింపు, టర్బైన్‌ను పనిచేయించడం లాంటి విషయాల్లో ఆదివాసీలకు అవగాహన కల్గించడానికి ట్రిప్‌కో వివిధ కార్యక్రమాలు చేపట్టింది.

ఇరవైమంది సభ్యులకు శెట్టిపేట, నిడదవోలు ప్రాంతాల్లో నడుస్తున్న జలవిద్యుత్ కేంద్రాలలోని పనివిధానాన్ని ప్రత్యక్షంగా చూపించడం ద్వారా ప్రయోగాత్మకంగా శిక్షణ అందించారు. దీనివల్ల ప్రాజెక్టు కమిటీ సభ్యులు వేటమామిడిలో జలవిద్యుత్ కేంద్రాన్ని స్వయంగా నిర్వహించ గలిగే సామర్థ్యాన్ని పొందారు.

ఆదివాసీ యువతకు శెట్టిపేట, ఎంహెచ్‌పిపి వద్ద 45 రోజుల పాటు సాంకేతిక శిక్షణను దశల వారీగా, గ్రూప్‌లుగా నిర్వహించారు. ఒక్కొక్క గ్రూప్‌కు ఒక్కొక్క దశలో 15 రోజుల శిక్షణ ఇచ్చి కొత్తగా నిర్మించే జలవిద్యుత్ కేంద్రాల వద్ద పనిచేయించడంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

## జనహితం... జలవిద్యుత్

ఈ ప్రాంతంలో జలవిద్యుత్ ఏర్పాటు వల్ల భవిష్యత్‌లో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని విద్యుత్ నిపుణులు అంటున్నారు.

### ప్రాజెక్టు నిర్మాణంలో ఐక్యంగా పనిచేశాం

"మా గ్రామం నుండి వృధాగా పోతున్న ఏలేరు నది నీళ్ళతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని ప్రభుత్వ అధికారులు చెప్పాక మాకెంతో ఆనందం కలిగింది. అలాంటి కరెంట్ తయారీలో మాకు భాగస్వామ్యం కలిగించడం గొప్ప అవకాశం. జలవిద్యుత్ ప్రాజెక్టువల్ల వచ్చే ఆదాయంతో మా గిరిజన పల్లెలు బాగుపడతాయనే ఆశతో ఉన్నాం. వేటమామిడి గ్రామంలో రోడ్లు, పాఠశాల, మరుగుదొడ్లు ఇతర అభివృద్ధి పనులను పవర్‌ప్రాజెక్టు లాభాల వల్ల వచ్చే డబ్బుతో చేపట్టాలనుకుంటున్నాం. మా పిల్లలకు ఈ ప్రాజెక్టులో ఉపాధి అవకాశాలుంటాయని మా ఆశ. మా కమిటీకి ఇచ్చిన శిక్షణతో ప్రాజెక్టు నిర్మాణంలో కాంట్రాక్టర్లపై మా పర్యవేక్షణ వల్ల దుబారా ఖర్చు తగ్గించాం. నిర్మాణంలో నాణ్యతను కాపాడాం. నేను ఐదవతరగతి మాత్రమే చదివాను. సాంకేతికపరంగా ఐటిఐ అర్హత లేకపోయినా, హైడల్‌పవర్ యంత్రాలను నిర్వహించే సామర్థ్యాన్ని గిరిజన విద్యుత్ సంస్థ అధికారులు ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్నాం."

*- దేవకాంతమ్మ*
*ప్రాజెక్టు కమిటీ సభ్యురాలు, వేటమామిడి*

పర్యావరణానికి ఏ మాత్రం హాని చేయని ఈ ప్రాజెక్టు వల్ల ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

- ప్రాజెక్టు కోసం నిర్మించిన రోడ్లు, ఇతర మౌలిక వసతుల వల్ల స్థానిక గ్రామాలకు విద్య, ఆరోగ్య సౌకర్యాలు కలుగుతాయి. స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి.
- జలాశయంలో చేపల పెంపకం, చేపల వేట పెరిగి దాని మీద ఆధారపడే ప్రజానీకం ఆదాయాలు పెరుగుతాయి.
- స్థానిక ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. జలవిద్యుత్తు కేంద్రం నిర్మాణ సమయంలో ప్రత్యక్షంగాను, దాని అనుబంధ కార్యకలాపాల ద్వారా పరోక్షంగాను ఉపాధి లభిస్తుంది.

### తొలివిజయం

"మా గ్రామానికి హైడల్ పవర్ ప్రాజెక్టు వచ్చాక ఉత్సాహంగా పనిచేసే మహిళలతో ప్రాజెక్టు కమిటీ ఏర్పడింది. 2006 డిసెంబర్ 3న ఐటిడీఏ, ట్రిప్‌కోలతో మా గ్రామ ప్రాజెక్టు కమిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాక... మమ్మల్ని ఏలేశ్వరం తీసుకెళ్లి అక్కడి పవర్ ప్రాజెక్టు పనిచేస్తున్న తీరును చూపించారు. అలాగే నిడదవోలు దగ్గర శెట్టిపేటలోని ప్రైవేట్ హైడల్ ప్రాజెక్టుని కూడా మా కమిటీ సభ్యులం చూసొచ్చాం.

2005లో హైదరాబాద్, శిల్పారామంలో జరిగిన గిరిజన మేళాలో మేం ప్రదర్శించిన వేటమామిడి ప్రాజెక్టు మోడల్‌కి ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. అదే మా తొలి విజయం. ఆ ఉత్సాహంతో పవర్‌ప్రాజెక్టు నిర్వహిస్తున్నాం.

నేను 5వ తరగతి చదివినప్పటికీ, మాకు ఇచ్చిన శిక్షణ వల్ల ప్రాజెక్టు నిర్వహణలో ఇబ్బందులు లేవు. మా కమిటీలోని 19 మంది షిఫ్ట్‌ల వారీగా పవర్ ప్రాజెక్టుని పర్యవేక్షిస్తున్నారు.

"కేంద్ర ప్రభుత్వం నుండి యాభై పైసల వడ్డీకి అప్పు తెచ్చి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల 2004లో పూర్తవ్వాల్సిన ప్రాజెక్టు 2010నాటికి పూర్తయింది."

*- మద్దికొండ వందనం, ప్రాజెక్టు కమిటీ సెక్రెటరీ*

- స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవ్వడం వల్ల గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు తగ్గిపోతాయి.
- అడ్డతీగల ప్రాంతంలో అక్షరాస్యత పెరిగేందుకు దోహదపడుతుంది.
- పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. ఏలేరు నదిపై వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ వగైరా అభివృద్ధి చేస్తే పర్యాటకులను ఆకట్టుకోవచ్చు.
- గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజానీకం ఆహారం, పశువుల మేత, వంటచెరుకు లాంటి వాటికోసం అడవిపై ఆధారపడడం తగ్గిపోవడంతో అడవుల క్షీణత తగ్గి పచ్చదనం పెరుగుతుంది.
- మారుమూల ప్రాంతాల ప్రజలకు విద్యుత్తు సౌకర్యం లభిస్తుంది.

*- శ్యాంమోహన్, సీనియర్ పాత్రికేయుడు.*
*(ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు, పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై అధ్యయనం చేస్తున్నారు)*



Sthanika_Color_jan13.indd 21 29/12/12 5:48 PM






# పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చటానికే భారత నిర్మాణ్ వాలంటీర్లు

**ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని అందించడంతో పాటు అన్ని వర్గాల వారిని చైతన్యవంతుల్ని చేయడంలో ప్రజా సంబంధాల నిపుణులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్ అన్నారు.**

డిసెంబర్ 15, 2012న పబ్లిక్ గార్డెన్ రోడ్డు, హోటల్ గ్రాండ్ ప్లాజ్‌లో పబ్లిక్ రిలేషన్స్ సొసైటి ఆఫ్ ఇండియా మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ (అపార్డు) సంయుక్తాధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన - కమ్యూనికేషన్ వ్యూహం' అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చా గోష్టిలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం గత 66 సంవత్సరాలుగా పేదరిక నిర్మూలన కోసం పలురకాలైన పథకాలను ప్రవేశపెడుతున్నప్పటికీ, ఆ పథకాలన్నీ నిజమైన పేద ప్రజలకు చేర్చడంలో కొన్ని లోపాలున్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలసి గ్రామీణ పేద ప్రజలకు సుమారు 255 ప్రభుత్వ పథకాల క్రింద 8 లక్షల కోట్ల రూపాయలు కేవలం ఒక సంవత్సర కాలంలో ఖర్చు చేస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రజలు ఇప్పటికీ ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారన్నారు. గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందటం లేదని, 66 శాతం గృహాల్లో ఇంకా సరైన పారిశుధ్య సౌకర్యాలు లేవని ఆయన తెలిపారు. వీటన్నింటికీ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు చేరటంలో లోపం ఉందని అన్నారు. ఈ సమస్యను అధికమించడానికి 'కీ- క్యాప్' లో భాగంగా అపార్డ్ భారత్ నిర్మాణ్ వాలంటీర్ల వ్యవస్థను రూపొందించిందన్నారు.

గ్రామాల్లో ఎంపిక చేసిన యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి భారత్ నిర్మాణ్ వాలంటీర్లగా తయారు చేస్తుందని, శిక్షణ తీసుకున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వారి వారి గ్రామాల్లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తారని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూస్తారని, అదే విధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం కలిగించి, వారి వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చే విధంగా వాలంటీర్లు కృషి చేస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం 1753 గ్రామ పంచాయితీల్లో 30820 భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో యువత పూనుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాలు అభివృద్ధికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పి.ఆర్.ఎస్.ఐ. జాతీయ అధ్యక్షులు శ్రీ అజిత్ పాఠక్ మాట్లాడుతూ, దేశంలో పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం పెరుగుతోందని, పేదవాడి పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు రావటం లేదని అన్నారు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చటంలో పౌర సంబంధాల నిపుణుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. వినూత్న ప్రచార విధానాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలన్నారు.

శ్రీ నరసింహా రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలోని ప్రతీ కుటుంబాన్ని చేరటానికి అవలంబించాల్సిన వ్యూహాలను ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఈ సంగోష్టిని నిర్వహిస్తున్నామని అన్నారు.

మొబైల్ టెక్నాలజీ సేవల ద్వారా ప్రతీ సమాచారాన్ని లబ్ధిదారులకు శాఖ సులభంగా చేర్చవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమంలో సమాచార మాజీ డైరెక్టర్ డా॥ సి.వి. నరసింహారెడ్డి పి.ఆర్.ఎస్.ఐ., జాతీయ అధ్యక్షులు డా॥ అజిత్ పాఠక్, ఛాప్టర్ ఛైర్మన్ శ్రీ ఎన్.ఎల్. నరసింహారావు, సెక్రటరీ డి.వి. సుబ్బారావు, అపార్డు జాయింట్ డైరెక్టర్ డా॥ సి. నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్ జాయింట్ సెక్రటరీ శ్రీ కుమార్ రాజా, వివిధ రాష్ట్రాలు నుండి వచ్చిన పి.ఆర్.ఎస్.ఐ. ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. ◆

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : **K. Chandra Mouli**



Sthanika_Color_jan13.indd 32 29/12/12 5:49 PM